అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని ఆశిస్తున్నా. రైతులు, మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుంది. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..
— ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


సంపుటి 28, సంచిక: 191 | గురువారం | 01-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


### శుభాకాంక్షలు




పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' నూతన సంవత్సర శుభాకాంక్షలు

### సెలవు

నూతన సంవత్సరం సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి గురువారం సెలవు. శుక్రవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.
- ఎడిటర్



## న్యూజిలాండ్ నుండి బ్రెజిల్ వరకూ
# న్యూ ఇయర్ సందడి

**వెల్లింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా 2026 కొత్త సంవత్సరం సందడి ప్రారంభమైంది. చాలా యూరప్ దేశాలలో ఈ క్రిస్మస్ మాసం నుండీ ఈ సందడి మార్కెట్లలో కొనసాగుతూ వస్తోంది. ప్రపంచంలో కొత్త సంవత్సరం పొద్దు పొడుపుకోసం ప్రజలంతా ఎంతో భావోద్వేగంతో ఎదురుచూస్తున్నారు. కానీ భౌగోళికంగా దక్షిణ హవాయ్ సమీపం పసిఫిక్ సముద్రంలోని కిరితిమతి దీవిలో 2026 కొత్త సంవత్సరం కాలమానం ప్రారంభమైంది. ఆ తర్వాత న్యూజిలాండ్ ఛాత్తం దీవిలో, ఆక్లాండ్, టోగాన్‌లలో ప్రజలు సంగీత వాయిద్యాలతో, బాణసంచాతో స్వాగతం పలికారు. శాంతి వెల్లివిరియాలని దేవుడు ఆశీర్వదించాలని ప్రజలు కోరుకున్నారు. ఇండోనేసియాలో ప్రజలు తమదైన తరువాయి 2లో



ఉద్యోగుల పెండింగ్ బిల్లులు
## రూ.713 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులలో డిసెంబర్ నెలకు సంబంధించి రూ.713 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సిఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు డిసెంబర్ నెలకు సంబంధించిన రూ.713 కోట్ల బిల్లులను తరువాయి 2లో

## మోదీ విధ్వంస పాలన



కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది (2025) కూడా బిజెపి 'దోపిడీ, అవినీతి, దుర్మార్గపాలన' సాధారణ పౌరుల జీవితాలను శాసించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంవత్సరం చివరి రోజున అన్నారు. 2025లో మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశంలో జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ ఒక జాబితా విడుదల చేసింది. సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీపై సుదీర్ఘ ఆరోపణల జాబితాను ఖర్గే బుధవారం వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ, ఉపాధి, సామాజిక న్యాయం, జాతీయ భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వం నిర్వహించిన తీరుపై ఆయన మోదీ ప్రభుత్వాన్ని తరువాయి 12లో

## మూడేళ్లలో
# డిండి పూర్తి

- పదేళ్ల బిఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టుపై పూర్తి నిర్లక్ష్యం
- నీళ్లు ఎక్కడి నుంచి ఎక్కడికి పోవాలో డిపిఆర్ లేకుండా కాలయాపన చేసిన ఘనత గత ప్రభుత్వానిదే
- మా ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1800 కోట్లు కేటాయించింది
- మరో ఐదేళ్లు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/చండూరు

సాగు నీటి రంగంలో రాష్ట్రంలోనే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే ఎస్‌ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టును రానున్న మూడు సంవత్సరాల కాలంలో పూర్తి చేసి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఓ న్యూస్ ఛానల్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ దశదినకర్మ కార్యక్రమం మండల పరిధిలోని అంగడిపేట బిఆర్‌సి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బోయపల్లి సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బిఎల్ఆర్‌తో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తరువాయి 2లో



- రూ. 3వేల కోట్ల ఆస్తి పన్ను లక్ష్యం
- వేగంగా హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులు
- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్

పారిశుద్ధ్యంలో హైదరాబాద్‌ను
## అగ్రగామిగా నిలుపుతాం

ప్రజాపక్షం/హైదరాబాద్

పారిశుద్ధ్యంలో హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు 2026ను లక్ష్యంగా చేసుకుని పని చేస్తామని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ 2025లో జాతీయ స్థాయిలో జిహెచ్‌ఎంసి 6వ ర్యాంకు సాధించడంతో పాటు 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీగా గుర్తింపు పొందిందన్నారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్‌పాటిల్, అపూర్వ చౌహాన్, అదనపు సి.ఎన్.రఘుప్రసాద్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ 27 పట్టణ స్థానిక సంస్థల విలీనంతో జిహెచ్‌ఎంసి పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్లకు విస్తరించిందని, ప్రస్తుతం 300 వార్డుల్లో రోజుకు సుమారు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని చెప్పారు. చెత్త నిర్వహణ కోసం కొత్త డంపింగ్ యార్డుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి తరువాయి 2లో

ఎస్‌ఎస్‌ఎల్‌వి... 3వ దశ
## 'పరీక్ష సక్సెస్'

- శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలోని ఎస్ఎంఎస్‌టిసి వేదికగా ప్రయోగం
- చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి వేగంగా ప్రయోగించేందుకు ఈ మూడవ దశ రూపకల్పన



**బెంగళూరు :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరొక ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వి) మూడవ దశ(ఎస్ఎస్3)ను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి)లో తరువాయి 12లో

యూరియా సరఫరాపై
## నిరంతర పర్యవేక్షణ

- జిల్లాల్లో సమృద్ధి నిల్వలున్నా రైతుల్లో ఆందోళనలు సృష్టించే కుట్రలు
- ఇప్పటి వరకూ 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల తరువాయి 12లో

సిపిఐ వందేళ్ళ బహిరంగసభకు
# ఎపి నుంచి 50 వేల మంది

**విజయవాడ నుండి ఒకటి, రాయలసీమ నుంచి ఐదు ప్రత్యేక రైళ్ళు**




**విజయవాడ :** కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజాతంత్రవాదులను, ప్రజాతంత్ర సంస్థలను, ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు కుట్రలు పన్నుతున్నదని, దానిని ప్రజాస్వామిక వాదులందరూ ఏకోన్ముఖంగా తిప్పికొట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యలపై సమ్మెలు, పోరాటాలు దేశంలో ఎక్కడా జరగకూడదనే కుతంత్రాలకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఒడిగడుతోందని ధ్వజమెత్తారు. విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం సిపిఐ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావులతో కలిసి రామకృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించారు.వీటన్నిటిపై చర్చించేందుకు జనవరి 19, 20, 21 తేదీల్లో తరువాయి 2లో






# ప్రపంచం
WORLD NEWS

## నేటి నుండి భారత్,చైనా,కొరియాపై మెక్సికో టారిఫ్‌లు

**మెక్సికోసిటీ :** ఆసియా దేశాల నుండి దిగుమతయ్యే సరుకులపై మెక్సికో దేశం టారిఫ్‌లు పెంచింది. గణనీయంగా పెరిగిన టారిఫ్‌లు కొత్త సంవత్సరం మొదటి రోజు నుండి అమలులోకి వస్తాయి. మెక్సికోలో దేశీయంగా 3.50 లక్షలమంది ఉద్యోగాలను కాపాడేందుకే ఈ టారిఫ్‌లు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా విదేశాల నుండి దిగుమతయ్యే వస్తువులు దేశీయంగా కూడా తయారవుతున్నాయి. ఈ పరిశ్రమలలో ఉద్యోగులను కాపాడేందుకే ఈ చర్య తీసుకున్నారు. ముఖ్యంగా చైనా, భారత్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ టారిఫ్‌లు విధించింది. ఐతే చైనా సహా మెక్సికోలని పలు పరిశ్రమలు కూడా ఈ పెరుగుదలను వ్యతిరేకించాయి. ఈ టారిఫ్‌లు విధించడానికి మెక్సికో కాంగ్రెస్ డిసెంబరు మొదటివారంలోనే ఆమోదం తెలియజేసింది.

## ఖలీదాజియాకు కన్నీటి వీడ్కోలు



**ఢాకా :** లక్షల మంది ప్రజల సమక్షంలో బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదాజియా (80) అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం అధికార లాంఛనాలతో పూర్తిచేశారు. ఆమె భర్త జియావుర్ రెహ్మాన్ సమాధి పక్కనే ఆమెను ఖననం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ సెలవుదినం పాటించారు. జాతీయ పతాకాన్ని అవనతం చేశారు. అనేకచోట్ల ఆమె సంస్మరణ కార్యక్రమాలు జరిగాయి. విభిన్న జీవనరంగాలకు చెందిన లక్షలమంది ఆమె అంత్యక్రియల ప్రార్థనల్లో (నమాజ్ ఏ జనజ) పాల్గొన్నారు. జాతీయ మసీదు బైతుల్ ముక్రమ్ ఖాతిబ్ ముఫ్తీ మహ్మద్ అబ్దుల్ మలెక్ ఈ అంత్యక్రియల ప్రార్థనలు నిర్వహించారు. మానిక్ మియా ఎవెన్యూ పశ్చిమ శివారులో ఈ కార్యక్రమం జరిగింది. ఖనన ప్రదేశానికి ప్రజలను అనుమతించలేదు. బుధవారం ఉదయం నుండే ప్రజలు పెద్ద ప్రవాహంలా అంత్యక్రియల ప్రదేశానికి చేరుకోవడం ప్రారంభించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకుడు, స్థాయీ సంఘం కమిటీ సభ్యుడు నజ్రుల్ ఇస్లాం ఖాన్ ఈ సందర్భంగా ఖలీదాజియా జీవిత చరిత్రను సంగ్రహంగా చదివి వినిపించారు. ఖలీదాజియా మంగళవారం ఉదయం ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో కన్నుమూశారు. దేశ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ మహ్మద్ యూనుస్, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జుబయర్ రెహ్మాన్ చౌధురి, ఖలీదా జియా కుమారుడు, బిఎన్‌పి పార్టీ తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ తదితరులు ఈ అంత్యక్రియల ప్రార్థనల్లో పాల్గొన్నారు. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారత్ తరపున హాజరైన కేంద్ర మంత్రి జైశంకర్ ఖలీదాజియా అంత్యక్రియల కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరపున కేంద్ర విదేశీమంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పంపించిన సంతాప సందేశాన్ని ఖలీదా జియా కుమారుడు, బిఎన్‌పి తాత్కాలిక చైర్మన్ తారిఖ్ రెహ్మాన్‌కు జైశంకర్ అందజేశారు. ఢాకా విమానాశ్రయంలో బుధవారం ఉదయం దిగిన వెంటనే జైశంకర్ వెళ్ళి రెహ్మాన్‌ను కలుసుకున్నారు. ఆయనకు భారత ప్రజల తరపున సంతాపం తెలియజేశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉన్న ఖలీదాజియా మంగళవారం ఉదయం మరణించారు. ఆమె దార్శనికతను, ఆమె పాటించిన విలువలను దేశం కొనసాగిస్తుందన్న ఆశాభావం ప్రధానమంత్రి మోదీ తన సందేశంలో వ్యక్తం చేశారు. ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళ్ళగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. "మరణవార్త విని తీవ్రంగా కలత చెందాను, మీ కుటుంబానికి, ప్రజలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం" అని సోషల్ మీడియాలో మోదీ పేర్కొన్నారు. భారత్‌తోపాటు పలు ఆసియా దేశాల ప్రతినిధులు,నాయకులు కూడా అంత్యక్రియలకు హాజరయ్యారు. భూటాన్ విదేశీ వ్యవహారాల మంత్రి లయోన్‌పో ధుంగ్యేల్, శ్రీలంక విదేశీమంత్రి విజిథ హెరత్ కూడా హాజరై ఖలీదాజియాకు నివాళులు అర్పించారు. మాల్దీవుల తరపున ఉన్నతవిద్యా, కార్మిక మంత్రి అలీ హైదర్ అహ్మద్, పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ నేపాల్ విదేశీ మంత్రి బాలానంద శర్మ పాల్గొన్నారు.

## యుద్ధ ఖైదీలను విడుదల చేసిన థాయ్



**బ్యాంకాక్ :** సరిహద్దు వివాదం, ఘర్షణలతో అతలాకుతలమవుతున్న ఇరుగుపొరుగు దేశాలు కాంబోడియా–థాయ్‌లాండ్ ఇరవై రోజుల భీకర యుద్ధానికి తెరదించాయి. తాజాగా కుదిరిన కొత్త ఒప్పందంలో భాగంగా థాయ్‌లాండ్ చెరలో ఉన్న 18 మంది కాంబోడియా యుద్ధ ఖైదీలను బుధవారం విడుదల చేసింది. ఈ యుద్ధ ఖైదీలు ఐదు నెలలుగా థాయ్‌లాండ్ చెరలో మగ్గుతున్నారు. రెండు దేశాలమధ్యా వినాశకరమైన పోరాటం తర్వాత ఈ సైనికుల విడుదల ఒక పెద్ద ఆటంకాన్ని తొలగించింది. రెండు దేశాల సరిహద్దుల్లో ఉన్న చారిత్రక కట్టడాలు తమవంటే తమవంటూ ఈ రెండు దేశాలమధ్యా దీర్ఘకాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ వివాదమే యుద్ధాలకు ఆజ్యం పోస్తోంది. జెనీవా చట్ట నిబంధనల ప్రకారం పురుషులను నిర్బంధంలో ఉంచుకోవచ్చుననీ, రెండు దేశాలమధ్యా శత్రుత్వం పూర్తిగా ముగిసిపోయేవరకూ ఈ యుద్ధ ఖైదీలను విడుదల చేసేదేలేదని ఇప్పటివరకూ థాయ్‌లాండ్ మంకుపట్టు పట్టింది. ఎట్టకేలకు ఈ ఆటంకం మంచుతెరలా తొలగిపోయింది. జులైలో చెలరేగిన ప్రాణాంతకమైన యుద్ధ ఘర్షణల సందర్భంగా థాయ్‌లాండ్ ఈ సైనికులను నిర్బంధంలోకి తీసుకుంది. "ఏసియన్" కూటమి మధ్యవర్తిత్వ చర్యల్లో భాగంగా చైనా నుండి దౌత్యపరమైన ఒత్తిడి పెరగడంతో రెండు దేశాలమధ్యా తాజా ఒప్పందం కుదిరింది. ఈ యుద్ధం వల్ల రెండు దేశాల సరిహద్దు గ్రామాల్లో నివసించే 5,00,000 మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారు.

2025 జులైలో ఈ రెండు పొరుగుదేశాలమధ్యా యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒప్పందం కుదిరినప్పటికీ విడతలవారీగా నిన్నమొన్నటివరకూ మూడుసార్లు యుద్ధం జరిగింది. 'మీరంటే మీరే...' కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ రెండు దేశాలు తగవులాడుకుంటూ అమెరికాసహా ఇతర మధ్యవర్తుల సహాయంతో కాల్పుల విరమణ ఒప్పందాలకు దిగాయి. డిసెంబరు 27న రెండు దేశాల రక్షణ మంత్రులమధ్యా కుదిరిన ఒప్పందం ప్రకారం థాయ్‌లాండ్ ఛాంతబురి రాష్ట్రం, కాంబోడియా పైలియన్ రాష్ట్రం మధ్య ఉన్న సరిహద్దు ప్రాంతం వద్ద యుద్ధ ఖైదీలు స్వదేశంలోకి కాలుపెట్టారు. రెండు దేశాలమధ్యా సుహృద్భావం, విశ్వాస పునరుద్ధరణకు, అంతర్జాతీయ మానవతా సూత్రాలకు అనుగుణంగా 18 మంది కాంబోడియా సైనికులను విడుదల చేశామని థాయ్‌లాండ్ విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

అదేవిధంగా కాంబోడియా విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, ఈ సైనికుల విడుదలతో రెండు దేశాలమధ్యా శాంతి, స్థిరత్వ సాధనకు, సాధారణ సంబంధాల పునరుద్ధరణకు, ఇరు దేశాల ప్రయోజనాలకు దోహదం చేస్తాయని తెలిపింది.

## టర్కీలో ఐఎస్ వ్యతిరేక దాడులు

### వారం రోజుల్లో 600 మంది అరెస్టు

**అంకారా :** టర్కీలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమంకొనసాగుతోంది. వరుసగా బుధవారం కూడా టర్కీ ప్రభుత్వ దళాలు దేశవ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో 125 మందిని అరెస్టు చేశాయి. మొదటిరోజు 327 మందిని అరెస్టు చేశారు. గడచిన వారం రోజుల్లో మొత్తంగా 600 మందిని అరెస్టు చేశారు. 21 రాష్ట్రాలలో దాడులు చేసినట్లు హోంమంత్రి ప్రకటించారు. సెలవుదినాల్లో జనసమ్మర్థమైన ప్రాంతాల్లో దాడులు చేసేందుకు ఐఎస్ ఉగ్రవాదులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ ఏరివేత కార్యక్రమం కొనసాగుతోంది. మొదట క్రిస్మస్ రోజున 115 మందిని అరెస్టు చేశారు. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా దాడులు ఉద్ధృతం చేయాలని ఉగ్రవాదులు నిర్ణయించుకున్నట్లు సమాచారం తెలియడంతో టర్కీ ప్రభుత్వం అప్రమత్తమైంది.

## మయన్మార్ తొలిదశలో 50 శాతం ఓటింగ్

**ప్యాంగ్‌యాంగ్ :** మయన్మార్ పార్లమెంటుకు జరిగిన తొలిదశ ఎన్నికల్లో యాభై శాతం పోలింగ్ నమోదైనట్లు జుంటా సైనిక ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. తొలిదశలో 11.6 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని సైనిక ప్రభుత్వ ప్రతినిధి జామిన్‌తున్ రికార్డెడ్ సందేశంలో చెప్పారు. విజయవంతమైన ఈ ప్రక్రియ తమ ప్రభుత్వ విజయం కాదని, దేశ విజయం, ప్రజల విజయమని ఆయన పేర్కొన్నారు. కాగా 2020లో జరిగిన ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ నేషనల్ లీగ్ పార్టీ పోటీ చేసినప్పుడు ఒకేవిడత ఎన్నికల్లో 70 శాతం పోలింగ్ జరిగింది. కానీ ఈ ఎన్నికల్లో మోసం, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సైనిక నాయకుడు ఆంగ్ హ్లైంగ్ ఎన్నికైన ప్రజాతీర్పును రద్దుచేసి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మయన్మార్‌లో మూడుదశల్లో పోలింగ్ జరుగుతోంది. ఫిబ్రవరి రెండోవారంనాటికి ఎన్నికల ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. 2021లో సైనికులు ప్రభుత్వాధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇక అప్పటి నుండి దేశంలోని పలు ప్రాంతాలలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. ఇప్పటికీ అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. సైనిక పాలకులు తమ అధికారాన్ని స్థిరీకరించుకోవడంకోసమే బూటకపు ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఐక్యరాజ్యసమితి కూడా పరోక్ష విమర్శలు చేసింది. పాశ్చాత్య దేశాల దౌత్యవేత్తలు ఈ ఎన్నికల తీరును ఖండిస్తున్నారు.

## నేటి నుండి బల్గేరియాలో యూరో కరెన్సీ

**సోఫియా :** ఆగ్నేయ యూరప్ ప్రాంత దేశం బల్గేరియాలో 2026 జనవరి ఒకటో తేదీ నుండీ యూరో కరెన్సీ చెలామణీలోకి వస్తుంది. దీనికోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఒక దేశం యూరో కరెన్సీ జోన్‌లో చేరాలా? వద్దా? అనే విషయాన్ని యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ నిర్దేశిత ఆర్థిక ప్రామాణిక సూత్రాల ద్వారా ఆమోదం తెలియజేస్తుంది.

యూరోపియన్ యూనియన్ కమిషన్, యూరో సెంట్రల్ బ్యాంక్ 2025 జూన్ నాలుగో తేదీన ఆమోదం తెలియజేసిన తర్వాత, దేశంలో యూరో కరెన్సీని అమలులోకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన మూడు చట్టాలను 2025 జులై 8వ తేదీన బల్గేరియా చట్టసభ ఆమోదించింది. దీంతో యూరో జోన్‌లో చేరిన 21వ సభ్యదేశంగా బల్గేరియా రికార్డుల్లోకి ఎక్కింది. 60.70 లక్షలు జనాభా గల ఈ బాల్కన్ దేశం 2007 జనవరి ఒకటో తేదీ నుండి యూరోపియన్ యూనియన్‌లో సభ్యురాలుగా కొనసాగుతోంది. యూరోపియన్ యూనియన్ కామన్ కరెన్సీలో చేరడం ద్వారా బల్గేరియా ఇకమీదట అనేక ప్రయోజనాలు అందుకోనున్నది.

## ఎపి నుంచి 50 వేల మంది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం నగరంలో సిపిఐ జాతీయ కార్యవర్గ, సమితి సమావేశాలు జరగనున్నాయని వెల్లడించారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఈనెల 26వ తేదీన సిపిఐ శత వార్షికోత్సవాలను దేశ వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించి, ఎర్ర జెండాలను రెపరెపలాడించినట్లు తెలిపారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర గల సిపిఐ నిత్యం పేద, శ్రామిక వర్గాల ప్రజల కోసం ఉద్యమిస్తోందన్నారు. స్వాతంత్రోద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీతోపాటు కాంగ్రెస్ మాత్రమేనన్నారు. సిపిఐ 1925లో ఆవిర్భవించి ఒక్క శక్తిగా శ్రామిక, పేద వర్గాల తరపున పోరాడుతోందని వివరించారు.

ఘనమైన చరిత్రగల సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు వేడుకలు జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం గడ్డపై జరగనున్నాయన్నారు. ఈ శత వార్షికోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా జరిగే ప్రదర్శన, బహిరంగసభలకు దేశ నలుమూలల నుండి 5 లక్షల మంది పార్టీ శ్రేణులు తరలిరానున్నారని తెలిపారు. మరో 40 దేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని, ఖమ్మం ఎర్ర సముద్రంలా మారనుందని చెప్పారు.

**ఎపిలో అన్ని జిల్లాల నుంచి తరలివస్తాం : గుజ్జుల ఈశ్వరయ్య**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం, దాని పోరాటం, త్యాగం, సాధించిన లక్ష్యాలను వివరించేందుకుగాను ఖమ్మం గడ్డంపై జరగబోయే శత వార్షికోత్సవ ముగింపు సభ ఒక చారిత్రాత్మకంగా నిలవనుందని తెలిపారు. దీనికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 50 వేల మంది తరలివెళ్లనున్నట్లు ప్రకటించారు.

విజయవాడ నుంచి ఒకటి, రాయలసీమ నుంచి 5 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులందరికీ ఖమ్మం సభ ఒక జవాబు చెప్పనుందన్నారు. దోపిడీ వ్యవస్థ ఉన్నంత వరకు ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని వెల్లడించారు. సిపిఐ శతవార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ జనవరి 10, 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోను జీపు జాతాలు, మోటారు సైకిల్ జాతాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## అగ్రగామిగా నిలుపుతాం

(మొదటి పేజీ తరువాయి)

2026–27 రూ. 3,000 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

**పారిశుద్ధ్యంలో కీలక విజయాలు**

స్వచ్ఛ సర్వేక్షణ 2025లో 6వ ర్యాంకు, 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు, వాటర్ ప్లస్, ఓడిఎఫ్ రీ సర్టిఫికేషన్‌తో పాటు 'ప్రామిసింగ్ స్వచ్ఛ శహర్ తెలంగాణ' అవార్డు హైదరాబాద్‌కు దక్కిందని కమిషనర్ తెలిపారు. సిఎం ఆదేశాల మేరకు 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కొనసాగిస్తామని చెప్పారు.

**వ్యర్థాల నిర్వహణలో ఆధునిక సదుపాయాలు**

జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల ఆర్‌డిఎఫ్ ఆధారిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్2), రోజుకు 1000 టన్నుల సామర్థ్యం గల ఆర్‌డిఎఫ్ తయారీ యూనిట్ ప్రారంభించామన్నారు. ఖైత్లాపూర్‌లో 300 టన్నుల బయోమెథనేషన్, బయో సీఎన్‌జీ ప్లాంట్లతో నగర వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 10 వేల టన్నులకు చేరిందన్నారు. పారిశుద్ధ్య నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10,752 చలాన్లు జారీ చేసి రూ.2.34 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. అందిన ఫిర్యాదుల్లో 99 శాతం పైగా పరిష్కరించినట్లు చెప్పారు.

**మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్**

నగరమంతటా మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, ఇందులో భారీ చెత్త, లెగసీ వ్యర్థాలు, నిరుపయోగ వాహనాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు సమాచారం అందించేందుకు జిహెచ్‌ఎంసి వాట్సాప్ నెంబర్ 81259 66586, కాల్ సెంటర్ 0402111 1111లను సంప్రదించాలని సూచించారు. నగరంలో వినియోగంలోని లేని వాహనాలను నగర ప్రజలు తొలగించుకోవాలని, వాటిని రహదారులపై పెడితే వాటిని తాము తొలగిస్తామని చెప్పారు. ఇలాంటివి ఎక్కడైన తమకు ఫిర్యాదు చేయాలన్నారు.

**ప్రజారోగ్యం, మౌలిక వసతులు**

2025లో డెంగీ కేసులు గత ఏడాదితో పోలిస్తే 30 శాతం తగ్గి 1,977కు చేరాయని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రూ.2,706 కోట్లతో 9,993 ఇంజినీరింగ్ పనులు చేపట్టగా, ఇప్పటికే రూ.1,023 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 పనులకు త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. వ్యూహాత్మక నాలా అభివృద్ధి (ఎస్ఎన్‌డిపి) రూ.667 కోట్ల వ్యయంతో రెండో దశ నాలా పనులు వేగంగా జరుగుతున్నాయి.

1,121 కిలోమీటర్ల మేర స్టామ్ వాటర్ డ్రైన్ మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. పిజెఆర్ ఫ్లైఓవర్, ఫలక్‌నుమా ఆర్.ఓ.బి (ఆర్ఓబి), ఆరాంఘర్ ఫ్లైఓవర్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. నగరం అంతటా 400 అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్స్ (ఎటిఎస్‌సి) ఏర్పాటు చేశామన్నారు.

**ఆస్తి పన్ను, డిజిటల్ గవర్నెన్స్**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ఆస్తులను సర్వే చేయగా, కొందరు చెల్లించాల్సిన పన్ను కంటే తక్కువ చెల్లిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మధ్యవర్తుల అవసరం లేకుండా జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్, యాప్ ద్వారా నేరుగా పన్ను చెల్లించాలని ప్రజలకు సూచించారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.1,512 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికమన్నారు.

నగర పాలనను డేటా ఆధారితంగా మార్చేందుకు సమగ్ర జిఐఎస్ ఆధారిత మ్యాపింగ్‌ను చేపట్టామన్నారు. 650 చదరపు కిలోమీటర్ల మేర 5 సెంటీమీటర్ల స్పష్టతతో హైరిజల్యూషన్ మ్యాపింగ్ పూర్తి చేశామని, ఆస్తిపన్ను డేటాను విద్యుత్ శాఖ వివరాలతో అనుసంధానించడం ద్వారా రూ. 7.40 కోట్ల అదనపు ఆదాయాన్ని రాబట్టామని తెలిపారు.

**పర్యావరణం – పౌరుల భాగస్వామ్యం**

వనమహోత్సవంలో 25లక్షల మొక్కలు నాటడం, 40 కొత్త పార్కుల అభివృద్ధి, రహదారులు, ఫ్లైఓవర్ల సుందరీకరణతో నగరానికి హరిత శోభ పెరిగిందన్నారు. నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరం. పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పిలుపునిచ్చారు.

**వినూత్న ఐటీ కార్యక్రమాలు**

క్షేత్ర స్థాయి సిబ్బంది, ప్రధాన కార్యాలయం ఉద్యోగుల కోసం ఎఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. త్వరలో సర్టిఫికెట్లు, దరఖాస్తులు, ఫిర్యాదుల కోసం వాట్సాప్ ఆధారిత సేవలు, ఎఐ చాట్‌బాట్‌లనుఅందుబాటులోకి తీసుకురానున్నామన్నారు.

**వెహికల్ ట్రాకింగ్:** 5,000 మున్సిపల్ వాహనాలకు జిపిఎస్ ఆధారిత ట్రాకింగ్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నామన్నారు.

## డిండి పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల నిర్మాణంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న ఏ ఒక్క ప్రాజెక్టుకు గత 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించలేదని ఆరోపించారు. నీళ్లు ఎక్కడి నుండి ఎక్కడికి పోవాలో అనే దానిపై డిపిఆర్ లేకుండా కాలయాపన చేసిన ఘనత బిఆర్ఎస్‌ది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టుకు వెంటనే 18వందల కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. వచ్చే మూడు సంవత్సరాలకాలంలోనే పూర్తి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఏ ఒక్క ప్రాజెక్టును నిర్మించక పోయిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టడం కట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అధిక భారం పడుతుందని అన్నారు. తెలంగాణ తెచ్చుకున్న సంతోషం లేకుండా కెసిఆర్ గత 10 సంవత్సరాల కాలంలో తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చారని అన్నారు. ఏది ఏమైన రానున్న కాలంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, మరో ఐదు సంవత్సరాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాల గూడెం ఎమ్మెల్యే బిఎల్ఆర్ , చల్లమల్ల కృష్ణారెడ్డి, నల్పరాజు రామలింగయ్య , నారబోయిన రవి, నల్పరాజు సతీష్ కుమార్, పల్లె వెంకన్న, నరహరి , వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## రూ.713 కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నెల నుంచి ప్రతినెల కనీసంగా రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. విడుదల చేసిన బిలుల్లలో ఉద్యోగుల గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవులు అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయని ఆర్థిక శాఖ కార్యాలయం తెలియజేసింది.

## న్యూ ఇయర్ సందడి

(మొదటి పేజీ తరువాయి)

దేశీయ పురాతన సంస్కృతీ వారసత్వ దుస్తులు,నృత్యాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు.ఆక్లాండ్‌లో స్కైటవర్ వేదికగా వేడుకలు నిర్వహించారు. కిరితిమతిదీవిలో కొత్తఏడాది కాలమానం ప్రవేశించిన 15నిమిషాలకు ఫిజి,టోంగా,సమోయా,న్యూజిలాండ్‌లలో నూతన సంవత్సర కాలమానం ప్రారంభమైంది.

గ్రీన్‌విచ్ మీన్‌టైమ్ ప్రకారం కిరితిమతిలో పది గంటలకు, న్యూజిలాండ్‌లో 11 గంటలకు, ఆస్ట్రేలియా తూర్పుతీరంలో ఒంటిగంటకు, జపాన్,దక్షిణ కొరియాలలో మూడు గంటలకు కొత్త సంవత్సరం కాలమానం ప్రారంభమైంది. అన్నిదేశాలకంటే ఆలస్యంగా బేకర్ ఐలాండ్స్‌లో గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కొత్త సంవత్సర కాలమానం ప్రారంభమైంది. కొత్త సంవత్సరం వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని దేశాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటగా సిడ్నీలో 2,500 మంది దళాలను మోహరించారు. మంచు, చలి నుండి జాగ్రత్తలు పాటించాలని పలు దేశాల ప్రభుత్వాలు ట్రావెలర్స్‌ను హెచ్చరించాయి.

దక్షిణ హవాయ్‌లోని కిరితిమతి దీవిని కిరిబాస్ అనీ, కిరిబతి అంటారు. ఈ కిరిబాస్ ప్రాంతం 1979లో బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం పొందింది. ఈ కిరితిమతి దీవిని క్రిస్మస్ దీవి అని కూడా పిలుస్తారు. ఈ దీవిలో ఎలాంటి శబ్దాలు ఉండవు. సముద్రపు ఒడ్డున చిన్న చిన్న జీవుల కదలికలు తప్ప...ఇక్కడ తాము ఎంతో ప్రశాంతంగా ఆనందంగా కొత్త సంవత్సరాన్ని గడుపుతామని చేపల వ్యాపారి బ్రేయన్ డన్ చెప్పారు. ఇక ఛాత్తందీవిలో కేవలం 600 మంది మాత్రమే జనాభా ఉన్నారు. ఈ దీవిలో ఎక్కువమంది ప్రజలు సాయంత్రం నుండే హోటల్ ఛాత్తం బార్‌లో గడుపుతారు. దీంతో ఓసియానాలోని న్యూజిలాండ్ దేశంలో బుధవారం నుండే కోలాహలం ప్రారంభమైంది. ఆస్ట్రేలియాలోని సిడ్నీ హార్బర్ దగ్గర నుండి బ్రెజిల్‌లోని రియో డీ జనేరియో వరకూ వివిధ దేశాల్లో ప్రజలు సందడిగా వేడుకల మధ్య స్వాగతం పలికారు.

అనేక దేశాలలో క్రిస్మస్–న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో భారీ కొనుగోళ్ళత మార్కెట్లు లాభాల్లో నడుస్తున్నాయి. ప్రతి దేశంలోనూ ఈ పేరుతో ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, తీపి పదార్థాలే ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి. అనేక దేశాలలో ప్రజలు బాణసంచా సమకూర్చుకుని కొత్త సంవత్సరం వేడుకలు చేసుకున్నారు. అర్థరాత్రి స్వాగత సత్కారాలు పలికేందుకు అనేక దేశాలలో భారీ హోర్డింగులు, రంగు రంగుల తోరణాలు, విద్యుత్ అలంకరణలు, నిశీథిలో బాణసంచా కాల్చారు. డెన్మార్క్‌లో ప్రజలు తమ పొరుగింటివారికి పలహారాలు అందజేసేందుకు గంటలు కొట్టేందుకు ప్లేట్లు గరిటెలుతో శబ్దాలు చేశారు. రాబోయే 12 నెలల్లో గుడ్ లక్ కలగాలని పరస్పరం ప్రజలు అభినందించుకున్నారు. అమెరికా న్యూయార్క్‌లో క్లాక్ టవర్ వద్ద వేలాదిమంది ప్రజలు బాల్‌రోల్ కోసం ఎదురుచూస్తున్నారు. విన్సెన్నెస్, ఇండియానాలలో ప్రజలు పుచ్చకాయలను నేలపై దొర్లించి వేడుక చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్పెయిన్ దేశంలో కొత్త సంవత్సరం అర్థరాత్రి కొత్త సంవత్సరం ప్రారంభంకాగానే ద్రాక్షపళ్ళు ఆరగించేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఒకేసారి త్వరత్వరగా 12 ద్రాక్షపండ్లు నోట్లోవేసుకుని నమిలి మింగుతారు. రాబోయే 12 నెలల్లో శుభం జరగాలనేదే దీని వెనుక అంతరార్థం. దీనికి భిన్నంగా జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో రణగొణ ధ్వనులతో కొత్త సంవత్సరం ప్రారంభమైంది. కొత్త సంవత్సరం ప్రవేశించగానే 108 సార్లు జపాన్, దక్షిణ కొరియా దేశాల్లోగంటలు మోగించారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇక బ్రెజిల్ దేశంలో కొత్త సంవత్సర వేడుకల చిహ్నంగా తృణధాన్యాలను ఆరగించారు. ఎంత ఎక్కువ తింటే అంత శుభంగా వారు భావిస్తారు.

## సత్తా చాటిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

### పన్నుగవేతదారుల నుంచి రూ.213 వసూలు
### రూ.114 పిడిఎస్ రైస్ జప్తు
### వివరాలు వెల్లడించిన డిజి శిఖాగోయల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గణనీయమైన విజయాలను నమోదు చేసిందని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు. 2025లో విజిలెన్స్ విభాగం చేసిన కార్యక్రమాలను బుధవారం శిఖాగోయల్ వెల్లడించారు. ఏడాది కాలంలో పన్ను ఎగవేతను గుర్తించడం, రాబడిని తిరిగి పొందడం, అక్రమాలను నిరోధించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఈ ఏడాదిలో ఆయా ప్రభుత్వ శాఖల నుంచి 292 విచారణలు రాగా, ఫీల్డ్ యూనిట్లు 480 విచారణలను పూర్తి చేసి నివేదికలను సమర్పించామన్నారు.ఇక సుమారు రూ.228.31 కోట్ల పన్ను ఎగవేతను గుర్తించగా, అందులో రూ.213.58 కోట్లను వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయడం జరిగిందన్నారు. 203 రూట్ చెక్‌ల ద్వారా 18,137 వాహనాలను తనిఖీ చేశారు. దీని ఫలితంగా 3,994 కేసులు నమోదు చేసి, రూ.12.51 కోట్ల పెనాల్టీలు మరియు పన్నులను వసూలు చేశారు. రేషన్ షాపులు (ఎఫ్‌పిఎస్),మిల్స్ పాయింట్లు, ప్రైవేట్ ప్రాంగణాల్లో 451 తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 53 సెక్షన్ 6A కేసులు, 38 IPC కేసులు మరియు 24 ఇతర కేసులు నమోదయ్యాయి. అలాగే 24 వాహనాలను సీజ్ చేసి, రూ.114.95 కోట్ల విలువైన నిత్యావసర వస్తువులను జప్తు చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం మరియు ప్రజా భద్రత కోసం ఈ క్రింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పత్తి, వరి మరియు విత్తనాల కొనుగోలు, యూరియా పంపిణీపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రయాణీకుల, రవాణా వాహనాల ఓవర్‌లోడింగ్ నియంత్రణతో పాటు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా అక్రమాలకు సంబంధించి సమాచారం ఉన్నట్లయితే, ప్రజలు 14432 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సేవా పతకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నూతన సంవత్సరం 2026ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్), అగ్నిమాపక విపత్తు స్పందన సేవల విభాగాలకు చెందిన అధికారులకు పోలీస్ సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక విభాగం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ విధుల్లో విశిష్ట సేవలు, అత్యుత్తమ పనితీరు, ధైర్యసాహసాలు ప్రదర్శించిన అధికారులు, సిబ్బందిని గుర్తించి ఈ అవార్డులు ప్రకటించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. డిసెంబర్ 31, 2025న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం జనవరి 1, 2026న ఈ పతకాలు అందజేయనున్నారు. ఈ అవార్డుల్లో తెలంగాణ శౌర్య పతకం,తెలంగాణ మహోన్నత సేవ పతకం,తెలంగాణ ఉత్తమ సేవ పతకం,తెలంగాణ కఠిన సేవ పతకం,తెలంగాణ సేవ పతకం ఉన్నాయి.పతకాలు పొందిన వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు నెలవారీ పునరావృత గ్రాంట్‌తో పాటు ఒకేసారి చెల్లించే నగదు ప్రోత్సాహకాన్ని కూడా అందించనున్నారు. ఆయా విభాగాల బడ్జెట్ కింద ఈ వ్యయాన్ని మంజూరు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల గడువు పొడిగింపు
**2026 మార్చి 31 వరకు అవకాశం**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇప్పటి వరకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు గడువును 2026 మార్చి 31 వరకు పొడిగించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ నుంచి ఆ పై చదువులు చదువుతున్న అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఈబిసి మైనార్టీ విద్యార్థిని విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో పోస్టుమెట్రిక్ (రెన్యువల్, ఫ్రెష్) స్కాలర్ షిప్‌లకు దరఖాస్తులకు సంబంధించి విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ బుద్ద ప్రకాశ్ జ్యోతి కోరారు. అభ్యర్థులు తమ దరఖాస్తులు https://telanganaepass.cgg.gov.in. ద్వారా చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. 10,89,233 మంది విద్యార్థులకు గాను 7,82,779 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో గడువును మరోసారి మార్చి 31 వరకు పొడింగించినట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కళాశాలల ప్రిన్సిపల్స్‌కు సూచించారు.

## రాష్ట్ర ప్రజలకు పలువురు ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నూతన సంవత్సర (2026) శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసి, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు. బిపి, షుగర్, ఒబెసిటీ, కిడ్నీ, గుండె జబ్బులు, కేన్సర్లకు కారణమైతున్న అనారోగ్యకర అలవాట్లను మానుకోవాలని, కొత్త సంవత్సరంలో ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని మంత్రి సూచించారు. నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని, అనవసరమైన తగాదాలకు తావు ఇవ్వకూడదని మంత్రి సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని యువతను కోరారు.

### మరింత సమగ్ర అభివృద్ధి సాధించాలి : వాకిటి



రాష్ట్ర ప్రజలకు క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు వ్యవసాయం,పాడిపరిశ్రమ ఇతర అన్నిరంగాల్లో మరింత సమగ్ర అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఇందిరమ్మ రాజ్యం ఇప్పటికే సంక్షేమం, అభివృద్ధిపథంలో దూసుకెళ్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం యొక్క విజన్తో,ప్రజలందరి సహకారంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

### ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి : మంత్రి జూపల్లి

రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఆశలు, ఆకాంక్షలతో ఉత్సాహంగా నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

### రాష్ట్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలి : అడ్లూరి లక్ష్మణ్



ఆంగ్ల నూతన సంవత్సరం2026ను పురస్కరించుకుని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దూరదృష్టి గల నాయకత్వం, ప్రజాపక్ష పాలన, అభివృద్ధి సంకల్పంతో తెలంగాణ రాష్ట్రం సరికొత్త ప్రగతి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు.నూతన సంవత్సరంలో ధర్మపురి నియోజకవర్గ ప్రజలు అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించి, రాష్ట్ర అభివృద్ధికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఆకాంక్షించారు.





నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో 2025 సంవత్సర ముగింపు, 2026 సంవత్సర ఆరంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి విచ్చేసి నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షుడు పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రజాపక్షం దిన పత్రిక క్యాలెండర్, పాకెట్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, జిఎం మధుకర్, ప్రజాపక్షం ఎడిటర్ మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ బి.లక్ష్మీనారాయణ, బ్యూరో చీఫ్ చంద్రశేఖర్, న్యూస్ ఎడిటర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి, ప్రజాపక్షం సిబ్బంది పాల్గొన్నారు.

# మతోన్మాదులే దేశానికి ప్రమాదకరం

- దేశ సంపద కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం
- జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి..
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి..



**ప్రజాపక్షం/వలిగొండ :** మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. దేశభక్తి ముసుగులో బిజెపి కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సిపిఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మంది ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నూరు సంవత్సరాలు డిసెంబర్ 26కు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు.

దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతోమంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదని అన్నారు. దున్ని వా డికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకం గా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ, లౌకిక ప్రజాస్వామిక శక్తుల్ని ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతున్నదన్నారు.

**జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభ..**

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జనవరి 18న సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్, చిగుళ్ల లింగం, చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, మారుపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ల డిమాండ్ల సాధనకు 3న చలో అసెంబ్లీ
ఆటో జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఆటోడ్రైవర్ల డిమాండ్ల సాధన కోసం ఈనెల3వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించింది. తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జెఎసి అధ్వర్యములో బుధవారంసుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో రౌండ్ టేండ్ సమావేశం నిర్వహించారు. జెఎసి కన్వీనర్ ఎఐటియుసి నాయకులు బి. వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేండ్ సమావేశంలో బిఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత మ ధుసూదనాచారి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, నర్సింహా రెడ్డి (సిఐటియు) దయానంద్ (ఐఎన్‌టియుసి), ఎ.మారయ్య (బిఆర్‌టియు), యాదగిరి(టిఎన్‌టియుసి) రమాదేవి (సిపిఎంఎల్ మాస్ లైన్ ) వి.ప్రవీణ్ (టియుసిఐ) గటుష్ నాయకులు శ్రీనివాస్, శివానంద్ (టిఎఎండియు) ఎం.ఎ సలీం( తెలంగాణ జాగృతి) సత్తి రెడ్డి( టిడిఎస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు శాసనమండలి లో చర్చకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఆటో మీటర్ చార్జెస్ వెంటనే పెంచాలని డి మాండ్ చేశారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యముగా రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప ఆటో కార్మికులకు ప్రభుత్వం హామి ఇచ్చిన ఏడాదికి రూ. 12 వేలు తక్షణమే చెల్లించాలనిడిమాండ్ చేశారు. ఈనెల 3న నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

## స్కిల్స్ యూనివర్సిటీలో 1000 మందికి శిక్షణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులను చదివిన విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యం అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో డిసెంబర్ నాటికి 1000 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ అందించింది. నైపుణ్య విద్యా రంగంలో ఇంత తక్కువ టైమ్‌లో ఈ స్థాయి లక్ష్యాన్ని అందుకోవటం విశేషం. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పడిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ 2024 ఆగస్టు 1న యూనివర్సిటీకి శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన ఈ యూనివర్సిటీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోర్డు ఛైర్మన్‌గా పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తుండగా, పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖులతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ వి.ఎల్.వి.ఎస్.ఎస్. సుబ్బారావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీకి సంబంధించిన శాశ్వత క్యాంపస్ హైదరాబాద్ సమీపంలోని కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉంది.

## బిసి రిజర్వేషన్లు పెంచకుండా 'పరిషత్తు'ఎన్నికలకెళ్తే అసెంబ్లీని ముట్టడిస్తాం
అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాల సమావేశంలో జాజుల



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** బిసి రిజర్వేషన్లను పెంచకుండా ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకెళ్తే వేలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం హైదరాబాదు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి రిజర్వేషన్ల పెంచాలని డిమాండ్‌చేస్తూ జాజుల అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలు బిసి సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత వి.మధుసూదనాచారి, రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు, మాజీ గవర్నర్‌బండారు దత్తాత్రేయ, సిపిఐ నేత ధనుంజయ నాయుడు, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, టిజెఎస్ నేత పల్లె వినయ్ హాజరయ్యారు. ముందుగా, జాజుల మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లు పెంచే బాధ్యత కాంగ్రెస్, బిజెపి పార్టీలదే నన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లపై చర్చించి, కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి రాజకీయ పోరాటాన్ని ప్రకటించాలని డిమాండ్‌చేశారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు జనవరిలో బిసి సర్పంచుల రాష్ట్ర సమాచారం ఏర్పాటు, ఫిబ్రవరి రెండో వారం నుండి బిసిల రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఏప్రిల్‌లో లక్షల మందితో హైదరాబాద్‌లో సభ నిర్వహిస్తామన్నారు. దత్తాత్రేయ మాట్లాడుతూ బిసి సంఘాలు ఒక్కతాటి మీదికొచ్చి బిసి రిజర్వేషన్ల పెంపు కోసం జాతీయస్థాయిలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. వి హనుమంతరావు మాట్లాడుతూ వచ్చే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతామన్నారు. ఈ బిల్లుతో బీసిల అనుకూలురు, వ్యతిరేకులు ఎవరో తేలిపోనున్నదన్నారు. ధనుంజయ నాయుడు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపునకు బిసి హక్కుల సాధన సమితి నిరంతరంగా పోరాడుతుందన్నారు. తమ పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 42% రిజర్వేషన్లు కల్పించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాడుతామన్నారు. సమావేశంలో బిసి జెఎసి కో–చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేశాచారి, నేతలు విక్రమ్‌గౌడ్, శ్యాంకుర్మ, మణిమంజరి సాగర్, దీటి మల్లయ్య, కాటేపల్లి వీరస్వామి, పిట్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## దూకుడు పెంచిన ఎసిబి
**2025లో 199 కేసులు, రూ.96కోట్ల అక్రమ ఆస్తుల వెలికితీత**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఎసి బి) 2025 సంవత్సరంలో అవినీతిపై ఉక్కుపాదం మోపింది. ఈ ఏడాది మొత్తం 199 కేసులు నమోదు చేసి, 273 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఎసిబి అదనపు డిజిపి చారుసిన్హా బుధవారం మీడియాకు వెల్లడించింది. ఇందులో 157 ట్రాప్ కేసులు ఉండగా, వాటిలో 224 మంది నిం దితులు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. అలాగే ప్రభుత్వ ఉద్యోగులపై 15 ఆదాయానికి మించి ఆస్తుల (డిఎ) కేసులు, 26 క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు నమోదు చేసి, మొత్తం 34 మంది ని అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది నమోదైన ట్రాప్ కేసుల్లో ఎసిబి అధికారులు మొత్తం రూ. 57,17,500 లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.35,89,500ను ఫిర్యాదుదారులకు తిరిగి చెల్లించారు. అసమాన ఆస్తు ల కేసుల్లో రూ.96,13,50,554 విలువైన అక్ర మ ఆస్తులను వెలికితీశారు, ఇది ఏసీబీ దర్యాప్తులో కీలక విజయంగా పేర్కొన్నారు. కాగా అవినీతిపై నియంత్రణ కోసం ఎసిబి 26 రెగ్యులర్ ఎన్‌క్వైరీస్, 54 ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. స బ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్‌టిఎ చెక్‌పోస్టులు, సంక్షేమ హాస్టళ్లలో ఈ తనిఖీలు చేపట్టారు. నిందితులపై చర్యలకు ప్రభుత్వం నుం చి 115 ప్రాసిక్యూషన్ అనుమతులు పొందిన తరువాత ఎసిబి సంబంధిత కేసుల్లో చార్జ్ షీట్లు దాఖలు చేశామన్నారు. ఎసిబి సిబ్బంది సామర్థ్యవృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. 73 మంది అధికారులకు ప్రాథమిక శిక్షణ అందించామని, బినామీ ఆస్తుల చట్టం, డిజిటల్ లావాదేవీల ట్రేసింగ్, ట్రాప్ కేసుల న్యాయపరమైన అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. డిసెంబర్ 3 నుంచి 9 వరకు అవినీతి నిరోధక వా రోత్సవం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా క్యూర్ కోడ్ ఆధారిత ఫిర్యాదు వ్యవస్థను సైతం ప్రారంభించామని చారుసిన్హా తెలిపారు. దూర ప్రాంతాల ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

**లంచం అడిగితే 1064కు ఫోన్ చేయండి**

లంచం డిమాండ్ చేసిన ఏ ప్రభుత్వ ఉద్యోగిపై అయినా టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని ఎసిబి అదనపు డిజి చారుసిన్హా సూచించారు. వాట్సాప్: 9440446106, **ఫేస్‌బుక్:** Telangana ACB, ఎక్స్ (ట్విట్టర్): @Telangana ACB ద్వారా కూడా ఫిర్యాదు చే యవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని, చట్టప్రకారం కఠి న చర్యలు తీసుకుంటామని చారు సిన్హా స్పష్టం చేశారు.

## నేటి నుంచి రోడ్డు భద్రతా మాసోత్సవాలు
ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటినుంచి రోడ్డు మీదకు వచ్చిన వ్యక్తి సంక్షేమ తిరిగి ఇంటికి వెళ్లాడమే లక్ష్యంగా గురువారం (నేటి) నుంచి నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2026 జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వాలని, ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్ లో చేరాలని కోరారు. హెల్మెట్ ధరించకపోవడం, మద్యం తాగి వాహనం నడపడం రాంగ్ రూట్లో ప్రయాణం , అతివేగంతో వాహనం నడపడం వల్లే రోడ్డు ప్రమాదాల జరిగి అధిక మరణాలు సంభవిస్తున్నాయని అధికారక లెక్కలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. వీటిపై రవాణా శాఖ పూర్తి అవగాహన కల్పించడంతో పాటు రోడ్డు భద్రతపై సూచనలు చేయనుందని వీటిని ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.



## కొండాపూర్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నూతన పరిశ్రమలు
ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మెదక్ జిల్లా కొండాపూర్ ఇండస్ట్రియల్ పార్కులో వెయ్యి కోట్ల పెట్టుబడితో నిర్మాణాలు పూర్తి చేసుకున్న పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సచివాలయంలో బుధవారం తనను కలిసిన కొండాపూర్ పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులతో శ్రీధర్ బాబు బేటీ అయ్యారు. సమావేశంలో టిజిఐఐసి ఎండి శశాంక ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇండస్ట్రియల్ పార్కులో మొత్తం 64 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో 36 పరిశ్రమలు నిర్మాణాలు పూర్తి చేసుకుని కార్యకలాపాలు మొదలు పెట్టడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాయని శ్రీధర్ బాబు చెప్పారు. ఇవి ప్రారంభమైతే 5 వేల మంది యువతకు తక్షణం ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. మరో నెల రోజుల్లోగా విద్యుత్తు సంబంధిత సమస్యలన్నిటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్కును జాతీయ రహదారితో కలిపే అప్రోచ్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరలో అన్ని పరిశ్రమలు ఉత్పాదన మొదలు పెట్టేలా మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ పెట్టుబడుల విభాగం డైరెక్టర్ మధుసూదన్, పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు కె.శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి ఎ.సాంబశివరావు, ట్రెజరర్ సిహెచ్. అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ స్వామి, ఎ.వి.రమణ, నవనీత్ జైన్, సంతోష్ కుమార్, కెవిఆర్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

టెండర్ నోటీసు

NIT No. 03/EE/PD-NZ/GHMC/2025-26 తేది: 30.12.2025

**పని పేరు :** మూసీ నదిపై మూసారాంబాగ్‌లో కొత్త హై లెవల్ వంతెన నిర్మాణంలో భాగంగా, నది ఎగువ భాగంలో ఉన్న 27 ఆస్తులను కూల్చివేయడం. **అంచనా విలువ:** రూ. 38.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 31.12.2025న మ.03.00గం.ల నుండి 08.01.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఒ/ఒ. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్ డివిజన్ - ఎన్‌జెడ్), జిహెచ్‌ఎంసి. 9959442013. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పిడి-ఎన్‌జెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 12818-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ డివిజన్, భువనగిరి.

షార్ట్ టెండర్ నోటీసు నెం.03/2025-26

యాదాద్రి సర్కిల్‌లోని భువనగిరి డివిజన్‌లో వివిధ ఎలక్ట్రికల్ పనుల కోసం టెండర్ స్పెసిఫికేషన్స్. దయచేసి www.tgsouthernpower.org వెబ్‌సైట్‌ను సందర్శించండి. సంప్రదించవలసిన ఫోన్ నెం. 8712471794.

సం/- డివిజనల్ ఇంజనీర్ : ఎలక్ట్రికల్., ఆపరేషన్: డివిజన్: భువనగిరి.

DIPR R.O. No. : 12841-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025

**కొత్తకోట మున్సిపాలిటీ కార్యాలయం - వనపర్తి జిల్లా**

ఆసక్తి వ్యక్తీకరణ (EOI)

కొత్తకోట మున్సిపాలిటీ పరిధిలోని సెంట్రల్ మీడియన్‌లో ప్లాంటేషన్ కోసం అవసరమయ్యే మొక్కలు కొరకు అనుభవజ్ఞులైన సంస్థల నుండి వ్యక్తీకరణ పత్రం (EOI) ను ఆహ్వానించుచున్నాము. **ప్రారంభ తేది:** 01.01.2026న ఉ. 10.00 గం. **దాఖలుకు చివరి తేది:** 03.01.2026 న 4:00గం. డాక్యుమెంట్ల పరిశీలన మరియు **ఆర్థిక బిడ్ తెరుచు తేది:** 03.01.2026 న సా. 5:00 గం.

సం/- కమిషనర్, మున్సిపాలిటీ, కొత్తకోట.

DIPR R.O. No. : 12859-PP/CL/ADVT/1/2025-26, Date: 31-12-2025




# జనరల్
STATE & REGIONAL NEWS



ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స జరగడంతో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిని బుధవారం పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## గత ఏడాది వైద్య ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వైద్య, ఆరోగ్య రంగానికి గత ఏడాది ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు అనేక చర్యలు చేపట్టింది. ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాల కల్పనతో పాటు పెద్ద ఎత్తున్న ఉద్యోగులను సైతం నియమించింది.. మరోవైపు పలువురు ఐఎఎస్ అధికారులు స్వయంగా వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతుండడంతో సర్కార్ వైద్యంపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట బోర్డు ద్వారా ఇటీవల 1284 ల్యాబ్ టెక్నిషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసిన బోర్డు జాత స్వీచ్ పాథాలజిస్ట్ పోస్టుల ఫస్ట్‌ప్రావిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసింది. ఈ నియామాకాలను సైతం జనవరి చివరికి నాటికి పూర్తి చేయనున్నారు. దశాబ్దాల ఉస్మానియా నూతన హాస్పిటల్ ఆకాంక్షను 2025లో సిఎం రేవంతర్‌రెడ్డి చేతుల మీదగా పడగా, రాష్ట్ర వ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు కొత్త భవనాలను నిర్మించుకున్నామన్నారు. మొత్తానికి గడిచిన ఏడాది ప్రజా వైద్య ఆరోగ్యాన్ని ఓ గాడిలో పెట్టిన ప్రభుత్వం ఈ ఏడాది మరిన్ని లక్ష్యాలను నిర్ధేశించుకుని ముందుకు సాగుతోంది.

### 2026లో వైద్య ఆరోగ్య శాఖ లక్ష్యాలు

2026లో నాన్ కమ్యునికెబుల్ డిసీజెస్ నివారణ, నియంత్రణ, చికిత్స(, పాలియేటివ్ కేర్‌పై వైద్య , ఆరోగ్య శాఖ మరింత దృష్టి సారించింది. ఇప్పటికే ఎన్‌సిడిసి క్లినిక్స్, డే కేర్ కేన్సర్ క్లినిక్స్ ద్వారా గ్రామాల సమీపంలోకి వైద్య సేవలను తీసుకు వెళ్లింది. ఎమర్జెన్సీ కేర్‌కు సంబంధించి రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్‌ను మరింత విస్తృతం చేస్తున్నారు. 2026లో రాష్ట్ర వ్యాప్తంగా వందకుపైగా క్రిటికల్ కేర్ బ్లాక్స్, ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులోకి తీసుకురానున్నారు. తద్వారా 10 నిమిషాల్లోనే ఘటన స్థలానికి చేరుకుని వైద్య సేవలు ప్రారంభించేలా '108 అంబులెన్స్' సర్వీసెస్‌ను విస్తరించనున్నారు.

### మార్చి చివరి నాటికి అందుబాటులోకి 4 కొత్త ఆసుపత్రులు

నగరం నలూమూలాల నిర్మించి 4 కొత్త మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను 2026 మార్చి చివరి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. గుండె, కిడ్నీ జబ్బులు, కేన్సర్ వంటి మొండి వ్యాధులకు సైతం పేదలు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేలా ఈ హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నారు.. మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చి వైద్య విద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నారు.

## 24 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లకు పరిష్కారం

టిసిజిఒఎ డైరీ-క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ



**హైదరాబాద్ :** సహకార శాఖలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న దిగువ స్థాయి ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సహకార గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్ (టిసిజిఒఎ) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర సహకార అధికారుల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని గృహకల్ప భవన్, సహకార సంఘాల కమిషనర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మొట్టమొదటి సారిగా సహకార అధికారుల డైరీ 2026ను ఆవిష్కరణ ఆనందంగా ఉందని తెలిపారు. సహకార శాఖ ఉద్యోగులు ఆడిట్‌లు, పరిశీలనలు నిర్వహించే సమయంలో ప్రతి అంశాన్ని నమోదు చేసుకునేందుకు డైరీ అత్యంత కీలకమని తెలిపారు. సహకార రంగం బలోపేతానికి ఉద్యోగుల కృషి అమూల్యమని పేర్కొన్న మంత్రి, ప్రభుత్వం తీసుకొచ్చే నూతన విధానాలకు అనుగుణంగా ఉద్యోగులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. సమయ పాలన, బాధ్యతాయుతమైన విధుల నిర్వహణ ద్వారా రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ, సహకార సంఘాల కమిషనర్ కె.సురేందర్ మోహన్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఉద్యోగ వర్గాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు శాఖ పరంగా నిరంతర కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిసిజిఒఎ రాష్ట్ర అధ్యక్షులు ఎ. జగన్మోహన్ రావు, సంఘం జనరల్ సెక్రటరీ డా. డి. భీంరాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టిజిఒ) రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, మాజీ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, టిఎన్‌జిఒ సిటీ యూనిట్ అధ్యక్షులు శ్రీరామ్, సహకా ర శాఖ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, కార్యదర్శి రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## పేదల ఇళ్లకు హైడ్రా భరోసా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కుత్బుల్లాపూర్‌లో పేదలకు హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ భరోసా ఇచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామం సర్వే నెంబర్ 307 లోని ప్రభుత్వ భూమిలో ఇళ్ళు కట్టుకుని ఇప్పటికే నివాసం ఉంటున్న పేదలను ఖాళీ చేయించమని రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లను మినహాయించి మిగిలిన ప్రభుత్వ భూమిని కాపాడుతామన్నారు. వదంతలు నమ్మి ఆందోళన చెందవద్దని సూచించారు. సర్వే నెంబరు 307లో నివాసం ఉంటున్న పేదలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ నివాసం ఉంటున్న వారితో హైడ్రా కమిషనర్ నేరుగా మాట్లాడారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పని లేదని భరోసా ఇచ్చారు. నగరంలో ఎక్కడ కూడా పేదల నివాసాలను హైడ్రా తొలగించదని చెప్పారు. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి మోసాలకు పాల్పడితే నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇదే సమయంలో అక్కడ కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రగతినగర్ (అంబీర్ చెరువు) చెరువు మధ్యలోంచి సాగే రహదారికి ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. అక్కడ వ్యాపారాలు సులభంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ప్రగతినగర్ చెరువును పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువు పరిసరాల్లో చెత్త గుట్టలను ఇప్పటికే 150 లారీల వరకూ తరలించామని చెప్పారు. చేపలు, చికెన్, మాంసం వ్యర్థాలు చెరువులో కలుస్తుండడంతో పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయని స్థానికులు ఈ సందర్భంగా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చిరువ్యాపారులను ఇక్కడి నుంచి తరలించాలని పలువురు కోరారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించి చిరు వ్యాపారులను అక్కడకు తరలించే ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఎసిపి ఉమామహేశ్వర్‌తో పాటు హైడ్రా, జిహెచ్ఎంసి, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు కమిషనర్ పర్యటనలో ఉన్నారు.

## తెలంగాణ పర్యాటక రంగానికి మహర్దశ

- రూ..22,324 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు, 90,000 ఉద్యోగాలు
- పర్యాటకుల భద్రతే ధ్యేయంగా 'టూరిస్ట్ పోలీస్' అద్భుత సేవలు
- 2025లో విజయాలు, 2026 లక్ష్యాలు వెల్లడించిన పర్యాటక శాఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దిశానిర్దేశంలో తెలంగాణ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పర్యాటక శాఖ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2025 సంవత్సరంలో పర్యాటక శాఖ సాధించిన ప్రగతిని, 2026 లో సాధించబోయే లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలను పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) ఎండి వల్లూరు క్రాంతి వెల్లడించారు. 2025లో పర్యావరణ, మెడికల్, హెరిటేజ్, ఆధ్యాత్మిక, రూరల్ అండ్ ట్రైబల్ (గ్రామీణ, గిరిజన), సినిమా, వెడ్డింగ్ డెస్టినేషన్, స్పోర్ట్స్ టూరిజంపై దృష్టి సారించి 'తెలంగాణ టూరిజం పాలసీ 2025–2030'ని అమలులోకి తెచ్చామని, దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధిని వివరించారు. టూరిజం కాంక్లేవ్ 2025 ద్వారా 30 ప్రాజెక్టులకు గానూ రూ.15,279 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి, తద్వారా సుమారు 50,000 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరో రూ.7,045 కోట్ల పెట్టుబడులు, 40,000 ఉద్యోగాల సృష్టి జరగనుంది. ముఖ్యంగా ఫుడ్‌లింక్ గ్లోబల్ సెంటర్ (రూ. 3,000 కోట్లు), సారస్ ఇన్‌ఫ్రా రూ(.1,000 కోట్లు), స్మార్ట్ మొబిలిటీ (రూ.1,000 కోట్లు) వంటి సంస్థలు భారీ పెట్టుబడులతో ముందుకు వచ్చాయిని చెప్పారు.పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృ ద్ధి సరికొత్త పథాన దూసుకెళ్లుతుంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 123 ప్రాజెక్టులలో ఇప్పటికే 78 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తయ్యాయి. దీనికి అదనంగా, కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ కింద రూ. 275 కోట్ల విలువైన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అనంతగిరి కొండల్లో ఎకోటూరిజం జోన్స , భువనగిరి కోట వద్ద 'ఎక్స్‌పీరియెన్షియల్ జోన్'ను తీర్చిదిద్దుతున్నారు. అలాగే, జల పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ హుస్సేన్ సాగర్‌లో 120 మంది ప్రయాణించగల 'ముచుకుంద' అనే డబుల్ డెక్కర్ బోటును పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ప్రపంచ సుందరీ వేడుకలు హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా నిలిపడమే కాకుండా, 110 దేశాల నుండి వచ్చిన సుందరీమణులు 'పర్యాటక రాయబారులుగా' మారి మన పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. ఇది హైదరాబాద్‌ను కేవలం పెట్టుబడులకే కాకుండా, వ్యాపారానికి 'సురక్షితమైన, అనుకూలమైన రాష్ట్రంగా' నిరూపించిందని ఉద్ఘాటించారు. బతుకమ్మ పండుగను ప్రపంచ వేదికపై నిలబెడుతూ.. అతి పెద్ద బతుకమ్మ (19.44 మీటర్లు), 1,354 మంది మహిళలతో అతిపెద్ద జానపద నృత్యం ప్రదర్శించి సెప్టెంబర్ 29, 2025న రెండు గిన్నిస్ రికార్డులు సాధించామని తెలిపారు. పర్యాటకుల భద్రత కోసం 80 మంది ప్రత్యేక శిక్షణ పొందిన అధికారులతో అక్టోబర్ 13, 2025న ప్రారంభించిన 'టూరిస్ట్ పోలీస్' వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం యూనిఫైడ్ ఆన్‌లైన్ పోర్టల్, డిజిటల్ ట్రావెల్ కార్డులు వంటి వినూత్న సేవలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

### 2026లో లక్ష్యాలు

- రాబోయే 2026 సంవత్సరానికి గానూ పర్యాటక శాఖ స్పష్టమైన ప్రణాళిక వివరాలను ప్రకటించింది:
- హైదరాబాద్ సోమశిల శ్రీశైలం సర్క్యూట్‌లో హెలీ టూరిజం సేవలను పూర్తిస్థాయిలో హెలీ టూరిజం అందుబాటులోకి తేవడం.
- నాగార్జున సాగర్, సోమశిల, బస్వాపూర్ వంటి ప్రాంతాలను అత్యుత్తమ వెడ్డింగ్ డెస్టినేషన్లుగా అభివృద్ధి చేయడం.
- నాగార్జున సాగర్, బస్వాపూర్, సోమశిలలో కొత్త వెడ్డింగ్ డెస్టినేషన్ల అభివృద్ధి
- మెడికల్ టూరిజం సొసైటీని స్థాపించి, హైదరాబాద్‌ను గ్లోబల్ మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడం.
- జనవరి 13, 14, 15న ఇంటర్నేషనల్ కైట్ అండ స్వీట్ ఫెస్టివల్ షోలను నిర్వహించడం. 19 దేశాల నుండి 40 మంది అంతర్జాతీయ, 55 మంది జాతీయ కైట్ ఫ్లయర్స్ భాగస్వాములు కానున్నారు.
- హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ 2026: జనవరి 1618 వరకు ఐరోపా దేశాలకు నుంచి వచ్చే ప్రతినిధులతో అంతర్జాతీయ స్థాయి 15 బెలూన్లతో ప్రదర్శన.
- డ్రోన్ షో 2026: గచ్చిబౌలి స్టేడియంలో జనవరి 13, 14న హైటెక్ డ్రోన్లతో వినూత్న ప్రదర్శన
- జాతీయ–అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ పై ప్రత్యేక దృష్టి.

## అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

వేల కేసులు, వేల కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం : ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ 2025 సంవత్సరంలో అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్, నార్కోటిక్ పదార్థాల నియంత్రణలో రికార్డు స్థాయి విజయాలు సాధించింది. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దాడులు, ప్రత్యేక డ్రైవ్‌లు ఫలితంగా వేల కేసులు నమోదు కాగా, వేల కోట్ల రూపాయల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎక్సైజ్ కమిషనర్ ఎస్.హరికిరణ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. 2025లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం ద్వారా 11,741 కేసులు నమోదు చేయగా, 11,500 మందిని అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో 102 వాహనాలు స్వాధీనం చేసుకొని, భారీగా అక్రమ మద్యం పట్టుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు రూ.1.15 కోట్లుగా అంచనా వేశారు. 2024లో నమోదైన 808 కేసులతో పోలిస్తే 2025లో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారులు తెలిపారు. ఎన్‌డిపిఎస్ విభాగం ద్వారా 2025లో 1,304 కేసులు నమోదు కాగా, 2,333 మంది నిందితులు అరెస్టయ్యారు. ఈ కేసుల్లో 746 వాహనాలు 5,505 కిలోల గంజాయి 1,646 కిలోల గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు.2024తో పోలిస్తే గంజాయి కేసులపై కఠిన చర్యలు మరింత పెరిగాయని ఆయన తెలిపారు.2025లో 72.54 కిలోల గంజాయి చాక్లెట్లు,728.2 గ్రాముల మెఫెడ్రోన్,105.27 గ్రాముల కోకైన్,127 గ్రాముల హెరాయిన్,228 గ్రాముల ఎండిఎంఎ, 36.79 కిలోల ఆల్కహాల్ బేస్డ్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు హరికిరణ్ వెల్లడించారు. వీటి మార్కెట్ విలు వ సుమారు రూ.9.40 కోటు ఉంటుందన్నారు. నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలపై కూడా ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టిందన్నారు. 2024లో 1.07 లక్షల లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోగా, 2025లో ఈ సంఖ్యను 67 వేల లీటర్లకు తగ్గించినట్లు అధికారులు తెలిపారు. నాటు సారా తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. 2025లో మొత్తం 14 ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించామని తెలిపారు. ఈ ఏడాది మొత్తం 3,07,557 కేసులు,31,981 లీటర్ల మద్యం, 2,204 వాహనాలుస్వాధీనం చేసుకొని, రూ. 1.39 కోట్ల జరిమానాలు విధించామన్నారు.8.22 లక్షల లీటర్ల మద్యం ధ్వంసం చేశామన్నారు.

### భవిష్యత్ కార్యాచరణ

ప్రజారోగ్యానికి హానికరమైన మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు.

## ప్రపంచ శ్రమజీవులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ శ్రమజీవులు, రైతాంగం, కార్మిక వర్గం, విద్యార్థులు, యువత, మహిళలు, కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు హృదయపూర్వక నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ ఆశలు ఆకాంక్షలతో 2026 నూతన సంవత్సరంలోకి అడుగు పెడుతున్న ఈ శుభసందర్భంలో ప్రజల జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, శాంతి, సమృద్ధి నిండాలని ఆకాంక్షించారు. కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాల కారణంగా ప్రజలు తీవ్ర ఆర్థిక భారాలు మోస్తున్నారన్నారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్య ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణ ప్రజల జీవనంపై తీవ్రమైన ప్రభావం చూపాయన్నారు. ఈ పరిస్థితుల మధ్య కూడా శ్రమజీవులు తమ హక్కుల కోసం సాగించిన పోరాటాలు ప్రజలకు స్ఫూర్తిని అందించాయని వారు చెప్పారు. 2026 నూతన సంవత్సరం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు, కార్మిక రైతు వ్యతిరేక చట్టాల రద్దుకు, సామాజిక న్యాయం సాధనకు పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తోందని తెలిపారు. కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాల ద్వారానే విజయం సాధ్యమని వారు స్పష్టం చేశారు. ప్రజల ఐక్యతతోనే సమానత్వం, న్యాయం, సామ్యవాద సమాజ నిర్మాణం సాధ్యమని విశ్వసిస్తూ, ఈ నూతన సంవత్సరం ప్రజా పోరాటాలకు కొత్త ఊపునివ్వాలని ఆకాంక్షించారు.



## జిహెచ్ఎంసికి ఇద్దరు అదనపు కమిషనర్లు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి (టిసియుఆర్ఇ) వరకు విస్తరించిన మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) పరిధిలో పాలనా వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విస్తరిత జిహెచ్ఎంసిలో జోన్‌ల వారీగా పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు కమిషనర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జి. సృజనను జిహెచ్ఎంసి అదనపు కమిషనర్‌గా నియమించారు. ఆమె కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌ల పాలనా వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజిగిరి, ఎల్.బి.నగర్, ఉప్పల్ జోన్‌లకు అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. వీరు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

### కొత్త కార్పొరేషన్‌లకు ముందస్తుగానే అధికారుల నియామకం ?

జిహెచ్ఎంసి పరిధిలోని కొన్ని జోన్‌లను విడదీసి కొత్త మునిసిపల్ కార్పొరేషన్‌లుగా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లతో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి, ఎల్.బి. నగర్, ఉప్పల్ జోన్‌లతో మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే భవిష్యత్‌లో కార్పొరేషన్‌లుగా ఏర్పడనున్న జోన్‌లకు ఇద్దరు ఐఎఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియామాకం జరపడం మూడు కార్పొరేషన్‌ల ఏర్పాటు ప్రచారానికి బలం చేకూరుస్తోంది.

## పదవీవిరమణ పొందిన జిహెచ్ఎంసి ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్(పరిపాలన) వేణుగోపాల్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 9 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం పదవీవిరమణ వీడ్కోలు సభను నిర్వహించారు. వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పదవీవిరమణపొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతోసేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. పదవీవిరమణ అన్నది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదన్నారు. మున్ముందు జీవితం ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ దశరథం, ఎఎంసి శారద, పర్యవేక్షకులు మహేశ్వరి, సహఉద్యోగులు, పదవీవిరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.




జిహెచ్ఎంసి ముఖ్య పౌర సమాచార విభాగంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శారదకు పదోన్నతి లభించిన సందర్భంగా ఆమెను పిఆర్ఓ దశరథం సన్మానించారు.

## పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

ఐఎన్‌టియుసి నేత మొగుళ్ళ రాజిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, కార్మికుల బదిలీలు, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్.బి కార్మిక సంఘాల జెఎసి చైర్మన్ మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేసారు. జలమండలి ప్రధాన కార్యాలయంలో బుధవారం హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఎండి, కె.అశో క్ కుమార్ రెడ్డిను కలసి మొగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్త మ ప్రతిభ కనబర్చిన హైదరాబాద్ మెట్రో నీటి సరఫరా, మురుగునీటి బోర్డు ము న్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించి, జాతీయ అవార్డు ను స్వీ కరించినందుకు కే.అశోక్ కుమార్ రెడ్డిని అభినందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు. రూ.3లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పెంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న 10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్‌ను జలమండలి ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని, అలాగే 20 ఏళ్ళు పైబడి పని చేస్తున్న వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ గార్డెనింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, జలమండలిలో ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కే.అశోక్ కుమార్ రెడ్డి ని కోరారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలకు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

Tender Notice No : G/E.29/Tr./Tender Notice/37/ 2025-26, Dt.29.12.2025 PUB/1679

భారతరాష్ట్రపతి తరపున మరియు వారి పక్షాన సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం.** GTL-TRd-29-eTN-65-2025-26, **పని పేరు:** గుంతకల్ డివిజన్: ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ఏర్పాటుకు సంబంధించి RLO-JKOమధ్య PTFE మార్పిడి., **సుమారు విలువ:** రూ.58,91,994.00, **EMD:** రూ.1,17,800.00

**టెండర్ ముగింపు తేదీ & సమయం: 20.01.2026 మధ్యాహ్నం 3 :00 గంటలకు.**

**గమనిక:** 1. టెండర్‌దారులు టెండర్ పత్రాలను **www.ireps.gov.in** నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

టెండర్ మరియు ఇతర వివరాల కోసం **https://www.ireps.gov.in** కు లాగిన్ అవ్వండి. ఏవైనా సవరణలు ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్,ట్రాక్షన్, గుంతకల్**

టెండర్ నోటీసు నెం: G/E.29/Tr./ Tender notice /38/2025-26, Dt.29.12.2025 PUB/1680

భారతరాష్ట్రపతి తరపున మరియు వారి పక్షాన వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం.** GTL-TRD-29-eTN-66-2025-26, **పని పేరు:** గుంతకల్ డివిజన్: డివిజన్ వ్యాప్తంగా భద్రతకుసంబంధించి కాంపోజిట్ ఇన్సులేటర్ల స్థానంలో పింగాణీ ఇన్సులేటరతో భర్తీ చేయదం., **సుమారు విలువ:** రూ.2,59,14,900.00, **EMD:** రూ.2,79,600.00

**టెండర్ ముగింపు తేదీ & సమయం: 20.01.2026 మధ్యాహ్నం 3: 00 గంటలకు.**

**గమనిక:** 1. టెండర్‌దారులు టెండర్ పత్రాన్ని **www.lreps.gov.in** నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

టెండర్ దాఖలు చేయడం మరియు ఇతర వివరాల కోసం **https://www.lreps.gov.in** లోకి లాగిన్ అవ్వండి. ఏవైనా సవరణలు ఉంటే, అవి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీచేయబడతాయి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్**

టెండర్ నోటీసు PUB/1681

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్‌డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పనుల కోసం బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం. (1), టెండర్ నెం. & తేదీ:** C_SG_36_582 తేదీ: 19/12/2025, ముగింపు తేదీ: 10/01/2026, పని పేరు: రాజశ్రీ సిమెంట్ సైడింగ్ (అల్ట్రాటెక్) వృద్ధి పనుల నిమిత్తం మల్‌ఖైడ్ రోడ్ స్టేషన్‌లో ప్రతిపాదిత యార్డ్ మార్పుల వద్ద సిగ్నలింగ్ ఏర్పాట్లు, **సుమారు విలువ (₹):** 6,48,34,477.38, **బిడ్ సెక్యూరిటీ/ఈఎండి (₹):** 4,74,200.00.

మరిన్ని వివరాల కోసం **www.lreps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించండి; జిసిసి 2022 కోసం లేదా IRSGCC-2022 ప్రకారం, ఇ-టెండర్‌ఫారాలు టెండర్ వేసే వారందరికీ ఉచితంగాజారీ చేయబడతాయి. (సూచన: IRGCC 2022 పార్ట్-I, క్లాజ్-3)

**Sr.Divisional Signal & Telecom Engineer/ Co-ord/Secunderabad.**

టెండర్ నోటీసు PUB/1682

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్, PRS, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కింది పని కోసం బహిరంగ టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**క్ర.సం. (1) టెండర్ నెం. & తేదీ:** No.C-CR-SGRDC-Vol-1-SNT-1, తేదీ: 23/12/2025 **ముగింపు తేదీ:** 27/01/2026, పని పేరు: నెక్స్ట్ జనరేషన్ ఇ-టికెటింగ్ (NGeT)సిస్టమ్ యొక్క డిజాస్టర్ రికవరీ (DR) సైట్‌ను హోస్టింగ్ చేయడానికి సికింద్రాబాద్‌లోని ప్రస్తుత PRS డేటా సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయడం., **సుమారు విలువ (₹):** 26,18,744.00, **బిడ్ సెక్యూరిటీ/EMD (₹):** 52,400.00,

మరిన్ని వివరాల కోసం, www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి. జిసిసి-2022 కోసంబిడ్ సెక్యూరిటీ/EMD కూడా చెల్లించబడుతుంది.

* IRSGCC-2022 ప్రకారం, టెండర్‌దారులు అందరికీ ఇ-టెండర్‌ఫారాలు ఉచితంగాజారీ చేయబడతాయి. (రిఫరెన్స్ : IRGCC 2022 పార్ట్-I, క్లాజ్-3

**డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్/ PRS /సికింద్రాబాద్**

Tender notice No. NED/E-39 & 40/2025-26 Dt.29.12.2025 PUB/1686

ఈ కింది E-Tenders @www.ireps.gov.inను ఆఫర్లు ఆహ్వానించబడ్డాయి.


**క్ర.సం.** 1) NED/E-39/2025-26, **పని పేరు:** అమన్‌వాడి స్టేషన్‌లో త్వరిత నీటి సరఫరావ్యవస్థను ఏర్పాటు చేయడం - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు ఖర్చు :** రూ.1,40,09,829.96, **బిడ్ సెక్యూరిటీ:** రూ.2,20,100.00, **ఆఫర్ చెల్లుబాటు:** 60రోజులు, **పూర్తి చేయు కాలం:** 12నెలలు, ఇక్కడ అందుబాటులో ఉంటుంది: **www.ireps.gov.in,** నాందేడ్ డివిజన్ పరిపాలన కింద, **ముగింపు తేదీ మరియు సమయం :** 21.01.2026న మధ్యాహ్నం 3:00 గంటలకు.

**క్ర.సం.** (2) NED/E-40/2025-26, **పని పేరు:** హింగోలి గూడ్స్ షెడ్‌లో సౌకర్యాల మెరుగుదల / సదుపాయం - విద్యుత్ ఏర్పాట్లు. **సుమారు ఖరీదు:** రూ.98,47,324.00, **బిడ్ సెక్యూరిటీ:** రూ.1,97,000.00, **ఆఫర్ చెల్లుబాటు :** 60రోజులు, **పూర్తి చేయు కాలం:** 12నెలలు, ఇక్కడ అందుబాటులో ఉంది: **www.ireps.gov.in,** నాందేడ్ డివిజన్ అడ్మినిస్ట్రేషన్ కింద, **ముగింపు తేదీ మరియు సమయం :** 21.01.2026న మధ్యాహ్నం 3 :00 గంటలకు

టెండర్ పత్రం కోసం, అర్హత ప్రమాణాల వివరాలు, ప్రత్యేక షరతులు,మొదలైన వాటి వివరాలు పైన పేర్కొన్న విధంగా మా వెబ్‌సైట్‌ను సందర్శించండి.ఆఫర్ సమర్పించే ముందు ఆన్‌లైన్‌లో ఏదైనా సవరణ ప్రచురించబడిందో లేదో తనిఖీ చేయాలని సూచించడమైనది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (Elec.), నాందేడ్**
A2140

**మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.**



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కొత్త ఉపాధి చట్టం రద్దు చేయండి:మోదీకి సిద్ధరామయ్య లేఖ

**బెంగళూరు:** ఉపాధి హామీ చట్టం స్థానంలో ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. కొత్త చట్టం ఉపాధి హక్కును హరించి వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని నిలిపివేయాలని కోరుతూ మంగళవారం ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. కొత్త చట్టం ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరుస్తుందని, సహకార సమాఖ్య విధానాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ కుటుంబాలకు కీలకమైన జీవనోపాధి భద్రతా వలయంగా పనిచేసిన డిమాండ్‌ఆధారిత, హక్కులఆధారిత అర్హతను కొత్త చట్టం నిర్వీర్యం చేస్తుందని అన్నారు. వీబీజీ రామ్ జీ చట్టం ఉపాధి హామీ చట్టం ఉద్దేశాన్ని దెబ్బతీస్తుందని లేఖలో పేర్కొన్నారు.

### సంఘసంస్కర్త శ్రీ నారాయణగురు ఫిలాసఫీ హైజాక్‌కు...

## కొందరు స్వార్థపరుల ప్రయత్నాలు


- కేరళ సిఎం పినరయి విజయన్ హెచ్చరిక
- వర్కలలో 93వ శివగిరి యాత్రికుల సమ్మేళన ప్రారంభించిన అనంతరం కీలక ప్రసంగం



**వర్కల (కేరళ) :** సాధువు, సంఘ సంస్కర్త శ్రీ నారాయణ గురు తత్వాలను వక్రీకరించి హైజాక్ చేసేందుకు కొంతమంది స్వార్థపరులు చేసే ప్రయత్నాల గురించి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హెచ్చరించారు. నారాయణ గురును ఒక నిర్దిష్ట మతం లేదా సమాజం సరిహద్దుల్లోకి పరిమితం చేయడానికి చేస్తున్న ఇటువంటి ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. బుధవారం ఇక్కడి వర్కలలో నారాయణ గురు స్థాపించిన శివగిరి మఠంలో 93వ శివగిరి యాత్రికుల సమ్మేళనాన్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడారు. నారాయణగురు తత్వాన్ని హైజాక్ చేయడానికి కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాలపై ఆందోళనల మధ్య ఈ ఏడాది శివగిరి యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నారాయణగురును ఏదైనా ఒక కులం లేదా మతం సరిహద్దులలో బంధించే రహస్య ప్రయత్నాలపట్ల మనం అప్రమత్తంగా ఉండాలన్నారు. కులం, మతపరమైన అంశాలకు అతీతంగా మానవ ఐక్యత, సోదరభావం, స్నేహం మార్గాన్ని మానవాళికి చూపించిన నిజమైన ప్రపంచ గురువు శ్రీ నారాయణ గురు అని ఆయన చెప్పారు. గురును ఆధ్యాత్మిక ప్రకాశంగా అభివర్ణించిన ముఖ్యమంత్రి విజయన్ ఆయన తాత్వాక గొప్పతనం యావత్ ప్రపంచ విముక్తికి దార్శనికతను అందించిందన్నారు. నారాయణగురు దార్శనికత ఆధునిక కేరళ నిర్మాణంపై తీవ్ర ప్రభావాన్ని చూపించిందన్నారు. వివిధ కుల, మత, సమూహాల విచ్ఛిన్న సమీకరణ ప్రజాస్వామ్య, లౌకిక ఆదర్శాలను బలహీనపరుస్తుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దేశ రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి నారాయణ గురు సందేశాన్ని ప్రగతిశీల శక్తుల దృక్పథంతో అనుసంధానించాల్సిన అవసరాన్ని కూడా సిఎం పినరయి విజయన్ నొక్కిచెప్పారు. ప్రజాస్వామ్యం, సామాజిక రాజ్యాంగ చట్రం మనుగడ గురు భోధనలను సమానత్వాన్ని సమర్థించే రాజీలేని ప్రగతిశీల ఆదర్శాలతో సమన్వయం చేయడంపై ఆధారపడి ఉంటుందన్నారు. శ్రీ నారాయణ గురు బోధనలలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య లౌకిక సంప్రదాయాలను బలోపేతం చేయడానికి, గుర్తింపు ఆధారంగా ప్రజలను విభజించే ప్రయత్నాన్ని నిరోధించడానికి సమష్టి కృషి చేయాలని విజయన్ పిలుపునిచ్చారు. గురువు ఆదర్శాల ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్యులుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఎస్ఎన్‌డిపి యోగం జనరల్ సెక్రటరీ వెల్లప్పల్లి నటేశన్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరావళిపై స్వతంత్ర కమిటీ వేయాలి

- గనుల తవ్వకాలు పూర్తిగా నిలిపివేయాలి
- కేంద్రమంత్రి భూపేందర్ రాజీనామా చేయాలి
- ఎఐకెఎస్ డిమాండ్



**న్యూఢిల్లీ:** ఆరావళీ పర్వతశ్రేణుల రక్షణకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వ జోక్యం లేని ఒక స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని, ఈ పర్వతశ్రేణుల్లో పూర్తిగా అన్ని రకాల తవ్వకాలను నిలిపివేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. కార్పొరేట్ శక్తులను పెంచిపోషించేందుకు న్యాయస్థానాన్ని తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేసిన కేంద్ర పర్యావరణ,అటవీ,వాతావరణ మార్పులశాఖామంత్రి భూపేందర్ యాదవ్ నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ పర్వతశ్రేణుల్లో జీవావరణ సమతుల్యాన్ని సంరక్షించాలని కోరింది. రాజీలేని నాలుగు డిమాండ్ల సాధనకోసం తదుపరి పోరాటాలను ఉద్ధృతం చేయాలని పిలుపు ఇచ్చింది. ఇకమీదట ఈ విషయంలో ప్రభుత్వ వివరణలకు, ప్రభుత్వ కమిటీలకు కాలం చెల్లిందని, ఇప్పుడు ఒక నిర్ణయాత్మకమైన కార్యాచరణకు సమయం ఆసన్నమైందని ఎఐకెఎస్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు రాజన్ క్షీరసాగర్, రావుల వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అందువల్ల రాజీలేని ఈ డిమాండ్ల సాధనకోసం అన్ని రైతు సంఘాలు, పౌర సంఘాల వేదికలు, పర్యావరణవేత్తలు తదుపరి ఆందోళనను మరింత ఉద్ధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఆరావళీపర్వతశ్రేణులకోసం జరిగే పోరాటం అంటే రైతుల సాగునీటి భద్రత కోసం ఒక భరోసా పొందడమేననీ, ఈ పర్వతశ్రేణుల ద్వారా జీవనాధార మద్దతుపొందే ప్రజల కోసం, జాతి పర్యావరణ భవిష్యత్‌కోసం చేసే పోరాటమేనని వారు ప్రకటించారు. ఆరావళీ పర్వతశ్రేణుల కోసం పాటుపడే అన్ని పర్యావరణ పరిరక్షణ గ్రూపులు, పౌరుల పక్షాన అఖిలభారత కిసాన్ సభ ఐక్యంగా నిలబడుతుందని తెలియజేశారు. గనుల తవ్వకం ప్రయోజనాలకోసం బొబ్బలుపెట్టే వారికి వ్యతిరేకంగా దీనివల్ల నష్టపోయే రాష్ట్రాలలో ఉన్న రైతు సంఘాల సభ్యులను సమీకరిస్తామని, ఆరావళీ పర్వతశ్రేణులను శాశ్వత ప్రాతిపదికపై సమగ్రంగా సంరక్షించడం తప్ప మరో అంశాన్ని అఖిల భారత కిసాన్ సభ సమ్మతించేదిలేదని వారు తెగేసి చెప్పారు. ఈ ప్రకటన ఇంకా ఈ క్రింది విధంగా ఉంది.''ప్రభుత్వ ప్రభావం లేని ఒక ఉన్నతస్థాయీ అధికారాలుగల స్వతంత్ర కమిటీని ఆరావళీ పర్వతశ్రేణుల దర్యాప్తు, సమీక్షకోసం ఏర్పాటు చేయాలి. గుర్తింపు పొందిన స్వతంత్ర జీవావరణ,పర్యావరణవేత్తలు, భూగర్భవేత్తలు,ప్రజా ఉద్యమాలకు చెందిన ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు, అటవీ, అటవీప్రాంత జాతుల ప్రతినిధులు ఈ కమిటీలో సభ్యులుగా ఉండాలి. ప్రభుత్వంలో ఉన్న కార్యనిర్వాహకవర్గీయులు,అధికారగణం లేదా ప్రభుత్వ సంబంధిత నిపుణులకు ఈ కమిటీలో ఆస్కారం ఇవ్వకూడదు, ఈ కమిటీలో జరిగే సంప్రదింపులు, సంభాషణలన్నీ బాహాటంగా అందరికీ అందుబాటులో ఉండాలి, ప్రజలు వాటిని పరిశీలించి సమీక్షించేందుకు వీలుగా ఈ సంప్రదింపులు ఉండాలి.2. ఆరావళీ పర్వతశ్రేణుల్లో జరుగుతున్న అన్ని రకాల తవ్వకాల కార్యకలాపాలను పూర్తిస్థాయిలో నిలిపివేయాలి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ డిసెంబరు 25 వ తేదీన కేవలం కొత్తగా ఎలాంటి గనుల తవ్వకాలు చేపట్టేందుకు లీజుల అనుమతులు రద్దు చేస్తూ మాత్రమే ఉత్తర్వులు జారీ చేసింది. ఈ చర్యలు ఎంతమాత్రం సరిపోవు. దానికి బదులుగా కొత్త–పాత సహా ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని తవ్వకాలు పూర్తిస్థాయిలో నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మేం డిమాండ్ చేస్తున్నాం. ఈ పూర్తిస్థాయీ నిలిపివేత ఆరావళీ పర్వతశ్రేణులు విస్తరించి ఉన్న రాజస్థాన్, గుజరాత్, హర్యానా,ఢిల్లీ అన్ని రాష్ట్రాలలో ఉన్న ప్రాంతాలకూ వర్తించాలి. సుప్రీంకోర్టు విచారణ పూర్తిచేసి పర్యావరణ, జీవావరణ సమతుల్యంపై నిర్వచనాన్ని నిర్ధారించి తుది తీర్పు వెలువడేవరకూ ఈ నిలిపివేత చర్యలు కొనసాగాలి. న్యాయస్థానం కూడా ప్రభుత్వం వైపు నుండి తీసుకునే అరకొర చర్యలు, నిర్లక్ష్యపు చర్యల గురించి ఆందోళన వ్యక్తం చేసింది.3. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ నైతిక బాధ్యత వహించి తన పదవికి వెంటనే రాజీనామా చేయాలి. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు కాపాడటంకోసం ఆయన వాదనలతో ప్రజలను న్యాయస్థానాన్ని కూడా తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేశారు. అందువల్ల ఆయన నైతిక బాధ్యతతో రాజీనామా చేయాలి. ఆయన అధికారంలో కొనసాగే నైతికత కోల్పోయారు. స్వప్రయోజనాలకోసం చేతులు కలిపే మంత్రిత్వశాఖ ఆరావళీ పర్వతాలకు భరోసా ఇవ్వలేదు.4.ఆరావళీ పర్వతశ్రేణులను ఒక అజరామరమైన జీవావరణ,పర్యావరణ వ్యవస్థగా గుర్తించేవిధంగా ఒక అనివార్యమైన నిర్వచనం ఇవ్వాలి. ఎందుకంటే కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఈ పర్వతశ్రేణులు జీవ వ్యవస్థను కాపాడే రక్షణ వలయంగా ఉన్నాయి.డిసెంబరు 29వ తేదీన సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకోసం పోరాటం చేసిన ప్రజలు, పౌర సమాజానికి ఎఐకెఎస్ అభినందనలు తెలియజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ కమిటీ ఇచ్చిన నివేదికను సమర్థిస్తూ సుప్రీంకోర్టుతొలు ఇచ్చిన తన ఉత్తర్వులను తానే నిలిపివేసింది. కోర్టు ఈ విధంగా దిద్దుబాటు చర్య తీసుకోవడాన్ని ఎఐకెఎస్ స్వాగతిస్తున్నది. ఒక ఉన్నతస్థాయీ అధికారాలుగల కమిటీ ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. నాలుగు రాష్ట్రాలలో 670 కి.మీ మేరకు విస్తరించిన ఉన్న ఆరావళీ పర్వతశ్రేణులు కేవలం పర్వతాలు మాత్రమే కాదు, థార్ ఎడారిని తూర్పువైపు విస్తరించకుండా అడ్డుకుంటూ 200 కోట్ల సంవత్సరాలుగా నిలిచిఉన్న భూభౌతిక రక్షణ కవచం, దీనివల్ల కీలకమైన నీటి వనరులు తిరిగి సమృద్ధిగా ఏర్పడానికి అవకాశం కలుగుతోంది, కోట్లాది మంది ప్రజలకు ఆరావళీ పర్వతశ్రేణులు ఒక హరితరక్షణ కవచం. కేవలం 100 మీటర్లు ఎత్తు ఉన్న వాటినే పర్వతాలుగా గుర్తించే పూర్వపు నిబంధన ప్రమాదకరమైనది. అందరినీ తప్పుతోవ పట్టించేది, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేరుస్తుంది. ప్రజా ప్రయోజనాలు దీనివల్ల నెరవేరవు. సుప్రీంకోర్టు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా నిపుణతతో తన అభిప్రాయాన్ని ప్రకటించింది, గతానుభవాల దృష్ట్యా ప్రభుత్వం నిపుణుల కమిటీలను, వాటి నివేదికలను తనకు అనుకూలంగా మలచుకునే ప్రమాదం ఉంది, అందువల్ల స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలి'' అని ఎఐకెఎస్ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

### మారని తీరు

## వర్సిటీ సవరణ బిల్లు వెనక్కి పంపిన రాష్ట్రపతి

**చెన్నై:** విమర్శలు వెల్లువెత్తినా... సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రపతి, గవర్నర్ల తీరు మాత్రం మారడం లేదు. రాష్ట్ర అసెంబ్లీలు పంపిన బిల్లులు సకాలంలో ఆమోదించడానికి బదులు ఏళ్ల తరబడి తమ ఉంచుకొని...చివరికి వెనక్కి పంపడం పరిపాటిగా మారింది. తాజాగా తమిళనాడు ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును రాష్ట్రపతి వెనక్కి పంపారు. స్టాలిన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన మద్రాస్ యూనివర్సిటీ సవరణ బిల్లును రాష్ట్రపతి భవన్ మంగళవారం వెనక్కి పంపింది. మూడేళ్లుగా రాష్ట్రపతి వద్ద ఈ బిల్లు పెండింగ్‌లోనే ఉన్నది. మద్రాస్ యూనివర్సిటీ చట్టం 1923 ప్రకారం తమిళనాడు గవర్నర్ యూనివర్సిటీకి ఎక్స్‌అఫీషియో చాన్సలర్. వైస్ చాన్సలర్ నియామకం, తొలగింపు తదితర హక్కులు గవర్నర్ వద్దే ఉన్నాయి. అయితే... తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవితో స్టాలిన్ సర్కార్‌కు పొసగడం లేదు. గవర్నర్ వల్లే తమిళనాడులో వర్సిటీల వీసీ నియామకాలు నిలిచిపోయాయని ప్రభుత్వం తరచూ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో మద్రాస్ వర్సిటీ బిల్లు ద్వారా గవర్నర్ అధికారాలకు చెక్ పెట్టాలని స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వైస్ చాన్సలర్‌ను నియమించుకునే అధికారం పొందడంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న విధానాలకు అనుగుణంగా యూనివర్సిటీ పాలనను మార్చడం, అలాగే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీని యూనివర్సిటీ సిండికేట్‌లో సభ్యుడిగా చేర్చడం తదితర అంశాలను బిల్లులో తమిళనాడు ప్రభుత్వం పొందుపరిచింది. ఈ బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపగా... మూడేళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లును ఆమోదించకుండానే తిరిగి పంపించారు.

## భారీ ఉగ్రకుట్ర భగ్నం

### 150 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

**జైపూర్:** భారీ ఉగ్రకుట్రను రాజస్థాన్ పోలీసులు భగ్నం చేశారు. 150 కిలోల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నూతన సంవత్సరం వేళ రాజస్థాన్‌లో పెద్ద ఎత్తున పేలుడు పదార్థాలు లభ్యం కావడం కలకలం రేపింది. ఓ కారులో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఇతర పేలుడు పదార్థాలు తరలిస్తుండగా పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఓ కారులో నిందితులు పేలుడు పదార్థాలు తరలిస్తున్నట్లు టోంక్ జిల్లా పోలీసులకు నిఘావర్గాల నుంచి సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనుమానాస్పద కారులో తనిఖీలు నిర్వహించామని, వాహనంలో యూరియా సంచుల్లో 150 కిలోల అమ్మోనియం నైట్రేట్ నింపి ఉంచినట్లు గుర్తించామన్నారు. అదేవిధంగా 200 కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల (1,100 మీటర్లు) సేఫ్టీ ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారిని బూందీ జిల్లాకు చెందిన సురేంద్ర పట్వా, సురేంద్ర మోచీగా గుర్తించారు. ఈ పేలుడు పదార్థాలను బూందీ నుంచి టోంక్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేలుడు పదార్థాలను ఎక్కడినుంచి సేకరించారు? చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వినియోగించాలనుకున్నారా? తదితర వివరాలు రాబట్టే దిశగా దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

# గిగ్ వర్కర్లకు గుడ్ న్యూస్

- ఆహార డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లు జొమాటో, స్విగ్గీలు డెలివరీ భాగస్వాములకు అదనపు ప్రోత్సాహకాలు




**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా గిగ్ వర్కర్ల ఐక్యత సత్ఫలితాలనిచ్చింది. కొత్త సంవత్సరం సందర్భంగా గిగ్ వర్కర్ల యూనియన్లు పిలుపునిచ్చిన సమ్మె నేపథ్యంలో సేవల్లో అంతరాయం కలగకుండా ఉండేందుకు, ఆహార డెలివరీ ప్లాట్‌ఫారమ్‌లు జొమాటో, స్విగ్గీ తమ డెలివరీ భాగస్వాములకు అదనపు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. పండుగ కాలాల్లో ఇది సాధారణంగా అనుసరించే విధానమే. తెలంగాణ గిగ్ అండ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఐఎఫ్ఎటి) ప్రకారం, మెరుగైన పారితోషికాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. డిమాండ్ అత్యధికంగా ఉండే న్యూ ఇయర్ ఈవ్ రోజున, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి ఆహార డెలివరీ, క్విక్ కామర్స్ సంస్థల కార్యకలాపాలపై ఈ సమ్మె ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ ఈవ్, డిసెంబర్ 31, సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పీక్ అవర్స్‌లో ఒక్కో ఆర్డర్‌కు రూ.120 నుంచి రూ.150 వరకు చెల్లింపులు ఇవ్వనున్నట్లు జొమాటో ప్రకటించింది. ఆర్డర్ పరిమాణం మరియు కార్మికుల లభ్యత ఆధారంగా ఆ రోజంతా కలిపి గరిష్ఠంగా రూ.3,000 వరకు సంపాదించవచ్చని కూడా హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.అదనంగా, ఆర్డర్ తిరస్కరణలు, రద్దులపై విధించే జరిమానాలను తాత్కాలికంగా మాఫీ చేసినట్లు వారు తెలిపారు. ఇది అధిక డిమాండ్ ఉన్న పండుగలు, సంవత్సరం చివరి కాలాల్లో సాధారణంగా అనుసరించే ప్రామాణిక విధానమేనని స్పష్టం చేశారు. 'పండుగ కాలాల్లో డిమాండ్ పెరిగి, ఆదాయ అవకాశాలు అధికంగా ఉండే సందర్భాల్లో ప్రతి సంవత్సరం మేము అనుసరించే సాధారణ ఆపరేటింగ్ ప్రోటోకాల్‌లో ఇది భాగం' అని ఈటర్నల్ సంస్థ ప్రతినిధి పిటిఐకి తెలిపారు. ఈటర్నల్ సంస్థకు జొమాటో, బ్లింకిట్ బ్రాండ్లు ఉన్నాయి. అదే విధంగా, స్విగ్గీ కూడా సంవత్సరం చివరి కాలంలో ప్రోత్సాహకాలను పెంచింది. డిసెంబర్ 31 మరియు జనవరి 1 తేదీల్లో కలిపి డెలివరీ కార్మికులు గరిష్ఠంగా రూ.10,000 వరకు సంపాదించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ ఈవ్ ఆరు గంటల పీక్ పీరియడ్‌లో గరిష్ఠంగా రూ.2,000 వరకు సంపాదించవచ్చని స్విగ్గీ ప్రచారం చేస్తోంది. సంవత్సరంలో అత్యంత రద్దీగా ఉండే ఈ సమయంలో సరిపడా రైడర్లు అందుబాటులో ఉండేలా చూడడమే లక్ష్యమని, ఇలాంటి కాలాల్లో అధిక చెల్లింపులు ఇవ్వడం సాధారణ ప్రక్రియేనని వారు పేర్కొన్నారు. కాగా, టిజిపిడబ్ల్యుయు, ఐఎఫ్ఎటి సంయుక్త ప్రకటనలో, నిన్న రాత్రి వరకు భారతదేశవ్యాప్తంగా 1.7 లక్షలకుపైగా డెలివరీ, యాప్‌ఆధారిత కార్మికులు సమ్మెలో పాల్గొనను న్నట్లు ధృవీకరించారు. సాయంత్రం నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అని తెలిపారు. ఇదిలా ఉండగా, డిసెంబర్ గిగ్ వర్కర్లు డిసెంబర్ 25న జరిగిన భారీ సమ్మె తరువాత, తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల్లో వేలాది మంది డెలివరీ కార్మికులు ప్లాట్‌ఫారమ్‌ల నుంచి లాగ్ ఆఫ్ కావడంతో — డిసెంబర్ 31, 2025న దేశవ్యాప్తంగా మరింత ఉద్ధృతమైన సమ్మెకు గిగ్ కార్మికులు పిలుపునిచ్చినట్లు టిజిపిడబ్ల్యుయు, ఐఎఫ్ఎటి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. 'ఈ నిరసన కార్యక్రమం చేపట్టినప్పుడు కంపెనీలు స్పందించలేదు. కార్మికులతో చర్చలు లేవు. భద్రత లేదా పని గంటలపై స్పష్టమైన హామీలు లేవు. ఈ నిర్లక్ష్య ధోరణే నేటి సమ్మెను తప్పనిసరిగా మారింది' అని ప్రకటనలో పేర్కొన్నారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ డిసెంబర్ 31న దేశవ్యాప్త సమ్మెను ప్రకటించింది. భారతదేశవ్యాప్తంగా గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికుల హక్కులు, సంక్షేమం, గౌరవానికి సంబంధించిన డిమాండ్లను సమిష్టిగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపింది. దీనితో కంపెనీలు కీలక ప్రకటన విడుదల చేయక తప్పలేదు.

## సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

**శ్రీనగర్:** కొత్త ఏడాది వేడుకల నేపథ్యంలో దేశంలో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఢిల్లీ నుంచి కన్యాకుమారి వరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచారు. ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు పెంచారు. వివిధ చోట్లు ఆయా సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి స్థానిక పోలీసులు, ఆర్మీ దళాలు కలిసి వాహనాల తనిఖీలు చేపట్టాయి. ఎముకలు కొరికే ప్రాంతం దోడాలోని భలేసా అనే ఎత్తైన ప్రదేశాల్లో సైతం భద్రతను బలగాలు కట్టుదిట్టం చేశాయి. సరిహద్దుల వెంబడి ఉగ్రవాదుల చొరబాటును నిలువరించేందుకు డేఘ కన్నులతో పహరా కాస్తున్నారు. దోడాలోని గడ్డకట్టిన అడవులు, దాచిన్ పర్వత గుహలలో దళాలు గస్తీకాస్తున్నాయి.

## కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయియా చక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్విందర్ (47) అనే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ.25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లిఖ్విందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్‌మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.

## ఒక్కరోజే 2,122 నామినేషన్లు

**ముంబయి:** బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలకు మొత్తం 2,516 నామినేషన్‌లు వచ్చాయని అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 29 వరకు 400 నామినేషన్లు రాగా, నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన 30న అత్యధికంగా 2,122 నామినేషన్ పత్రాలు వచ్చాయని వివరించారు. 227 ఎలక్టోరల్ వార్డులు ఉన్న బీఎంసీకి జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మరుసటి రోజు ఓట్ల లెక్కింపు జరగనుంది. నామినేషన్ దాఖలు ప్రక్రియ ఈ నెల 23న ప్రారంభమై 30న ముగిసింది. మొత్తం 2,516 నామినేషన్లు దాఖలయ్యాయి. గోవండి, డియోనార్, చెంబూర్, ట్రాంబే, మాన్‌కుర్ద్, అనిక్ ప్రాంతాలను కలిగి ఉన్న ఎంఈస్ట్ వార్డ్‌లో అత్యధికంగా 183 నామినేషన్లు వచ్చాయని అన్నారు. ఈ నెల 30 వరకు మొత్తం 11,391 నామినేషన్ ఫారాలు (ఏ,బీ ఫారాలు) పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### శ్మశానవాటికలోనే నామినేషన్ పత్రాలు అందజేత

ఇదిలా ఉండగా... ఒక రాజకీయ పార్టీ నేత తల్లి మరణించడంతో అంత్యక్రియల కోసం శ్మశానవాటికలో ఉన్న ఆయనకు నామినేషన్ పత్రాలు అందజేసింది. ఈ సంఘటన మహారాష్ట్రలో జరిగింది. ఆ రాష్ట్రంలో 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగనున్నాయి. కాగా, ఏక్‌నాథ్ షిండే నేతత్వంలోని శివసేన, నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పోటీ చేసే అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను చివరి నిమిషంలో ఖరారు చేసింది. అయితే ఆయన తల్లి మరణించడంతో మంగళవారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సాయంత్రం 3 గంటలకు నామినేషన్ గడువు ముగియనున్నది. ఈ నేపథ్యంలో నామినేషన్ దాఖలుకు సంబంధించిన ఏబీ ఫారమ్‌ను పార్టీ నేతలతో శ్మశానవాటికకు పంపింది. అక్కడ తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యోగేష్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. దీంతో తల్లి అంత్యక్రియల అనంతరం ఆయన చివరి నిమిషంలో నామినేషన్ దాఖలు చేశారు. నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదో వార్డు అభ్యర్థిగా యోగేష్ గొన్నాడేను షిండే శివసేన పార్టీ నామినేట్ చేసింది.ఆయన కుమార్తె కతికను కూడా ఎనిమిదో వార్డు నుంచి ఎన్నికల బరిలోకి దించింది.

# విఐకి భారీ ఉపశమనం

- రూ.87,695 కోట్ల ఎజిఆర్ బకాయిలు ఫ్రీజ్
- మహారాష్ట్రలో ఆరు లేన్ల కారిడార్‌కు రూ.19,142 కోట్లు
- ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టు కేంద్ర కేబినెట్ నిర్ణయాలు




**న్యూఢిల్లీ:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్‌ఐడియా(వీఐ)కు కేంద్ర కేబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఎజిఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలు ఫ్రీజ్ చేసేందుకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 2032–41 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో ఆరులేన్ల నాసిక్ సోలాపూర్ అక్కల్కోట్ కారిడార్ నిర్మాణానికి ఆమోతం తెలిపింది. ఒడిశాలో హైవేల విస్తరణ ప్రాజెక్టుకు అంగీకరించింది. వోడాఫోన్‌ఐడియా (వీఐ)కు ఊరట కల్పిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ మొత్తాన్ని ఆ టెలికాం సంస్థ ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది భారీ ఊరట. మారటోరియం పీరియడ్‌కుగాను బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 2025–26 నుంచి 2030–31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనమయ్యాయి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవడంతో కేబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రూ.19,142 కోట్లతో మహారాష్ట్రలో నాసిక్ సోలాపూర్ అక్కాల్కోట్‌ను కలుపుతూ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ నిర్మాణానికి కేబినెట్ అంగీకరించిందన్నారు. బీఓటీ (టోల్) మోడ్‌తో 374 కిమీల ఈ ప్రాజెక్టు నాసిక్, అఖిల్యానగర్, సోలాపూర్‌ను కర్నూల్ (ఏపీ)తో అనుసంధానం చేస్తుందని తెలిపారు. నాసిక్ నుంచి అక్కల్కోట్ వరకు గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను వధావన్ పోర్టు ఇంటర్‌చేంజ్ వద్ద ఢిల్లీముంబై ఎక్స్‌ప్రెస్‌ను కలిపే విధంగా ప్రతిపాదన చేశారు. నాసిక్ వద్ద ఆగ్రాముంబై కారిడార్‌ను ఎన్‌హెచ్ 60 (అడెగావ్) వద్ద జంక్షన్‌తో... నాసిక్ సమీపంలో పంగ్రీ వద్ద సమృద్ధి మహామార్గ్‌ను అనుసంధానం చేసేదిగా ఈ ప్రాజెక్టు ఉంటుంది. వెస్ట్‌కోస్ట్ నుంచి ఈస్ట్ కోస్ట్ వరకు అనుసంధానికి ఈ ప్రతిపాదన చేసినట్లు అధికారిక ప్రకటన వెల్లడించింది.చెన్నై నుంచి హోసాపూర్ (ఎంహెచ్ బార్డర్) వరకు తిరువల్లూర్, రేణిగుంటా, కడప, కర్నూలు (700 కిమీల పొడవైన) మీదుగా నాలుగు లేన్ల కారిడార్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపింది. మహారాష్ట్రలో ఆరులేన్ల కారిడార్ పూర్తైతే ప్రయాణ సమయం 31 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుందని ప్రకటన పేర్కొంది.


PUBLIC NOTICE

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, అచ్చంపేట పరిధిలోని యూసెఫ్ పంతులు పాస్టర్ గారికి సంబంధించిన దేవుని భూమి సర్వే నెం. 293, విస్తీర్ణము ఎ.4.32గుంటలు, దీనిని రక్షించుటకు సుమారు 13 సంవత్సరాలు పవర్ ఆఫ్ అటర్నీగా బాధ్యతలు స్వీకరించి అచ్చంపేట ప్రజల సేవ గురించి నిరంతర పోరాటం చేయటం జరుగుచున్నది. ఐతే కొన్ని శక్తులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైన కారణంగా అన్యాక్రాంత దిశగా పయణించుచున్నందున పట్టాదారు యూసెఫ్ పంతులు పాస్టర్ గారి వారసులను ఇట్టి భూమిని రక్షించుకొనుటకు తక్షణమే హైకోర్టులో పోటీచేయుటకు రావాలని తేది. 5-11-2024 నాడు నమస్తే తెలంగాణ దినపత్రికలో పబ్లిక్ నోటీస్ ద్వారా ఆహ్వానించుచూ హెచ్చరించడం జరిగింది. కాని దురదృష్టవశాత్తు సుమారు ఒక సంవత్సరం గడిచినా వారి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఇట్టి మొత్తము వ్యవహారము అచ్చంపేట ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇట్టి భూమిని రక్షించుకొనే ప్రక్రియ వివిధ జాతీయ అత్యున్నత ప్రమాణం గల మిషనరీస్ ఆఫ్ ఛారిటీస్ ఆధ్వర్యంలో జరగడం వలన ఇట్టి కార్యము ప్రజా ప్రయోజన వ్యాజ్యముగా రూపుదిద్దుకోవడం జరిగినది.

ఇట్టి ఉన్నతమైన ప్రక్రియలో భాగంగా సర్వేనెం. 293కు సంబంధించిన ముఖ్యమైన లింక్ డాక్యుమెంట్ (సేల్ డీడ్) వాస్తవికత (జెన్యూనిటీ) విషయములో డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ వారి మెమో నెం. ఆర్.టి.ఐ./387/2025 తేదీ 26-5-2025 ఆదేశానుసారము జిల్లా రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఇచ్చిన సమాచారము ఆశ్చర్యకరమైన మరియు గందరగోళంగా ఉండడంతో దీనిని అన్ని కోణాలలో పరీక్ష చేయుటకు ఫొరెన్సిక్ ప్రోసెస్లో పెట్టడం జరిగినది. ఇట్టి ప్రక్రియ పూర్తైన తక్షణమే స్పష్టమైన ఆధారాలతో ఇట్టి డాక్యుమెంట్ ఆధారిత ప్రోసీడింగ్, పట్టా పాస్బుక్ మరియు ఇతరత్రా లావాదేవీలను మొత్తం రద్దు చేయుటకు గౌరవ న్యాయస్థానాన్ని అభ్యర్థించటం జరుగుతుంది.

ఇట్టి భూమికి సంబంధించిన గోప్యంగా ఉంచబడిన ప్రోసీడింగ్ విషయంలో కేస్ నెం. 6638/ఎస్.ఐ.సి.-2/సి/2024 తేది 8-10-2024 రాష్ట సమాచార కమీషన్లో నడుచుచున్నది. ఇట్టి భూమి సర్వే నెంబర్ 293కు సంబంధించిన రికార్డు గానీ, ప్రొసీడింగ్ గానీ తమ వద్ద లేవని లెటర్ ఎఫ్/345/2025 తేదీ. 14-11-2025 ద్వారా సంబంధిత రెవెన్యూ అధికారులు మోసపూరితమైన తప్పుడు సమాచారము ఇవ్వడం వలన ఇట్టి అధికారులను తక్షణమే షోకాస్ నోటీసు జారీ చేసి చట్టపరమైన తీవ్రచర్యలు తీసుకోవాలని 27-12-2025నాడు రాష్ట సమాచార కమీషన్కు అభ్యర్థించడం జరిగినది. నేరము తీవ్రతను బట్టి వీరిపై చట్టపరమైన క్రిమినల్ చర్యలు చేపట్టే ఆస్కారం ఉన్నది. అదేవిధంగా ఇట్టి భూమి సర్వే నెం. 293 విషయంలో ఆర్.డి.ఓ. ప్రోసీడింగ్ నెం. ఇ/608/2007, తేది 6-6-2007 ప్రకారం పట్టాదారు యూసెఫ్ పంతులు ఎలాంటి డిఫెన్స్ సర్వీసు చేయలేదని స్పష్టం చేయడం జరిగినది. దీనిని బలపరుస్తూ డైరెక్టర్ డిఫెన్స్ వెల్ఫేర్ బోర్డు కూడా యూసెఫ్ పంతులు డిఫెన్స్ సర్వీసు చేసినట్టుగా తమ రికార్డులో లేదని లెటర్ నెం. 1568 -ఆర్.టి.ఐ. - ఇ.ఎమ్.పి. - 2025, తేది 18-9-2025 ద్వారా స్పష్టం చేయడం జరిగినది. ఇట్టి విషయంలో డిఫెన్స్ వెల్ ఫేర్ డైరెక్టర్ హైకోర్టుకు నివేదిక సమర్పించడం జరుగుతుంది. కాబట్టి ఇట్టి భూమిని కేవలం దేవుని సేవ తప్ప లావాదేవీలు జరపడానికి పట్టాదారు వారసులకు కూడా ఎలాంటి హక్కులేదని స్పష్టం చేయుచున్నాము.

పైన తెలిపిన విషయాలను పురస్కరించుకొని సర్వే నెంబర్ 293కు సంబంధించి రెవెన్యూ వారు గోప్యంగా ఉంచిన ప్రొసీడింగ్ ఆధారంగా జరిగిన మొత్తం లావాదేవీలు మరియు తదితర పర్మిషన్లను తమ డెలిగేషన్ హక్కులను ఉపయోగించి స్టే విధించగలరని జిల్లా కలెక్టర్కు తేది. 30-1-2025 మరియు 4-8-2025 రిమైండర్ ద్వారా నివేదిస్తూ దీనివలన ప్రజలకు తీవ్రనష్టం జరుగకుండా కాపాడాలని హెచ్చరించడం జరిగినది. లేనిచో సంబంధింత అధికారులు ఖచ్చితంగా త్వరలో ఫైలు చేయబోయే ప్రజా ప్రయోజనాల వాజ్యంలో హైకోర్టుకు జవాబుదారీ కావలసివస్తుంది. ఈ మొత్తం విషయాలను అవగాహన చేసుకొని ఎలాంటి లావాదేవీలు జరపకుండా ప్రజలు చాలా జాగ్రత్త వహించాలని ఈ నోటీసు పరంగా హెచ్చరించుచున్నాము.

హైదరాబాద్
తేది : 30-12-2025

సం/- సయ్యద్ ఆసదుల్లా, నడింపల్లి గ్రామం,
అచ్చంపేట మండలం, నాగర్ కర్నూల్ జిల్లా. సెల్ : 7893210319

ప్రజాపక్షం
గురువారం, 01 జనవరి

# సవాళ్లతో నడక.. ప్రజల చేతుల్లోనే భవిత

గతం ఎన్నో పాఠాలు నేర్పుతుంది... భవిష్యత్తులో సరిదిద్దుకోవాలని సూచిస్తుంది... లేకపోతే జరిగే అనర్థాలపై హెచ్చరిస్తుంది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, 2025ని సింహావలోకనం చేసుకోవాలి. అనుసరించాల్సిన మార్గాలను.. చేరుకోవాల్సిన లక్ష్యాలను నిర్ధారించుకోవాలి. గత ఏడాది ఒకవైపు రాజకీయ, ఆర్థిక, సామాజిక విపత్తులు, యుద్ధాలు, వాణిజ్య ఘర్షణలు, ప్రకృతి విలయాలను చూసింది. మరొకవైపు, శాస్త్రం, సాంకేతికత, వైద్య రంగాల్లో విప్లవాత్మక పురోగతులు, డిజిటల్ పరిజ్ఞానం, పునర్వినియోగ ఇంధనం, జెనెటిక్ రీసెర్చ్, కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధనలు వంటి విశేష పురోగతి సాధించింది. మంచీ–చెడు.. ఆశ–నిరాశ.. యుద్ధం–శాంతి... ఆవిష్కరణలు–ఆందోళనలు... ఉన్నత శిఖరాలు–అథఃపతనాలు... కలగలిపిన అనుభవం నిన్నటిది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న మనిషి, ఆలోచనల్లో మాత్రం రోజురోజుకూ కుంగిపోవడం దురదృష్టకరం. సమవాదం బలంగా అడుగులేస్తున్న తరుణంలోనే మతవాదం వేళ్లూనుకోవడం ప్రమాదకరం. కొన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు మరింత బలపడ్డాయి. అత్యధిక దేశాలు మరింత దయనీయ పరిస్థితి ఎదుర్కొంటాయి. దేశాల మాదిరిగానే.. పేద, ధనిక వర్గాల మధ్య కూడా అంతరం ఎన్నడూ లేనంతగా పెరిగింది. ధరలు ఆకాశానికి నిచ్చెనలేస్తుంటే... సామాన్యుడి ఆదాయాలు దారుణంగా పడిపోతున్నాయి. వెంటాడుతున్న నిరుద్యోగం... పెరుగుతున్న ద్రవ్యోల్బణం... సగటు జీవి బతుకు దుర్భరం. ఇదంతా ఒక్కసారిగా వచ్చిపడిన ఉపద్రం కాదు.. హఠాత్తుగా సంభవించిన విపత్తు అంతకంటే కాదు. పాలకుల స్వార్థ ప్రయోజనాలు.. పెట్టుబడిదారీ విధానాలు.. కులమతాల పేరుతో అణచివేతలే ఈ దుస్థితికి కారణాలు. కాలం చెల్లిన ఆలోచనలు.. ఏకపక్ష నిర్ణయాలు.. సమాజాన్ని మతాల పేరుతో నిలువునా చీల్చే ప్రయత్నాలు ఆగనంతకాలం అద్భుతాలు ఏవీ జరగవు. చేసిన పొరపాట్లను గ్రహించి, విధానాలు మార్చుకొని, ఉజ్వల భవిష్యత్తు వైపు నడవడం.. దేశాన్ని నడిపించడం పాలకుల బాధ్యత. ఆ కనీస బాధ్యతను సైతం విస్మరిస్తున్న ప్రభుత్వాలకు సరైన సమాధానం చెప్పడం ప్రజల కర్తవ్యం. ప్రజా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటూ, ప్రాంతం, మతం, భాష పేర్లతో ప్రజలను విభజించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రజలు అత్యంత బాధ్యతతో కుంగిపోవడం కాదు, వివేకంతో స్పందించాలి. భావోద్వేగాలకు లోనుకాకుండా ఆ నిర్ణయాల అసలైన ఉద్దేశాన్ని, ప్రభావాన్ని తెలుసుకోవాలి. నిజాలను, అబద్ధాలను వేరు చేసి, నమ్మకమైన సమాచార వనరుల ద్వారా విషయాన్ని అర్థం చేసుకోవడం చాలా అవసరం. అవగాహన కలిగిన పౌరుడిగా ఉండటమే ఈ దిశగా తొలి అడుగు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాంతియుత మార్గాలే బలమైన ఆయుధాలు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించాలి. చర్చలు, సభలు, నిరసనలు శాంతియుతంగా నిర్వహిస్తూ ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేయాలి. విభజనను రెచ్చగొట్టే మాటలు, విద్వేష ప్రసంగాలు, వదంతులను తిరస్కరించి, ఐక్యతను బలపరిచే భాషను, భావనను ప్రోత్సహించాలి. సామాజిక మాధ్యమాల్లో కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి, అసత్యాలను వ్యాప్తి చేయకుండా నిజాలను పంచుకోవాలి. న్యాయవ్యవస్థ, స్వతంత్ర సంస్థలు, మీడియా వంటి ప్రజాస్వామ్య స్తంభాలను ప్రజలు బలోపేతం చేయాలి. చట్టబద్ధమైన మార్గాల్లో న్యాయస్థానాలను ఆశ్రయించడం, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, స్వతంత్ర మీడియాను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలపై సమీక్ష సాధ్యమవుతుంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించి, ప్రజా వ్యతిరేక విధానాలకు రాజకీయంగా సమాధానం చెప్పడం కూడా కీలకమే. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రాంతం, మతం, భాషల వైవిధ్యాన్ని విభజనగా కాకుండా దేశ బలంగా భావించే దృక్పథాన్ని ప్రజలు పెంపొందించాలి. పరస్పర గౌరవం, సహనం, సౌహార్ద్రభావం వంటి విలువలను రోజువారీ జీవితంలో ఆచరించాలి. ప్రజలు ఐక్యంగా, శాంతియుతంగా, రాజ్యాంగబద్ధంగా స్పందించినప్పుడు ఏ ప్రభుత్వానికైనా ప్రజా వ్యతిరేక మార్గంలో కొనసాగడం కష్టమవుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది శక్తి అనే సత్యాన్ని గుర్తుంచుకోవడమే సరైన మార్గం. 2026 పట్ల ఆశలు, ఆశయాలు మరింత స్పష్టంగా ఉన్నాయి. చేయాల్సిందల్లా, మన గతం నుండి నేర్చుకున్న పాఠాలను సక్రమంగా అమలు చేయడం. దేశాలు, సంస్థలు, వ్యక్తులు సాంకేతికతను కేవలం వాణిజ్య లేదా లాభనష్టాల కోసం కాకుండా మానవతా, పరిసర పరిరక్షణ, సమాజ సంక్షేమానికి ఉపయోగించాలి. పర్యావరణ పరిరక్షణ, శాశ్వత శక్తి వనరుల వినియోగం, ప్రకృతి విపత్తులకు ముందస్తు సిద్ధత ప్రధాన ప్రాధాన్యం కావాలి. సామాజికంగా, యువత, మహిళలు, నిరుద్యోగులకు సమాన అవకాశాలు, న్యాయసమ్మత వేతనం, భద్రత వంటి అంశాల్లో ముందడుగు వేయడం అవసరం. ఏ రకంగా చూసినా కొత్త సంవత్సరంలో, భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజల చేతిలోనే ఉంది.

## మారుతున్న మేడారం జాతర స్వరూపం

తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే మేడారం మహాజాతరకు కౌంట్డౌన్ మొదలైందనే వాదనలు వినిపిస్తున్నాయి. రెండేళ్లకు ఒకసారి వచ్చే ఈ వనదేవతల పండుగకోసం కోట్లాదిమంది భక్తులు ఎదురుచూస్తుంటారు. ప్రభుత్వం ఈసారి రూ.251కోట్ల భారీ బడ్జెట్‌తో జాతరను సరికొత్తగా తీర్చిదిద్దుతోంది. కోయ, ఆదివాసి వంశీయుల చరిత్రను ప్రతిబింబించేలా గద్దెల ప్రాంగణాన్ని విస్తరిస్తున్నారు. అయితే ఈ అలంకారాలు, హంగులు ఒక ఎత్తు అయితే మరోవైపు చరిత్రాత్మకమైన వనదేవతల మేడారం జాతర స్వరూపం క్రమంగా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభివృద్ధి పనులు ఓకే అనుకున్నప్పటికీ ఆ అభివృద్ధి పేరుతో మేడారం జాతర కార్పొరేట్ రంగు పులుముకుంటున్నదనే వాదనలో నిజం లేకపోలేదు. చరిత్ర కలిగిన మేడారం జాతరను అధునాతన సౌకర్యాలతో దిర్చిదిద్దడం పట్ల హర్షం వ్యక్తమవుతూనే ఈ అభివృద్ధి పనులు జాతర సహజత్వాన్ని దెబ్బతీస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల వల్ల ఆదివాసీ అస్తిత్వంతో పాటు వనదేవతల జాతరను భవిష్యత్తులో కార్పొరేట్ మయంగా మార్చే అవకాశం లేకపోలేదు.

మరోవైపు సామాన్య భక్తుడి జేబుకు చిల్లు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రూ.251 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రభుత్వం రూ.101కోట్లతో చేస్తున్న గద్దెల విస్తరణ పనులు జాతరకు కొత్త రూపునిస్తున్నా, అది సహజత్వాన్ని దెబ్బతీస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంక్రీట్ కట్టడాల వల్ల అడవి పల్చబడుతోందని, గిరిజన సంప్రదాయాలకు భిన్నంగా జాతర 'కమర్షియల్' అవుతోందని పలువురు స్థానిక ఆదివాసీలు, విశ్లేషకులు ఆందోళన చెందుతున్నారు.

జాతర సమయంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నా, రద్దీ దృష్ట్యా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించే వారి సంఖ్య ఎక్కువ. ఈ క్రమంలో ట్యాక్సీలు, ఆటో లు సాధారణ చార్జీల కంటే మూడు నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తుండటం సహజమే. మరోవైపు మేడారం చుట్టుపక్కల ఉన్న లాడ్జీలు, తాత్కాలిక గుడారాల అద్దెలు ఆకాశాన్ని తాకే అవకాశం ఉంది. గతంలో చెట్ల కింద డేరాలు వేసుకునే వెసులుబాటు ఉండేది, కానీ ఇప్పుడు ఆ స్థలాలను కూడా వాణిజ్యపరంగా మార్చడంతో సామాన్యుడికి వసతి కష్టమైపోయే పరిస్థితి గతంకంటే ఎక్కువగా ఉంటుంది. 'ఒకప్పుడు మేడారం అంటే ఎడ్లబండి కట్టుకుని, ఇంటి నుంచి చద్దిమూటలు తెచ్చుకుని అమ్మవార్లను దర్శించుకునే వారు. కానీ ఇప్పుడు కనీసం తలదాచుకోవడానికి అద్దె గది కావాలన్నా, స్నానం చేయడానికి నీళ్లు కావాలన్నా పన్ను చెల్లించాల్సి వస్తోందని, భవిష్యత్తులో మరింత కార్పోరేట్ మయం కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అభ్యుదయ సాహిత్య సేవలో 72 ఏళ్ళ ప్రయాణం!

## 'విశాలాంధ్ర-నవచేతన' ప్రచురణాలయాల కృషి



సోమశిల తిరుపాల్
998926033

ఏ మాత్రం పుస్తకాలు చదివే అలవాటున్న ఏ వ్యక్తి ఇంట్లో చూసినా.. సాహిత్యాభిరుచి కలిగిన అనేకమంది కవులు, రచయిత(త్రు)ల ఇండ్లల్లో చూసినా.. అల్మారా లాంటి 'షెల్ఫ్' నిండానో, లేదంటే.. ఏకంగా ఓ గదిలో సగభాగమో.. కొందరు ఇండ్లలో అంతకుమించి గది పూర్తిగానూ పుస్తకాలతో నిండిన ఇండ్లు చాలానే కనిపిస్తుంటాయి. అలాంటి వారి ఇండ్లను చూస్తే మనం ఒక్కింత ఆశ్చర్యానికి లోనవుతాం. తెలుగు భాషా సాహిత్యాలను వారు ఎంతగా అభిమానిస్తున్నారో మనకు ఇట్టే అర్థమవుతుంది.

ఈ కోవలో ఎక్కువగా ఉపాధ్యాయ ఉపన్యాస వృత్తిలో ఉన్న వాళ్ళే ఎక్కువగా కనిపిస్తున్నా, ఇలాంటి సాహితీ వేత్తలు అన్ని రంగాలలోనూ అనేకమంది ఉన్నారన్నది వాస్తవం. ఇట్లా ఆధునిక కాలంలో పుస్తకాలను ప్రేమించే వారి సంఖ్య, కొనేవారి సంఖ్య ఈ మధ్య గణనీయంగా పెరిగిందనే చెప్పాలి.

ఇందుకూ సాక్ష్యం... ప్రతి సంవత్సరం 'ఎన్టీఆర్ గార్డెన్' లో నిర్వహించే 'హైదరాబాద్ బుక్ ఫెస్టివల్'లోనూ, అటు విజయవాడ బుక్ ఫెస్టివల్ లోనూ.. కలకత్తా, మద్రాసు లాంటి ఇతర నగరాలలో నిర్వహించే పుస్తక ప్రదర్శనలోనూ పుస్తకాలను కొంటున్న పాఠకుల సంఖ్య విపరీతంగా పెరిగిందన్నది గణాంకాల సమాచారం. వీటితోపాటుగా.., హైదరాబాదు నగరంలోని కోఠి, సికింద్రాబాద్ లాంటి అనేక ప్రాంతాలలో వివిధ బుక్ సెంటర్లలోనూ, ఆన్లైన్లోనూ, మరియు ప్రతి ఆదివారం హైదరాబాదు ఫుట్‌పాత్ రోడ్లపైన సెకండ్ హ్యాండ్ పుస్తకాలు.. జరుగుతున్న అమ్మకాలే అందుకు నిదర్శనం. ఇట్లా.. ఎవరి షాపులోనైనా.. ఇండ్లల్లోనైనా.. ఎన్ని పుస్తకాలు ఉన్నా.. అందు లో 'విశాలాంధ్ర ప్రచురణాలయం పుస్తకాలు' తప్పకుండా ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఎందుకంటే... 'కావ్యం కవితలు చెబుతుంది/ఇతిహాసం హితవులు చెబుతుంది/ పురాణం బుద్ధులు చెబుతుంది/శతకం సూక్తులు చెబుతుంది!' మరి కొన్ని గ్రంథాలు సాహిత్యం చదివిస్తాయి! వర్తమాన గ్రంథాలు గత చరిత్రను చెబుతాయి! ఇవన్నీ కలిపితే.. విశాలాంధ్ర నవచేతన పుస్తకాలు అవుతవి! ఆ పుస్తకాలను చదివితే ఆ స్పర్శ మనలను అనిర్వచనీయమైన భావలోకంలోకి తీసుకెళుతుంది.

కాలక్రమంగా ఆయా వ్యక్తులు ఇండ్లు మారినప్పుడో.. ఆ ఇంట్లో స్థల ప్రభావం వల్లనో.. ఏ కారణం చేతనో కొన్ని పుస్తకాలను మరొక పాఠకుడికో, గ్రంథాలయాలకో ఇచ్చేసినప్పుడు అందులో విశాలాంధ్ర పుస్తకం, అలాగే సోవియట్ రష్యా (మాస్కో)'రాదుగ' ప్రచురణాలయం పేరుతో ఉన్న పుస్తకాలు మాత్రం మన మది గదిలోని జ్ఞాపకాల సెల్ఫ్‌లో అతుక్కుని అట్లాగే ఉండిపోతవి. వాటిని తీసివేయడానికి ఏ సాహితీవేత్తకు మనసు అంగీకరించదు. విశాలాంధ్ర పుస్తకాల స్థానం, గొప్పతనం అలాంటిదీ మరి! అట్లా..

విశాలాంధ్ర(నవచేతన) ప్రచురణాలయాలు దేశంలోని ప్రముఖ ప్రచురణకర్తల్లో ఒకటిగా వెలుగొందుతూ అగ్రగామిగా నిలబడ్డాయి.

అనాదికాలం నుండి ఉన్న తెలుగు భాష, సాహిత్యాలు ఆరిపోయే దీపం కాకూడదని, ఇందుకోసం మనదైన భాషా, సాహిత్యం, సంస్కృతిని, చరిత్రను, కళలను పరిరక్షించుకోవడం కోసం రచయితల చేతులను ఆ అక్షర దీపానికి అడ్డుగా పెట్టాలి. అందుకోసం ఓ సంస్థ ఉండాలి అని మొదటితరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు ఎందరెందరో నాడు తపించారు. అందులో భాగంగానే.. అటు 'దినపత్రిక' ఇటు 'పబ్లిషింగ్ హౌస్' రెండింటిని రెండు కళ్ళుగా భావించి, పుస్తక ప్రచురణ రంగంలో ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన సంస్థగా తీర్చిదిద్దడంలో 'విశాలాంధ్ర నవచేతన విజ్ఞాన సమితి' పాలకవర్గ సభ్యులదే కీలక పాత్ర!

అట్లా..1953నుండి ఇప్పటివరకు వేలాదిమంది రచయితలకు, భాషా పండితులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విజ్ఞానవంతులైన ఎంతోమంది మేధావులకు అక్షర జ్ఞానాన్ని పంచుతూ పుస్తక ప్రచురణ రంగంలోనూ, అమ్మకంలోనూ తెలుగు రాష్ట్రాలలో ముందు వరుసలో ఉన్నవి విశాలాంధ్ర మరియు నవచేతన పుస్తకాలయాలు.

అందుకు కారణం...విజ్ఞాన సమితి పాలకవర్గ సభ్యులు, సంపాదక వర్గ సభ్యులే కాకుండా కొన్ని కొన్ని సందర్భాలలో అందివచ్చిన అవకాశాలనెన్నింటినో వదులుకొని, అనేక సంవత్సరాలుగా ఈ సంస్థలో పనిచేస్తున్న ఎందరో ఉద్యోగుల త్యాగంతో కూడిన కార్యదీక్ష ఉన్నది. అలాగే.. పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్‌తో పాటు వివిధ జిల్లాల బుక్‌హౌస్‌ల నిర్వహణలో మేనేజర్ స్థాయిలో పనిచేస్తూ, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, పుస్తకాల మార్కెట్‌లో ఎంత పోటీతత్వం నెలకొని ఉన్నా, ఆ సంస్థ దీపాన్ని నిరంతరం వెలిగేలా ఉండేందుకు ఎప్పటికప్పుడు నూతన విధానాలను అవలంబించి, పుస్తకాల అమ్మకాలలో అగ్రస్థానంలో నిలబెట్టిన ఆయా జిల్లాల బుక్ హౌస్ బ్రాంచి మేనేజర్లు, సేల్స్ మెన్లు, మరియు కిందిస్థాయి సిబ్బందే దీని అభ్యున్నతికి మరో కారణం. ఈ పరంపరలో తొలి దశలో మద్దుకూరి చంద్రం, చంద్ర రాజేశ్వరరావు, కంభంపాటి, ఏటుకూరి బలరామమూర్తి, టీవీ, చలసాని వాసుదేవరావు, తుమ్మల, పరకాల లాంటి ఎంతోమంది ప్రముఖులు అభ్యుదయ భావజాలాన్ని పాఠకులకు అందించాలనే లక్ష్యంతో విశాలాంధ్ర సంస్థను నెలకొల్పడానికి ప్రణాళికలు రచించారు.

ఇందుకోసం మొదటి తరంనాటి అనేకమంది ప్రముఖ రచయిత(త్రు)ల, కవుల రచనలతో పాటుగా, సోషలిస్టు భావాల వ్యాప్తి, మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ ల తాత్వికత రచనల ప్రచారం, అభ్యుదయ ప్రగతిశీల సాహిత్య ప్రచురణ అన్న స్ఫూర్తితో.. **1953 జనవరి, 1న విజయవాడలో విశాలాంధ్ర ప్రచురణాలయం** ఏర్పాటయింది. దీనిని సాధించడంలో విజ్ఞాన సమితి సభ్యుల ప్రణాళిక మరువలేనిది. అప్పటినుండి ఇప్పటి వరకు శక్తి వంచన లేకుండా సుమారు 72 ఏళ్లుగా సాహిత్య కృషి చేస్తూ ఈ సంస్థ తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. అట్లా... 'జనం నుండి జనంలోకి సాహిత్యం ప్రజల దగ్గరికే పుస్తకం' అన్న నినాదంతో, సమాజానికి మంచి ఆరోగ్యవంతమైన సాహిత్యం అందించాలన్న సదాశయంతో.. ఉత్తమ ప్రచురణలను పాఠకులకు అందిస్తూ వారి విజ్ఞాన, వికాస, వినోదాలకు ఎంతగానో తోడ్పడుతూ... తెలుగు సాహిత్య రంగంలో ఎనలేని కృషిచేస్తూ వచ్చింది.

కాలానుగుణంగా ఈ ప్రచురణాలయం నుండి కథలు, నవలలు, కవిత్వము, నాటకము, రూపకము, గేయాలు, స్వీయ చరిత్రలు లాంటి అనేక ప్రక్రియలలో కలిపి దాదాపు 2000 మంది రచయిత(త్రు)ల రచనలతో కలిపి ఇప్పటి వరకు సుమారు 4000 పైచిలుకు రచనలను వెలువరించింది.

ఈ ప్రచురణాలయం మొదటగా నవయుగ వైతాళికులైన గురజాడ, గిడుగు, కందుకూరి, శ్రీశ్రీ లాంటి అనేకమంది రచయితల రచనలు మరియు రాహుల్ జీ, ప్రేమ్ చంద్, కిషన్ చంద్ లాంటి ఎందరో మహనీయుల రచనలను ప్రచురించింది. వీటితో పాటూ.. జన సామాన్యంలో మూఢనమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ అవగాహనను పెంచే అనేక రకాల విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను ప్రచురించింది. ఈ కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాలలో పుస్తక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఏ పాఠకుడైనా అక్కడ... తడిమి చూస్తే తన్మయత్వం కలిగించే పుస్తకాలు ఎన్నో వారికి లభించేలా తీర్చిదిద్దింది.

అందులో... తాపి ధర్మారావు రచనలు, కోకు సాహిత్యము, మల్లాది రామకృష్ణ శాస్త్రి, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం, దాశరథి రంగాచార్య రచనలు, గుర్రం జాషువా, కృష్ణశాస్త్రి సాహిత్యం, అడవి బాపిరాజు, పాలగుమ్మి పద్మరాజు, ఆరుద్ర, బలివాడ కాంతారావు, రావిశాస్త్రి, మాగోఖలే, వాకాటి పాండురంగారావు, శరత్ చంద్ర చటోపాధ్యాయ రచనలు, కరుణశ్రీ సాహిత్యం, ఏటుకూరి బలరామమూర్తి, బుచ్చిబాబు, గోపీచంద్, బాపు రమణల రచనలు, కేతు విశ్వనాథరెడ్డి, కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఏటుకూరి ప్రసాదు, ఆర్ వి ఆర్, రాచమల్లు రామచంద్రారెడ్డి, తిరుమల రామచంద్ర, ఆరుద్ర, సినారే, పరకాల, వాసిరెడ్డి సీతాదేవి, భాస్కరభట్ల కృష్ణారావు, జిడ్డు కృష్ణమూర్తి, గిడుగు రామ్మూర్తి, మధురాంతకం రాజారాం, దిగవల్లి వెంకటశివారావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, సురవరం ప్రతాపరెడ్డి, కె.వి రమణారెడ్డి, ఉత్పల, అవసరాల, మహీధర, గంగినేని, విద్వాన్ విశ్వం, సోమసుందర్, కాళోజి, జీవీకృష్ణారావు, కంభంపాటి, కుందుర్తి, అట్లూరి, తుమ్మల, డి.రామలింగం, మద్దుకూరి చంద్రం, రావి నారాయణరెడ్డి, నల్ల నరసింహులు, గంగినేని, చేకూరి, పోలాప్రగడ, కుందుర్తి, కొంపెల్ల, చాసో, బొల్లిముంత, సదానంద్ శారద లాంటి ఎందరో ప్రముఖ రచయితల రచనలు అన్నింటిని సేకరించి ప్రచురించింది. వీరిలో కొందరివి సంపుటాలుగా ప్రచురించి పాఠకులకు అందించిన ఘనత ఈ ప్రచురణాయాలకే దక్కింది.

పై రచయితలతో పాటు.. తిలక్ కథలు, కొవ్వలి నవలలు, వట్టికోట నవలలు, రావూరి భరద్వాజ, చిలకమర్తి లక్ష్మీ నరసింహము, పి. శ్రీదేవి, తెన్నేటి సూరి, సింగమనేని నారాయణ, శాంతి నారాయణ, సోమసుందర్, ఎంబిఎస్ ప్రసాద్, ముదిగంటి సుజాతారెడ్డి, నిడమర్తి ఉమారాజేశ్వరరావు, ముద్దుకృష్ణ సంకలనాలు, చిలకమర్తి, మొక్కపాటి, మాగదుమ్ కవితలు, గజ్జల మల్లారెడ్డి గేయాలు, అనిశెట్టి సుబ్బారావు, కె.వి.రమణ, పులి సాంబశివరావు, ద్వానా శాస్త్రి, జానమద్ది హనుమచ్ఛాస్త్రి, తుమ్మల వెంకట్రామయ్య, భద్రిరాజు కృష్ణమూర్తి, నార్ల చిరంజీవి, పడాల రామారావు, పురిపండా అప్పలస్వామి, రావి నారాయణరెడ్డి, నల్ల నరసింహులు, అక్కిరాజు, చింతా దీక్షితులు, భమిడిపాటి, భరాగో, కేశవరెడ్డి, కాలువ మల్లయ్య, సి.ఎస్.రావు, నిఖిలేశ్వర్, సుంకర, వాసిరెడ్డి, తస్లీమా నస్రీన్, అంపశయ్య నవీన్, వల్లూరు శివప్రసాద్, తెలిదేవర భానుమూర్తి, ఎస్వి సత్యనారాయణ, సుద్దాల అశోక్ తేజ, పెనుగొండ, పెద్దింటి అశోక్ కుమార్ లాంటి మరెందరో రచయితల/రచయిత్రుల రచనలతో పాటు కె.రామలక్ష్మి, రెడ్డి రాఘవయ్యను మొదలుకొని, ఈ తరం బాల సాహిత్య రచయితలైన వందలాది మంది బాలసాహిత్య రచనలను ప్రచురించి పాఠకులకు పరిచయం చేసింది.

వీటితోపాటు మాక్సిమ్ గోర్కి, టాల్ స్టాయ్, దోస్త్ యే విస్కి, షోలాకోవ్, చార్లెస్ డికెన్స్ లాంటి ఎందరో పాశ్చాత్య ప్రముఖ రచయితల రచనలను అనువాదాలుగా ప్రచురించి తెలుగు పాఠకులకు అందించింది. ఈ సంస్థలు ప్రచురించిన అనేక గ్రంథాలకు ప్రతిష్టాత్మకమైన అనేక అవార్డులు లభించడం గర్వకారణం. ఈ గ్రంథాలలో కొన్నింటిని కొన్ని విశ్వవిద్యాలయాలు పాఠ్య గ్రంథాలుగా చేసుకున్నాయి. ఇట్లా.. బాల సాహిత్యం నుండి భారతం దాకా, ఫిక్షన్ నుండి ఫిలాసఫీ దాకా, కేజీ నుండి పీజీ వరకు రిఫరెన్స్ గా ఉపయోగపడే పుస్తకాలను ఎన్నింటినో ప్రచురించింది.

**2014లో ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం తెలంగాణ రాష్ట్రంలో విశాలాంధ్ర ప్రచురణాలయం వారసత్వంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ ఏర్పడి అభ్యుదయ సాహిత్యాన్ని ప్రచురిస్తున్నది.**

ఇందులో.. అక్షరాలను తూటాలుగా మార్చి సాహిత్యాన్ని సమాజానికి అందించిన మహా రచయితలు ఎందరో ఉన్నారు. ఆ యా రచయితల కలాలను ఆయుధాలుగా మలిచి, అక్షరాలతో నవరసాల సాహిత్య పరిమళాన్ని వెదజల్లే అలాంటి వారిని ఎందరినో తయారు చేసింది విశాలాంధ్ర నవ చేతన ప్రచురణాలయ సంస్థలు. తెలుగు సాహిత్యంలోని మరే ప్రక్రియ అయినా ఆయా రచయతల అక్షరాలకు మొదట ప్రాణం పోసి, ఆధునిక సాహిత్యం వైపుకు అడుగులేసి 'న భూ తో న భవిష్యతి' అన్న రీతిలో స్థిరంగా ముందుకు సాగింది ఈ ప్రచరణాలయాలే!. ముఖ్యంగా అమ్మ భాష మాధుర్యాన్ని దశదిశల చాటేలా ఎప్పటికప్పుడు తన ప్రణాళికను మలుచుకున్నది. పుస్తక తయారీలోనూ రాజీలేని ఉన్నత నాణ్యతా ప్రమాణాలకు సైతం ఇతర ప్రచురణకర్తలకు ఈ సంస్థలే ఆదర్శమైనవి. ఇప్పటికి కూడా రచయితలు ఎవరైనా... పుస్తకం రాయాలంటే దాన్ని ప్రచురించడానికి, అమ్మడానికి ఈ సంస్థలు ఉన్నాయన్న భరోసా ఉంది. రచయితలకు పాఠకులకు వారధిగా నిలిచింది ఈ ప్రచురణ సంస్థలే.

ఈ విధంగా 72 ఏళ్లుగా లక్షలాది మంది పాఠకుల మెదళ్ళమీద, మనసుల మీద, జీవితాలమీద కలిగించిన ప్రభావాల గురించి చెప్పడం ఏ ఒక్కరికీ సాధ్య పడదు. ఇప్పుడు ప్రముఖులుగా ఉన్న వాళ్లు, వివిధ రంగాలలో ఉన్నత ఉద్యోగులుగా ఉన్న వాళ్ళందరూ తమ చిన్ననాట ఏదో ఓ సందర్భంలో తప్పకుండా ఈ సంస్థ ప్రచురించిన పుస్తకాలు చదివిన వాళ్లే ఉంటారు అన్నది వాస్తవం!

తెలుగు ప్రజల హృదయాలలో ఉత్తమ సాహిత్య నిలయంగా ఇంతటి సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ప్రచురణాలయాలు ఇలా కొనసాగడం వెనుక ఎంతో క్రమశిక్షణతో నడిపిన మొదటి తరం 'విజ్ఞాన సమితి పాలకవర్గమైన నాయకులు' ఏటుకూరి బలరామమూర్తి, నిడమర్తి ఉమా మహేశ్వర రావు లాంటి వారి సేవలు ఎప్పటికీ మరువలేనివి. అలాంటి బాధ్యతలను వారసత్వంగా తలకెత్తుకు ని, ఇప్పటి వరకు అంతే నిబద్ధతతో దాదాపు రెండు దశాబ్దాలనుండి ముందుకు తీసుకువెళుతున్న నేటితరం సమితి సభ్యులైన చాడ వెంకటరెడ్డి, పల్ల వెంకటరెడ్డి, మోహన్ రెడ్డి, కూనంనేని సాంబశివరావు, మధుకర్, ఎస్వి.సత్యనారాయణ లాంటి అనేకమంది సభ్యులతో పాటు, ఆయా బ్రాంచ్ మేనేజర్లు, రచయితలు సంస్థ ఉద్యోగులు అందరూ కలిసి సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు తీసుకుపోవడం హర్షించదగ్గ విషయం. వీరంతా కలిసి విశాలాంధ్ర ప్రచురణాలయం 50 ఏళ్ల సందర్భంగా..2003లో స్వర్ణోత్సవ సంబరాలను, 2013లో, 60ఏళ్ల 'వజ్రోత్సవ సంబరాలను' ఘనంగా నిర్వహించ డం అభినందనీయం. ముఖ్యంగా.. అప్పుడు విశాలాంధ్ర ఇప్పుడు నవచేతన ప్రచురణాలయానికి దాదాపు 50ఏండ్లుగా పూర్తిస్థాయి సంపాదక బాధ్యతలు నిర్వర్తిస్తున్న 92 ఏళ్ల వయస్సున్న డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ గారి శ్రమ, సేవలు మరువలేనివి.

అలాగే ప్రచురణాలయానికి అప్పటి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించిన 'జోషి' గారి సేవలు అనన్య సామాన్యం. ఆ తర్వాత ఈ సంస్థల అభివృద్ధికి తోడ్పడిన వారిలో అప్పటి జనరల్ మేనేజర్ పి. రాజేశ్వరరావు, సీనియర్ బ్రాంచి మేనేజర్లైన ఎస్. రాజా, ఈశ్వరరెడ్డి, అమరేశ్వర రావు, రామరాజు, బాబూరావు, వరప్రసాద్, యోగి, కనకారావు, వి.వి బ్రహ్మం, ఆనంద్, జనార్దన్, రమణారెడ్డి, సత్తిరెడ్డి, సంజీవరావు, నారాయణ, రాజేశ్వర్, సోమశేఖర్, వీరన్న, భూపేష్, బాదుల్లా, వెంకటలక్ష్మి గార్లతోపాటు.. ఉద్యోగులైన మరి కొందరు, లోకం భాస్కర్ రావు, పద్మావతి, పద్మ, పావని, నరసింహా, విష్ణుమూర్తి, చక్రధర్, హేమలత, శ్రీనివాస్ రెడ్డి, సోమశిల తిరుపాల్, ప్రస్తుత పబ్లిషింగ్ హౌస్ రెండు రాష్ట్రాల సంస్థల మేనేజర్లు అయిన మనోహర్ నాయుడు(విశాలాంధ్ర), నారాయణరెడ్డి(నవచేతన) గారి లాంటి వాళ్ళతోపాటు అనేకమంది రిటైర్డ్, సీనియర్, జూనియర్, ప్రస్తుత, పూర్వ ఉద్యోగుల సేవలు, మరియు మొబైల్ గ్రంథాలయ రథసారథులైన స్వామి, గోవర్ధన్ రెడ్డి, అంజయ్య, కృష్ణ లాంటి వారు .. ఎందరో.. సంస్థ విజయంలో భాగస్వాములుగా ఉన్నారు. వారందరి సేవలు మరువలేనివి.

నేను (వ్యాసకర్త) ఆ ఈ సంస్థల్లో అడుగుపెట్టి, సరిగ్గా 20 సంవత్సరాలు. ఆ పుస్తక ప్రచురణ రంగంలో పనిచేసిన అదృష్టం కారణంగా.. అనేకమంది ప్రముఖ సాహితీవేత్తలతో, పుస్తకాల సమస్త సర్వస్వాన్ని అవపోసన పట్టే అవకాశం రావడం నేను ఓ అదృష్టంగా భావిస్తున్నాను.

ఏది ఏమైనా... అక్షరాలకు తమ మేధస్సును జోడించి, పదాలతో, పాటలతో, మాటలతో, అనేక రకాల ప్రక్రియల్లో మనకు తమ రచనల ద్వారా జ్ఞాన సంపదను అందించిన, అందిస్తున్న మహానుభావులైన ఎందరో రచయిత(త్రు)లకు, పాఠకులకు ఈ సందర్భంగా శతకోటి వందనాలు. అలాగే ఇన్నేళ్లుగా ఈ సంస్థ అభివృద్ధికి కారకులైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ.. సొంత గ్రంథాల ప్రచురణకర్తగానే కాక, జాతీయస్థాయిలో అటు ప్రచురణకర్తలకు, ఇటు రచయితలకు పంపిణీదారుగా 72 సంవత్సరాలుగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, సుదీర్ఘ ప్రయాణం చేస్తున్న విశాలాంధ్ర, నవచేతన ప్రచురణాలయ సంస్థలు తమ ఉనికిని కొనసాగిస్తూ ప్రయాణిస్తున్నాయ్.

ఇవీ.. మునుపటిలాగా రచయితలను, పాఠకులను ఆదరిస్తూ.. రాబోయే రోజుల్లో ఈ సంస్థలు 'శత వసంతాల ఉత్సవాల'ను ఘనంగా జరుపుకోవాలని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ..

## ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

కొత్త సంవత్సరం కోటి ఆశల మూటలు తోడ్కొని రావాలని కోరుకుంటున్నాం. వ్యక్తిగత, సామాజిక, వృత్తిపరమైన, కుటుంబపరమైన బాధ్యతలతో జీవితం పయనిస్తున్నది. వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ఇతర రంగాల్లో ముందుకు పోగలుగుతాం. కొత్త సంవత్సర వేడుకల్లో మునిగిపోతున్న వేళ మనం రానున్న 12 నెలల్లో వ్యక్తిగత శారీరక, మానసిక ఆరోగ్యానికి తీసుకోవలసిన నిర్ణయాలను నేడు దృఢ సంకల్పంతో తీసుకుందాం. మన జీవనశైలిని మరింత సానుకూల దిశగా దశల వారీగా మార్చుకుందాం, ఆరోగ్య సౌభాగ్యాలను పెంచుకుందాం. మనం తీసుకోవలసిన లక్ష్యాలు అతి క్లిష్టమైనవి లేదా అతి సులభమైనవిగా ఉండకూడదు. అసాధ్యమైన లక్ష్యాలను ఎంచుకున్నపుడు వైఫల్యాలు వెక్కిరించి మానసిక విశ్వాసం సన్నగిల్లుతుంది. అతి స్వల్ప లక్ష్యాలను ఎంచుకున్నపుడు మన శక్తి సామర్థ్యాలు పూర్తిగా వినియోగపడవు. నేటి అసౌకర్యం రేపు సానుకూల సౌకర్యంగా మారి మన జీవనశైలిని సుసంపన్నం చేయాలి.

దినచర్యను నిశితంగా పరిశీలిద్దాం. అవసరమైన స్వల్ప మార్పులను చేసుకుందాం. మన కండర, మానసిక ఆరోగ్యానికి వేకువ జామున నిద్రలేచే ప్రయత్నం చేద్దాం. ఉదయ భానుడి కిరణాలు సోకుతున్న వేళల్లో సైక్లింగ్, వాకింగ్ లేదా స్విమ్మింగ్, జాగింగ్, యోగా, ప్రాణాయామం, లేదా ధ్యానం చేయడానికి సమయం కేటాయిద్దాం. నిన్నటి కన్నా నేడు కుటుంబంతో గడిపే సమయాన్ని పెంచుదాం. అనవసర వ్యయాలను తగ్గిస్తూ పొదుపుకు పట్టం కడదాం. ప్రతిరోజు సరైన నిద్రకు తగు సమయా న్ని కేటాయిద్దాం. నిద్ర లేమి సమస్య పలు అనారోగ్యాలకు హేతువు అవుతుందని తెలుసుకుందాం. మన ఎదుగుదలకు ఉపకరించే నూత న అభిరుచులను పెంచుకోవడానికి కొత్త వ్యక్తులతో లేదా సృజనశీల సమూహాలతో సంబంధాలను పెంచుకుందాం.



పొగ లేదా మద్యం తాగే అలవాటు ఉంటే దానిని 2026లో తగ్గించడానికి కఠిన నిర్ణయాలు తీసుకొని అమలు పరుద్దాం. పీచు పదార్థాలు అధికంగా ఉన్న శాఖాహారాలను మన మెనూలో చేర్చుదాం. క్రమం తప్పకుండా వైద్య పరీక్షకు చేసుకునే అలవాటును 2026లోనైనా ప్రారంభిద్దాం. మన ఇంటి లేదా కార్యాలయ లేదా విద్యాలయ ప్రాంగణాల్లో ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ మొక్కలను దత్తత తీసుకొని వాటి ఆలనాపాలనా చూసుకుంటూ మానసిక సంతోషాన్ని పెంచుకుందాం. మన ఇంటికి లేదా కార్యాలయానికి చేరుకోవడానికి లిఫ్ట్‌కు బదులు మెట్ల మార్గాలను ఎంచుకొని ఆరోగ్యాలను పదిల పరుచుకుందాం. మనం ప్రేమించే వ్యక్తులతో పాటు మనల్ని ప్రేమించే వ్యక్తులతో గడపడానికి కొంత సమ యం కేటాయిద్దాం. నూతన సంవత్సర వేడుకల్లో అత్యుత్సాహంతో పాల్గొనకుండా కొంత సమయాన్ని కేటాయించి 2026లో అమలు పరచవలసిన నూతన జీవనశైలి మార్పుల గూర్చి స్పష్టమైన నిర్ణయాలు తీసుకుందాం, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని రుజువు చేద్దాం.

బిఎంఆర్

## నూతన సంవత్సరంలోనైనా మెరుగైన వైద్యం అందేనా?

మెరుగైన వైద్యం కోసం వేతన జీవులు చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. ఎదురు చూపులే తప్ప మెరుగైన వైద్యం అందడం లేదన్నది వాస్తవం. అసలు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ లకు ఉచిత వైద్యం కలగానే మిగలనుందా? నూతన సర్కారు ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటుందా? నూతన సంవత్సరంలోనైనా మెరుగైన అరోగ్య కార్డులు ఎన్నడు జారీచేస్తుంది? వంటి ప్రశ్నలకు సమాధానం లేక ఉద్యోగులు వైద్యం అందక విలవిలలాడుతున్నారు. గత ప్రభు త్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉచిత హెల్త్ కార్డు లు జారీచేశారు. అలాగే వెల్‌నెస్ సెంటర్లను అట్టహాసంగా ప్రారంభించారు. కొన్నా ళ్ళు వెల్‌నెస్ సెంటర్లలో వైద్యం అందినప్పటికి ఉద్యోగులకు సరిపడా వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో అవి మూతబడ్డాయి. దీర్ఘకాలిక వ్యాధులకు జారీచేసిన హెల్త్ కార్డులు పని చేయకపోవడం, ఇన్ పేషంట్, శస్త్ర చికిత్సలకుమాత్రమే హెల్త్ కార్డులు అలాగే దంతవైద్యం, నేత్ర వ్యాధులకు మాత్రమే పనిచేయడం అది కొన్ని ఆసుపత్రులకే పరిమితం కావడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.

**రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో తీవ్రజాప్యం:**

హెల్త్ కార్డులకు సమాంతరంగా రీయింబర్స్‌మెంట్ సౌకర్యమున్నా సంబంధిత పత్రాలు సమర్పించిన తదుపరి వైద్యశాఖ మంజూరికీ నాలుగు నెలల సమయం, మంజూరై వచ్చాకా నగదు ఉద్యోగుల ఖాతాల్లో జమకావడానికి ఆరు నెలలకు పైగా పడుతుండడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అప్పుల పాలవుతున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. ఈ నెలాఖరుకు రీయంబర్స్‌మెంట్ గడువు ముగుస్తుండడం గమనార్హం.ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు నెలవారీ ప్రీమియం చెల్లిస్తాం మహాప్రభో అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించండి అని ఎన్నిసార్లు ప్రాతినిథ్యం చేసినా పెడచెవిన పెట్టడం గత ప్రభుత్వాలకే చెల్లింది. ప్రైవేట్ ఆసుపత్రులలో చేరి మెరుగైన వైద్యం పొందడం వేతన జీవులకు తలకుమించిన భారంగా మారింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**రీయింబర్స్‌మెంట్ గరిష్ట పరిమితిని పెంచాలి:** దీర్ఘకాలిక వ్యాధులకు చేసే శస్త్ర చికిత్సలకు పది లక్షలకు పైగా ఖర్చవుతున్న పరిస్థితుల్లో నేటికి గరిష్టం గా కేవలం రెండు లక్షల రూపాయలను చెల్లించడం శోచనీయం. ఆ పరిమితిని ఐదు లక్షలకు పెంచాలి. అలాగే 1972లోని ఇంటిగ్రేటెడ్ మెడికల్ అటెండెన్స్ రూల్స్ జిఒ.74ను సవరించాల్సిన ఆవశ్యకత ఉన్నది. అలాగే సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ ప్యాకేజీ రేట్లను సవరించాలి.

ఎన్నాళ్ల నుండో వేచిచూస్తున్న హెల్త్ కార్డుల జారీ నూతన సంవత్సరంలోనైనా ప్రభుత్వం తమకు అందించి అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. కార్డుల సక్రమ అమలు కు ఒక ప్రత్యేక ట్రస్టుని ఏర్పాటుచేస్తూ ఆ ట్రస్టులో ఉద్యోగులను భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయ సంఘాలు మొదటి నుండి ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అలాగే ఉద్యోగుల ప్రీమియంకు సమానంగా ప్రభుత్వ గ్రాంట్ జతచేసి మొత్తాన్ని ట్రస్టు ద్వారా అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వంతో ఆరోగ్య కార్డుల జారీ కొరకై పలు దఫాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘా లు చర్చలు జరిపిన నేపథ్యంలో త్వరలో పని కొచ్చే మెరుగైన ఆరోగ్య కార్డులు అందుకోవచ్చుననే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తారనే ఆశ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

సుధాకర్.ఎ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
తెలంగాణ టీచర్స్ యూనియన్ (STUTS)
9000674747

## మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామం రుద్రప్ప చెరువులో బుధవారం చేప పిల్లను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార్మికులు చేపల పెంపకంలో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణి చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

**ప్రజాపక్షం/మర్రిగూడ:** చర్లగూడెం ప్రాజెక్టు నుంచి కొందరు అక్రమార్కులు మట్టి దందా జోరుగా సాగిస్తున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టి రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో విశేషం.ప్రాజెక్టు నుంచి జోరుగా మట్టి దందాచర్లగూడెం ప్రాజెక్టు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్,జేసీబీని బుధవారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు రెవిన్యూ,పోలీస్,ఇరిగేషన్ అధికారులతో కలిసి వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు తమ నిఘాను మరింత పెంచుతామని,వాల్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఆయన వెంట ఇరిగేషన్, పోలీస్ అధికారులు ఉన్నారు.



## నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తానని నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం లో నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు.అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నల్గొండ జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తాను అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ అందించేందుకు కృషి చేస్తాననిన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.నూతన జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి బి.చంద్రశేఖర్‌కు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు పూల మొక్కలు,పుష్ప గుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.

## బుద్ధుడి సందేశాలను ప్రపంచానికి చాటి చెప్పే కేంద్రంగా బుద్ధవనం

వియత్నాం బౌద్ధ భిక్షువులు -భిక్షునీలు బుద్ధవనం సందర్శన



**ప్రజాపక్షం/నందికొండ:** వియత్నాం దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు, బౌద్ధ భిక్షునీలు బుధవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బౌద్ధ అధ్యయన కేంద్రంలో పరిశోధనలు నిర్వహిస్తున్న వియత్నాం బౌద్ధ భిక్షువులు, భిక్షునీలు ఈ సందర్భంగా బుద్ధవనంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాలను దర్శించారు.నాగార్జునకొండ , మ్యూజియం సందర్శన, ముందుగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నాగార్జునకొండలోని మహాస్తూపాన్ని దర్శించిన వారు,అక్కడి మ్యూజియంలో ప్రదర్శితమైన విలువైన చారిత్రక శిల్పాలను ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి చేరుకున్నారు. బుద్ధవనంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన,ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు వారికి ఘన స్వాగతం పలికారు. బుద్ధవనం విశేషాలు, నిర్మాణ ప్రత్యేకతలు,ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వారు వివరించారు.ఈ సందర్భంగా భిక్షువులు త్రీరత్న పూజ,దాతు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనంపై రూపొందించిన లఘు చిత్రాన్ని వీక్షించారు. బుద్ధవనాన్ని సందర్శించిన వియత్నాం బౌద్ధ భిక్షువులు,భిక్షునీలు ఇక్కడి శిల్పకళ,ఆధ్యాత్మిక వాతావరణంపై ప్రశంసలు వ్యక్తం చేశారు.బుద్ధుని సందేశాలను ప్రపంచానికి చాటి చెప్పే కేంద్రంగా బుద్ధవనం నిలుస్తోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బుద్ధవనం వివరాలను తెలియజేసే సమాచార బ్రోచర్లను వారికి అందజేశారు.అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల సందర్శనలతో బుద్ధవనానికి మరింత అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని అధికారులు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** రోడ్లు, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.బుధవారం నాంపల్లి మండలంలో తుమ్మలపల్లి ఓ లో ప్రైవేట్ కార్యక్రమానికి పాల్గొని వచ్చి తిరిగి హైదరాబాదుకు వెళ్ళుచుండగా యరంగడ్లపల్లి గ్రామం వద్ద మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పులిమామిడి నర్సింహా రెడ్డి, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గిరిజన గ్రామపంచాయతీ తండా లో కొత్తగా చౌక ధరల దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లయితే వెంటనే రేషన్ దుకాణాన్ని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ఆయన వెంట రామదాస్ శ్రీనివాస్,పులి మామిడి నరసింహా రెడ్డి, ఏడు దొడ్ల కృష్ణారెడ్డి,మాల్ డైరెక్టర్ జమ్ముల వెంకటేశ,మాజీ ఉపసర్పంచ్ వనపర్తి యాదయ్య,ఆకారపు శ్రీను,సిలువేరు యాదయ్య ఉన్నారు.

## నల్లగొండ జిల్లా ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక





**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా ఎస్‌టియు టిఎస్ జిల్లా కౌన్సిల్ అత్యవసర సమావేశం ఎస్‌టియూ భవన్ నల్లగొండ నందు జిల్లా అధ్యక్షులు కొనకంచి వీరరాఘవులు అధ్యక్షతన నిర్వహించారు..ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ తండు భానుప్రకాష్ గౌడ్ మరియు మురారి శెట్టి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర స్థానిక కార్యదర్శి వై.కరుణాకర్ రెడ్డి,యాదాద్రి జిల్లా ఎస్‌టియూ అధ్యక్షులు రమేష్ గార్లు పాల్గొనడం జరిగింది.పెండింగ్ లో ఉన్న 5డిఏను వెంటనే ప్రకటించాలని,నూతన పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని,ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు వెంటనె చెల్లించాలని,టెట్ నుండి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలని,టెట్ పరీక్షకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు ఓడి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నరేంధర్ రెడ్డి,జిల్లా మండల బాధ్యులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు కె దత్తేశ్వర్,ఉదయరాణి,ప్రమీల,నాగేశ్వర్ రావు , వెంకటేశ్వర్లు,అశోక్ రెడ్డి,సైదా నాయక్,విజయప్రసాద్,జాన్ ఖాన్,తావుర్యానాయక్,రామ్ సింగ్,వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కెసిఆర్‌దే

రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10 ఏళ్లు పాలించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల పాలు చేసిందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. బుధవారం యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలకేంద్రంలో ఐటిఐ,(ఏటిసి) అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్, కొడుకు, కూతురు, అల్లుడు నేడు ఆస్తుల కోసం కొట్లాడుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో 65 ఐటిఐ కాలేజీలు ఉండగా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో వాటికి నిధులు ఇవ్వకుండా నాశనం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ కాలేజీల అన్నింటిని గాడిలో పెట్టి నడిపిస్తున్నామని, విద్యార్థులు, యువతలో అడ్వాన్స్ టెక్నాలజీ, స్కిల్స్ పెంచి వారికి ఉద్యోగాలు కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి మరో 46 ఐటిఐ, అడ్వాన్స్ సెంటర్లు ప్రారంభించాలని చెప్పారని, ఆ దిశగా తాము పని చేస్తున్నామని చెప్పారు. ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో 540 మంది ట్రైనీలు అవసరం ఉన్నారని, వారి నియామకం కోసం సీఎం రేవంత్ రెడ్డి అనుమతి ఇచ్చారని తెలిపారు. ఐటిఐ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో చదువుకునే విద్యార్థులకు సబ్సిడీ కూడా ఇస్తామని, ప్రతి నెల వారికి రూ.2 వేల స్టై ఫండ్ ఇస్తామని ప్రకటించారు. నకిరేకల్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో కూడా ఐటిఐ సెంటర్లు మంజూరు చేసి త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, టీచర్లు లేని ప్రభుత్వ స్కూల్ ఉండవద్దన్న లక్ష్యంతో 50 వేల టీచర్ల పోస్టులు కూడా భర్తీ చేశారని తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు కోరిక మేరకు తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో మరో ఐటిఐ సెంటర్ మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మందుల సామేలు, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గానికి అత్యధిక నిధులు ముఖ్యమంత్రి ఇచ్చారని తెలిపారు. బునాదిగాని కాల్వ పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలేరు ఎమ్మెల్యే (ప్రభుత్వ విప్) బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, అడ్డగూడూరు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, అడ్డగూడూర్ సర్పంచ్ పూజారి వనజ, సైదులు, మోత్కూర్ మార్కెట్ చైర్మన్ నూనె ముంతల విమల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నల్గొండ మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను జనవరి1, గురువారం ఉదయం 11:00 గంటలకు అధికారికంగా విడుదల చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఓటరు జాబితాను మున్సిపల్ కార్యాలయంతో పాటు, నల్గొండ తహసీల్దార్ , జిల్లా కలెక్టర్ కార్యాలయాల నోటీసు బోర్డులపై ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.ఈ ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు,చిరునామా,లేదా ఇతర వివరాలలో ఏవైనా తప్పులు ఉన్నా, లేదా అభ్యంతరాలు ఉన్నా ఈ నెల1 నుండి 5 వరకు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల వారీగా ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడంలో భాగంగా ఈ ప్రక్రియను చేపడుతున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఓటరు జాబితాను తనిఖీ చేసుకోవాలని ఆయన కోరారు.

## రూ.6 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలో రూ.6 కోట్లతో సీసీరోడ్లు,డ్రెయినేజీ నిర్మాణాల పనులు చేపడుతున్నట్లు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణాన్ని దశల వారిగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.బుధవారం నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 02,05,10,11,12,20 వార్డుల్లో నూతనంగా చేపట్టనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డుల్లో డ్రెయినేజీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశామని ఆయన తెలిపారు.త్వరలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్‌తో పాటు డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలో శంకుస్థాపనకార్యక్రమాలునిర్వహించనున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వపదేళ్లపాలనలోరాష్ట్రాన్నిఅప్పులపాలుచేశారని ఆయన విమర్శించారు ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యంగా అమలు చేస్తోందన్నారు. నకిరేకల్ పట్టణంలోని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్నిర్మాణాన్నికూడాత్వరలో ప్రారంభించనున్నట్లుఆయనతెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చౌగోని రజితశ్రీనివాస్, వైస్ చైర్మన్ మూరారిశెట్టిఉమారాణికృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ రంజిత్ కుమార్ , పిఎసిఎస్ చైర్మన్ నాగుల వంచవెంకటేశ్వరరావు,కౌన్సిలర్లు, రాచకొండ సునీల్ ,గాజుల సుకన్య, చౌగొని అఖిల లక్ష్మణ్, నాబోతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వాన్ని మరిచిన మాతృత్వం

మురుగు కాల్వలో మృతిచెందిన పసికందు లభ్యం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మానవత్వాన్ని మరిచిన ఓ మాతృమూర్తి తనకు జన్మించిన బిడ్డ ఆడ శిశువు అని తెలిసి అభం శుభం తెలియని ఆ నవజాత శిశువును నిర్ధాక్షిణ్యంగా కవర్‌లో కట్టి మురుగు కాల్వలో పడేసిన సంఘటన బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో వెలుగుచూసింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటి కార్మికులు రోజువారి పనుల్లో భాగంగా ఉదయం షాబునగర్‌లో మురుగుకాల్వలను శుభ్రపరుస్తున్న క్రమంలో ఒక కవర్‌లో చుట్టిన పెద్ద వస్తువుగా భావించి మున్సిపల్ కార్మికుడు బయటకు తీశాడు. ఆ సమయంలో కవర్‌లో నుంచి ఒక అవయ వం బయటకు కనపడడంతో అనుమానం వచ్చి కవర్ మొత్తం తీసి చూడగా బొడ్డుతాడు కోయకుండా ఉన్న నవజాత శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఉన్నతాధికారులకు, పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని నవజాత శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంత ప్రజలను వివరాలను వివరాలను అడిగి తెలుసుకున్నా రు. ఏమాత్రం దయ దాక్షిణ్యాలు లేకుండా ఆడబిడ్డ అని తెలిసి ఆ నవజాత శిశువును కర్కశకంగా మానవత్వాన్ని మరిచి మురుగు కాల్వలో పడి వేయ డం పట్ల పలువురు కంటతడి పెట్టారు. మృతిచెందిన నవజాత శిశువును పో స్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలిచినట్లు పోలీసులు తెలిపారు.



## శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకతకు సైన్స్‌ఫెయిర్

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత అలాగే పరిశోధన దృక్పదాన్ని పెంపొందించేందుకు సైన్స్‌ఫెయిర్ ప్రదర్శన ఉపయోగపడుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల పవార్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని వివిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన 53వ జిల్లాస్థాయి విద్యా, బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025ముగింపు కార్యక్రమంకు కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తక్కువ వయసులోనే విద్యార్థులు సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయం, గ్రీన్ ఎనర్జీ, ఎమర్జింగ్ టెక్నాలజీ, వినోద్మాతక గణిత నమూన నిర్మాణం, ఆరోగ్య పరిశుభ్రత, నీటి సంరక్షణ నిర్వహణలో సమస్యలు గుర్తించి నూతన ఆలోచనలతో విన్నూత్న పద్దతిలో సమస్యలను పరిష్కరించడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఈ చిన్నారులు ఇప్పుడే మదర్ బోర్డు, సెన్సార్, కోతుల బెడద కోసం పరికరాలను ఉపయోగించి సమస్యల పరిష్కారిస్తున్నారంటే రాబోయే 10 ఏళ్ల తర్వాత వారి నూతన ఆలోచనలతో రోబోటిక్స్‌ను తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు వారికి సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం తో 2025 సంవత్సరంతో ముగుస్తుందని, 2026 నూతన సంవత్సరం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటూ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు జూనియర్ విభాగంలో 121, సీనియర్ విభాగంలో 133 మంది, ఇన్స్పెయిర్ 64 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను కలెక్టర్ వీక్షించారు ఈలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టెక్నాలజీపై ఆసక్తి పెరిగి, సమస్య పరిష్కార నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చినవిద్యార్థులకు, ఉపాధ్యాయులకు బహుమతులు, ప్రశాంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డిఈవో అశోక్, తహసిల్దార్ కవిత, ఎంపిడివో సుమంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈవోలు సైదానాయక్, సలీంషరిఫ్, చత్రునాయక్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లను ఆకట్టుకున్న చామల


రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లకు న్యూ ఇయర్ కానుక

వినూత్న నిర్ణయంతో ఆకట్టుకున్న చామల కిరణ్ కుమార్ రెడ్డి

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రికి కూడా గ్రీటింగ్స్







**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమైన 'ప్రజా పాలన' విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో సర్పంచుల భాగస్వామ్యం ఎంతో కీలకమని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సర, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ఆయన తన నియోజకవర్గ పరిధిలో ఒక వినూత్నమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. భువనగిరి లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 968 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులకు ఎంపీ స్వీట్ బాక్సులను, గ్రీటింగ్ కార్డులను పంపించారు. సాధారణం గా రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వైరుధ్యాలు సహజం. కానీ ఎంపీ చామల కిరణ్ రెడ్డి పార్టీలకతీతంగా అందరు సర్పంచులను గౌరవించాలని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ సర్పంచులతో పాటు బిఆర్‌ఎస్, బిజెపి , స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన వారందరికీ వ్యక్తిగతంగా ఈ కానుకలను చేరవేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా జగదీష్ రెడ్డి తండ్రికి శుభాకాంక్షలు**

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తండ్రి, నాగారం సర్పంచ్ అయిన గుంటకండ్ల రామ చంద్రారెడ్డికి కూడా ఎంపీ చామల స్వీట్ బాక్స్ పంపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. రాజకీయ విభేదాలు పక్కన పెట్టి, పదవిలో ఉన్న ప్రజా ప్రతినిధులను గౌరవించే ఈ సంస్కృతిపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

**తెలంగాణ రైజింగ్లో గ్రామాల పాత్రే కీలకం**

'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే గ్రామాలు బాగుండాలి. అందుకే రాజకీయాలకు తావు లేకుండా సర్పంచులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.' అని గ్రీటింగ్ కార్డులో ఎంపీ చాముల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**సర్పంచుల హర్షం..** తమ గ్రామాల అభివృద్ధికి ఎంపీ సహకారం ఉంటుందని భరోసా కల్పించినందుకు, పండుగ వేళ తమను గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు తెలిపినందుకు నూతన సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ స్వీట్ బాక్సుల పంపిణీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## చండూరులో డిసిసి అధ్యక్షుడికి అవమానం



**ప్రజాపక్షం/చండూరు :** నల్లగొండ జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడు పున్న కైలాస్ నేతకు బుధవారం చండూరులో తీవ్ర అవమానం జరిగింది. బుధవారం చండూరు మున్సిపాలిటీని అంగడిపేట బిఆర్‌సి ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ జిల్లా బిగ్ టీవి స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి బోయపల్లి సురేందర్ దశదిన కార్యక్రమానికి డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత హాజరకాగ కొట్టి సేపట్లోనే శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అక్కగికి రాగ స్వాగతం పలికి వారిని గుర్చోబెట్టారు. ఆసేపటికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అక్కడికి రాగానే అందరూ కలిసి దివంగత సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమానికి స్టేజీ ఎక్కే క్రమంలో డిసిసి అధ్యక్షుడిని స్టేజీ మీదికి వెళ్ల కుండా అక్కడ ఉన్న సిఐ అడ్డుకున్నారని సమాచారం. స్టేజీ ఎక్కకుండా నన్ను ఎందుకు అడ్డుకుంటున్నారు అని ప్రశ్నించిన సమాధానం చెప్పకుండా ఎదురు ప్రశ్నించడంతో మంత్రి హస్తం ఉన్నట్లు అక్కడ చర్చించుకోవడం జరిగింది. పున్న కైలాస్ నేత డిసిసి అధ్యక్ష పదవి వచ్చినప్పటినుండి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కావాలసి కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాడని విమర్శ ఉంది. అక్కడ అవమానించిన పోలీస్‌లపై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడి నుండి వెళ్ళిపోయారు. డిసిసి అధ్యక్షుడిని పోలీసులు అడ్డగించడంపై స్థానిక కాంగ్రేస్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత మధ్య ఉన్న ఈ తతంగం ఎటువైపు దారితీస్తుందో వేచిచూడాలి మరి.




## సుదీర్ఘ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పోలీసు డిపార్ట్‌మెంట్ నందు సుదీర్ఘకాలం సేవలు అందించడం అభినందనీయమని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ నందు ఏఎస్‌ఐగా పనిచేస్తున్న రాములు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఎస్‌పి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లిష్టమైన పోలీసు ఉద్యోగ విధుల నిర్వహణలో గృహిణిగా భర్తకు సహాయ సహకారాలు అందించడంలో భార్య సేవలు విలువైనవన్నారు. కానిస్టేబుల్‌గా చేరి ఈ స్థాయికి చేరడం, జీవిత ప్రయాణంలో సంపూర్ణ సంతోషకరమైన ఉన్నత కుటుంబాన్ని ఏర్పాటు చేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఏఓ మంజుభార్గవి, డిఎస్‌పి నరసింహ చారి పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల అకాలంగా మృతి చెందగా పోలీసు చేయూత పథకం ద్వారా కమలాకర్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కును జిల్లా ఎస్‌పి కె నరసింహ జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం అందించారు.

## బాదేపల్లిలో ఆగ్రో రైతు సేవ కేంద్రం 2ను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ అధికారి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం సంయుక్త సంచాలకులు, మహబూబ్‌నగర్ జిల్లా నోడల్ అధికారి బాలు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకటేష్ బుధవారం జడ్చర్ల మండలం బాదేపల్లి లోని ఆగ్రో రైతు సేవ కేంద్రం 2ను తనిఖీ చేశారు. ఆగ్రో రైతు సేవ కేంద్రంలో యూరియా కొనుగోలు వివరాలను, యూరియా బుకింగ్ విధానంను రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. రైతులతో మాట్లాడుతూ యూరియా ను వృధా చేయొద్దు అని పంటలకు వేసేటప్పుడు మొక్క దగ్గర యూరియా వేసిన తర్వాత మట్టి కప్పినట్లు అయితే యూరియా ను మొక్క బాగా తీసుకుంటుందని తెలిపారు. అలాగే రైతులకు అవసరం కి మించి యూరియా వాడకూడదు, అవసరం మేరకు కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 17610 మంది రైతులు నేటివరకు 52545 యూరియా బ్యాగ్స్ ను ఆన్లైన్ లో బుక్ చేసుకోవడం జరిగిందని వివరించారు. అందులో 46193 బ్యాగ్స్ రైతులు కొనుగోలు చేయడం కూడా జరిగింది.

## విరాళంగా బ్యారికేడ్లు అందజేత

**ప్రజాపక్షం/నర్వ :** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు, వాహన తనిఖీలు సమర్థవంతంగా నిర్వహించుటకు గాను, నర్వ గ్రామ సర్పంచు, ప్రతిభ హై స్కూల్ కరస్పాండెంట్ అయిన హనుమంత్‌రెడ్డి నాలుగు (04) బ్యారికేడ్లను విరాళంగా అందజేశారు. వీటిని వాహన తనిఖీలు నిర్వహించుటకు మరియు ప్రజా భద్రతను కాపాడుటకు ఉపయోగించబడును. ఈ సహకారం ప్రజాహిత దృష్ట్యా ప్రశంసనీయమైనది.




## పుట్టిన రోజున బిసి నేత పాడె మోసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

### సంతాప సూచకంగా జడ్చర్లలో బర్త్ డే వేడుకలు రద్దు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** నిత్యం ఏదో ఒక ప్రత్యేకతతో తన విశిష్టతను చాటుకునే జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్ రెడ్డి తన పుట్టిన రోజున ఒక కాంగ్రెస్ పార్టీకి చెందిన బిసి నాయకుని పాడె మోసి ఆయనకు తుది వీడ్కోలు పలికారు. కాంగ్రెస్ నేత మృతికి సంతాప సూచకంగా జడ్చర్లలో తన బర్త్ డే వేడుకలను కూడా రద్దు చేసుకోవడం ద్వారా తనకు పుట్టిన రోజు వేడుకల కంటే పార్టీ నేతలు, కార్యకర్తలే ముఖ్యమని చాటారు. ఈ ఉదంతం వివరాల్లోకి వెళ్తే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జన్మదినం బుధవారం డిసెంబర్ 31న కాగా ఈ సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి జడ్చర్లలో పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేశారు. అయితే జడ్చర్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేత బాలరాజ్ యాదవ్ రెండు రోజుల క్రితం గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. గతంలో జడ్చర్ల ఎంపిటిసిగా వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన బాలరాజు యాదవ్ మరణంతో 31వ తేదీన ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమాలన్నింటినీ అనిరుధ్‌రెడ్డి రద్దు చేసుకున్నారు. 31వ తేదీ బుధవారం రోజునే బాలరాజు యాదవ్ అంత్యక్రియలు జరుగుతుండటంతో నేరుగా హైదరాబాద్ నుంచి జడ్చర్ల చేరుకున్న అనిరుధ్‌రెడ్డి బాలరాజు యాదవ్ శవయాత్రలో పాల్గొనడంతో పాటుగా ఆయన పాడెను మోసి ఆయన పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## పురపాలక సంఘంలో ఎన్నికల కార్యాచరణపై సమీక్ష

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణ కేంద్రంలో రాబోయే పురపాలక సంఘం ఎన్నికల సందర్భంగా జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ఎన్నికల కార్యాచరణ అవలంభించాల్సిన వ్యూహాల గురించి సూచించడం జరిగింది. కొత్తకోటలోని 15వ వార్డులో అన్నింటికీ పోటీ చేసి మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షులు భరత్, భూషణ్ , కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాబా శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, సబ్బిరెడ్డి, వెంకట్ రెడ్డి నారాయణమ్మ, ఫిలిమ్ బోర్డు మెంబర్ పబ్బ నరేందర్, అమరేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, బాలు, శ్రీకాంత్, రవి, వెంకటేశ్, మహేష్, శ్రీకాంత్ రెడ్డి, బాలస్వామి, రఘు, రవీందర్ గౌడ్, హరి ప్రసాద్, మైనార్టీ నాయకుడు మోయిన్ , తిరుపతి, సాగర్, రాఘవేందర్ గౌడ్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను వివాహం చేసుకొన్న వారికి కూడా రూ.లక్ష వివాహ ప్రోత్సాహక బహుమతి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దివ్యాంగులను , సకలాంగులు వివాహం చేసుకొనినచో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రూ.1,00,000/ల వివాహ ప్రోత్సాహక బహుమతిని దివ్యాంగులు, దివ్యాంగులను వివాహం చేసుకొన్నా కూడా మంజురు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. కావున దివ్యాంగులు, సకలాంగులను వివాహము చేసుకొన్నా, తేది 19/05/2025 తరువాత దివ్యాంగులు,సకలాంగులు వివాహం చేసుకొని దంపతులు www.epass. telangana. gov. in అనే వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని , సంబంధిత సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారంను సమర్పించి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ , సంక్షేమ అధికారిని యస్. జరీనా బేగం ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లా స్థాయి గణిత పోటీల్లో మెరిసిన షోబియా సమీన్

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ పరీక్షలో ఉర్దూ మీడియం విభాగానికి చెందిన ఉట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియా విద్యార్థిని షోబియా సమీన్ ద్వితీయ బహుమతి సాధించారు. విజేతకు ప్రశంసా పత్రంతోపాటు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు ప్రధానం చేశారు. తమ పాఠశాలకు ద్వితీయ ర్యాంకు రావడంతో ప్రధానోపాధ్యాయులు, మొహమ్మద్, మొహియుద్దీన్ తో పాటు ఉపాధ్యాయులు గులాం రసూల్, నయీమా, సల్మా బేగం అభినందనలు తెలిపారు.

## కృష్ణ పోలీసు స్టేషన్ పరిధిలో.. రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి

### ఎస్సై ఎస్ఎం నవీద్




**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా కృష్ణ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయా రహదారి 167 , జాతీయ రహదారి 150 ల పై గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం రోడ్డు ప్రమాదాలు గణరీయంగా తగ్గాయని కృష్ణ ఎస్సై ఎస్ఎం నవీద్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం, 2024 సంవత్సరంలో కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 24 రోడ్డు ప్రమాదాలు జరగగా, వాటి లో 16 మంది మృతి చెందగా, 17 మంది గాయపడ్డారు. అయితే ప్రస్తుత సంవత్సరం 2025 లో కేవలం 16 రోడ్డు ప్రమాదాలు మాత్రమే నమోదు కావడం జరిగిందని అందులో 8 మంది మృతి చెందగా, 11 మంది గాయపడ్డారని అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయల సంఖ్య గణనీయంగా తగ్గడం శుభ పరిణామమని కృష్ణ ఎస్సై పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి ప్రధాన కారణాలుగా ప్రజలకు విస్తృతంగా రోడ్డు భద్రత పై అవగాహణ కార్యక్రమాలు నిర్వహించడం , ఎన్‌హెచ్ ఎఐ అధికారులతో కలిసి ప్రమాదకర ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం, అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు కీలకంగా దోహదపడ్డాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గించే దిశగా పోలీస్ శాక నిరంతరం చర్యలు చేపడుతుందని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై కోరారు.

# ప్రణాళికాబద్ధంగా పట్టణ ప్రగతికి నిధులు

### సిసి రోడ్లు పనులను ప్రారంభించిన మంత్రి



**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రణాళికాబద్ధంగా పట్టణ ప్రగతికి నిధులు కేటాయిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. మక్తల్ పట్టణ కేంద్రంలో శ్రీరామ్ నగర్, రహమానియా కాలనీలో మీదుగా గుర్లపల్లి, వనాయకుంట గ్రామాలకు వెళ్లేరోడ్డు రూ. 3 కోట్ల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీ రెహమానియా కాలనీతో పాటు గుర్లపల్లి వనాయకుంట గ్రామాలకు వెళ్లే దారి అధ్వాన్న స్థితిలో గుంతలమైన రోడ్డు కోసం ఈ ప్రాంత ప్రజలు గత 15 ఏళ్లుగా ఇబ్బంది పడ్డారని, ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. గతంలో లక్ష రూపాయల పని మంజూరైతే 10 శాతం కమిషన్లు ఇస్తేనే పనులు ప్రారంభించే దుస్థితి ఉండేదన్నారు. ఈ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి చేస్తుంటే పనీపాట లేని వారు ఏమో ఆరోపణలు చేస్తూనే ఉంటారని, అలాంటి విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. స్థానికుడిగా ఈ ప్రాంత అభివృద్ధికి తాను కట్టిపడి ఉన్నానని, దయచేసి ఏ పార్టీకి చెందినవారైనా స్థానిక నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. అవసరమైతే అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అభివృద్ధి చేస్తుంటే కేసులు వేస్తున్న దుస్థితి ఉండటం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణా రెడ్డి, కట్టా సురేష్ కుమార్ గుప్తా, కోళ్ళ వెంకటేష్, బోయ రవికుమార్, మందుల నరేందర్, కావలి తాయప్ప, మేదరి శ్రీనివాసులు, బి. అమరేందర్ రెడ్డి, నూరోద్దీన్, బి. శంషొద్దిన్, హుసామొద్దీన్, సాదిక్, సాలంబిన్ ఉమర్ బస్రవి, రవూఫ్, రహీం పటేల్, రంజాన్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఏఈ నాగశివ తదితరులు పాల్గొన్నారు.



## సాలార్ నగర్ "భూ ఆధార్" సర్వే పైలట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలి

### అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సాలార్ నగర్ గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన భూ ఆధార్ సర్వే పైలట్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలోని ప్రతి భూ యజమానికి సంబంధించిన భూమి వివరాలను స్పష్టమైన సరిహద్దులతో పాటు ఖచ్చితమైన అకాంక్షలు, రేఖాంశాలతో గుర్తించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూ సర్వే పనుల పురోగతిని సమీక్షించిన ఆయన, సర్వే పనులను వేగవంతం చేయాలని, అమలు సమయంలో ఎదురయ్యే సమస్యలు లేదా అభ్యంతరాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఈ. నవీన్, అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్ సర్వే అశోక్, తహశీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని వ్యవసాయ అధికారుల పరిశీలన

**ప్రజాపక్షం/జడ్చర్ల :** రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం సంయుక్త సంచాలకులు, మహబూబ్‌నగర్ జిల్లా నోడల్ అధికారి బాలు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ బుధవారం జడ్చర్ల మండలం బాదేపల్లిలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం 2 ను తనిఖీ చేశారు. ఆగ్రో రైతు సేవ కేంద్రంలో యూరియా కొనుగోలు వివరాలను, యూరియా బుకింగ్ విధానంను రైతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కలిగించారు. రైతులతో మాట్లాడుతూ యూరియాను వృధా చేయొద్దు అని పంటలకు వేసేటప్పుడు మొక్క దగ్గర యూరియా వేసిన తర్వాత మట్టి కప్పినట్లు అయితే యూరియాను మొక్క బాగా తీసుకుంటుందని తెలిపారు. అలాగే రైతులకు అవసరంకి మించి యూరియా వాడకూడదు. అవసరం మేరకు కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 17610 మంది రైతులు నేటివరకు 52545 యూరియా బ్యాగ్స్‌ను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం జరిగిందని వివరించారు. అందులో 46193 బ్యాగ్స్ రైతులు కొనుగోలు చేయడం కూడా జరిగింది. ఇంకను 26220 యూరియా బస్తాలు యాప్‌లో కొనుగోలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కావున రైతులు యూరియా విషయంలో ఎటువంటి ఆందోళన చెందకుండా యూరియా బుకింగ్ యాప్ ద్వారా కొనుగోలు చేయవలసిందిగా సూచించడం జరిగింది.

## ఐకెపి కొనుగోలు కేంద్రంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### నిధుల స్వాహాపై పూర్తి విచారణ

### జిల్లా అడిషనల్ (రెవెన్యూ) కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల పరిధిలోని గోపాల్‌దిన్నె ఐకెపి వరి కొనుగోలు కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా డాటా ఎంట్రీ ఆపరేటర్ కొందరు రైతుల నుంచి వరి కొనుగోలు చేసి, మిల్లుకు తరలించి డబ్బులు స్వాహా చేసిన ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. బుధవారం గోపాల్ దిన్నె ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులకు సమాచారం ఇవ్వకుండా వరి కొనుగోలు చేసినట్లు, ఆ ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు, తద్వారా ప్రభుత్వ ఖజానా నుంచి రైతుల ఖాతాల్లోకి సుమారు 15 లక్షల రూపాయలు జమ అయినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఈ ఘటనపై డాటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్ పై కొనుగోలు కేంద్ర నిర్వాహకులు (మహిళా సంఘాల సభ్యులు) కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ వ్యవహారంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు ఇంకెవరి ప్రమేయం ఉందో కూడా సమగ్రంగా విచారణ జరిపి తగ్గిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక ఎస్సై కె.రాణికి ఫోన్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పోలీసుల విచారణలో అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. అదే విధంగా కొనుగోలు కేంద్రంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, రైతులకు ఇబ్బందులు కలగకుండా 17% తేమ ప్రమాణంతో వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రం నుంచి రెండు లారీల ధాన్యం బస్తాలను ప్రభుత్వం సూచించిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వరి విక్రయించిన వెంటనే డాటాలో ఎంట్రీలు క్రమం తప్పకుండా నమోదు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా మోసాలు జరిగినట్లు అనుమానం వచ్చిన వెంటనే ఐకెపి అధికారులు, తాసిల్దార్ లేదా సివిల్ సప్లై అధికారుల దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం బస్తాలు దించకుండా మిల్లు యజమానులు వేధించినట్లయితే వెంటనే సమాచారం ఇవ్వాలని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథం, తాసిల్దార్ వరలక్ష్మి, డీపీఎం ప్రభాకర్, మార్కెటింగ్ ఏపీఎం రాంబాబు గౌడ్, ఆర్ఐ కురుమూర్తి, ఏపీఎం మద్దిలేటి, సర్పంచు దొడ్డ కవిత, ఉపసర్పంచు వెంకటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రెడ్డి, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# పబ్లిక్ స్కూల్ పనులు వేగవంతం

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రూ.12.5కోట్ల నిధులతో 10 ఎకరాల విస్తీర్ణంలో మండలకేంద్రంలో రూ.25కోట్ల నిధులతో పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణం చేపడుతున్న నూతన భవనాల పనుల పారదర్శకంగా చేపడుతూ వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ బ్రహ్మచారి, సర్పంచులు పురుగుల యాదయ్య, అంకునారమ్మ, నోడల్ ఆఫీసర్ నర్సిరెడ్డి, ఏఈ కోటేశ్వరరావు, విద్యాకమిటి సభ్యులు పాల్గొన్నారు.




### జిల్లా ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు

**నాగర్‌కర్నూల్ :** ఆంగ్లనూతన సంవత్సరం 2026 సందర్భంగా జిల్లా ప్రజలందరికి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లాప్రజలు అన్నిరంగాల్లో మరింత పురోగతి సాధించి, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధివంటి ప్రతి విభాగంలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో , శాంతియుత వాతావరణంలో జీవించాలని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రభుత్వం జారీచేసిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ సంయమనంతో జరుపుకోవాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులకు, అధికారులకు, జిల్లాప్రజలందరికి మరోసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ 2026 సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

## అదృశ్యమై.. బావిలో శవమైన మహిళ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మూడు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన మహిళా శవమై బావిలో తేలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. స్థానిక ఎస్ఐ కె.రాణి కథన ప్రకారం మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కొమ్ము పార్వతి (40) గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తుండగా భర్త కొమ్ము పరమేష్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం తెల్లవారు జాము నుంచి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన కొమ్ము పార్వతి ఎంత వెతికినా కనపడకపోవడంతో అదే రోజు సాయంకాలం పోలీస్ స్టేషన్లో భర్త పరమేష్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బుధవారం ఉదయం గ్రామానికి సమీపంలో రంగవరం రోడ్డులోని గాలెమ్మ బావిలో కొమ్ము పార్వతి శవంమై తేలియాడుతూ కనిపించడంతో గ్రామస్తులు గుర్తించి సమాచారం అందించారని తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై కే రాణి తెలిపారు. ఘటనకు సంబంధించిన మృతురాలి కుటుంబ సభ్యులను విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి కుమారుడు ఇద్దరు కూతురు ఉన్నారు.

## నట్టల నివారణ మందు పంపిణీ

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూర్ మండల కేంద్రంలో బుధవారం రోజు పశు వైద్యాధికారి నరేందర్ ఆధ్వర్యంలో మేకలకు నట్టల నివారణ మందు స్థానిక సర్పంచ్ దండు జనార్దనమ్మ వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతులు విధిగా తమకు చెందిన పశువులకు నట్టల నివారణ మందుకు వేయించాలని సూచించారు. పశువుల్లో నట్టల వల్ల శారీరక బలహీనతతో పాటు ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పశువుల్లో అనారోగ్యాలకు నట్టలు కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దింటి రాజు, వార్డు సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన

**ప్రజాపక్షం/కోట్‌పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని స్థానిక జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో కళాజాత బృందం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ శైలజ హజరై మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానంతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుండే చట్టలపై అవగాహన కలిగి ఉండాలని ,క్రమశిక్షణతో కూడిన చదవు ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు.

ప్రస్తుత కాలంలో యువత ,విద్యార్థులు సామాజిక మాధ్యమాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ,సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అమ్మాయిలు పట్టుదలతో చదువు కొవాలని ,మహిళల ,విద్యార్థుల రక్షణకోసం షీటీం ఉందని ,అత్యవసర సమయంలో 100కు పోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాద్యాయులు,ఉపాద్యాయులు ,విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు




## అంటరానితనం చట్టప్రకారం నేరం

**ప్రజాపక్షం/చిన్నంబావి :** మండల పరిధిలోని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు స్వగ్రామం పెద్దదగడ గ్రామంలో బుధవారం ఉదయం గ్రామ పంచాయతీ ఆవరణలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మండల, రెవెన్యూ గిర్దావరి రాములు మాట్లాడుతూ మీ గ్రామంలో ఇప్పటికీ ఎవరైనా అంటరానితనం పాటించినా, హోటళ్లలో రెండు గ్లాసులు పద్ధతి విధించినా కులం పేరుతో దూషించినా, దేవాలయ ప్రవేశం నిషేధించినా అట్టి వాళ్ల పేర్లు ముందుకు వచ్చి చెప్తే, వాళ్ల మీద పోలీసుల సహకారంతో చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొప్పునూరు, ఎస్సీ బాలుర ఇంచార్జి వసతి గృహ అధికారి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ నిజానికి పౌరహక్కుల దినోత్సవం ప్రారంభం నుంచి ఈనాటి వరకు ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్దేశించిన ఏదో ఒక గ్రామంలో పాల్గొంటూనే ఉన్నాను. అయితే, ఏ ఒక్క గ్రామంలో కూడా మా గ్రామంలో అంటరానితనం ఫలానా వ్యక్తులు పాటిస్తున్నారనేది ఎక్కడ కూడా వినలేదు. దీనికంతటికి ప్రధాన కారణం ప్రజలలో వచ్చిన చైతన్యం.

## పదవికి న్యాయం చేస్తా

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అమ్రాబాద్ గ్రామానికి న్యాయంచేసి అభివృద్ధి చేసి గ్రామంపేరు నిలబెడతానని అమ్రాబాద్ ఉపసర్పంచ్ రాజారాంగౌడ్ అన్నారు. అమ్రాబాద్ మండలకేంద్రంలో బుధవారం పౌరసన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను గౌరవించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పేరుపేరునా ప్రజలను అభినందించారు. కార్యక్రమంలో దేవస్థాన భూపరిరక్షణ అధ్యక్షుడు శ్రీకాంత్, మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు హరి నారాయణగౌడ్ , అచ్చంపేట మార్కెట్‌వైస్‌చైర్మన్ వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు రేణయ్య పాల్గొన్నారు.

# క్రీడ

## కివీస్‌తో వన్డేలకు శ్రేయాస్ డౌటే



స్టార్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గ్రౌండ్‌లో అడుగుపెట్టడం మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను గాయపడ్డ విషయం తెలిసిందే. క్యాచ్ అందుకోబోయి కింద పడ్డ అయ్యర్‌కు .. కడుపులో మోచేయి వత్తేసింది. దీంతో అతని ప్లీహం(స్ప్లీన్) దెబ్బతిన్నది. దాని నుంచి రక్తస్రావం జరిగింది. అయితే ప్రమాదం నుంచి ఇంకా కోలుకుంటున్న శ్రేయాస్ అయ్యర్.. న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ ఓ నివేదిక ప్రకారం మాత్రం ప్రమాదం తర్వాత అయ్యర్ సుమారు ఆరు కిలోల బరువు తగ్గినట్లు తెలుస్తోంది. అతని మాంస కణజాలం తగ్గడం వల్ల బరువు చాలా వేగంగా కోల్పోయినట్లు డాక్టర్లు చెబుతున్నారు. విజయ్ హాజారే ట్రోఫీలో శ్రేయాస్ అయ్యర్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఓ మీడియా కథనాన్ని రాసింది. జనవరి 3, 6వ తేదీల్లో జరిగే మ్యాచుల్లో అతను ఆడుతాడని డౌట్ వ్యక్తం చేసింది. దీంతో కివీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు అయ్యర్ అందుబాటులో ఉంటాడని కూడా ఊహాగానాలు వినిపించాయి. అయితే శ్రేయార్ అయ్యర్ 50 ఓవర్ల మ్యాచ్ ఆడగలడా లేదా అన్నది సందేహంగా ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కడుపు సర్జరీ కావడం వల్ల అతను ఫిజికల్‌గా గ్రౌండ్‌లో గడపడం ఎంత వరకు వీలు అవుతుందో తెలియదన్నారు. కానీ శ్రేయాస్ మాత్రం స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నది. 50 ఓవర్లకు తగినట్లు అతను ఫీల్డింగ్ చేయగలిగితే అప్పుడు విజయ్ హాజారేలో ఆడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

## కోమాలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్

ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్.. కోమాలోకి వెళ్లారు. 54 ఏళ్ల వయసున్న ఆ మాజీ బ్యాటర్.. బాక్సింగ్ డే రోజున కోమాలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న అతను క్వీన్స్‌ల్యాండ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ అయిన డామియన్



మార్టిన్ ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున 67 టెస్టులు, 208 వన్డేలు ఆడాడు. ప్రస్తుతం డేమియన్ మార్టిన్‌కు ఇండ్యూస్డ్ కోమా పద్ధతిలో చికిత్స అందిస్తున్నారు. ఆసీస్ మాజీ క్రికెటర్లు సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు. మార్టిన్‌కు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని, ఫ్యామిలీ ధైర్యంగా ఉండాలని ఆడమ్ గిల్‌క్రిస్ట్ తెలిపారు.

1992 నుంచి 2006 మధ్య కాలంలో ఆస్ట్రేలియా తరపున డామియన్ మార్టిన్ 67 టెస్టులు ఆడాడు.2000 సంవత్సరంలో ఆరేళ్ల గ్యాప్ తర్వాత అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. స్టీవ్ వా నేతృత్వంలోని ఆసీస్ జట్టులో అతను కీలక బ్యాటర్‌గా కొనసాగాడు. 2006 యాషెస్ సిరీస్ మధ్యలో అతను అకస్మాత్తుగా రిటైర్ అయ్యాడు. టెస్టుల్లో అతను 46 సగటుతో 4406 పరుగులు చేశాడు. దీంట్లో 13 సెంచరీలు ఉన్నాయి. 2003లో ఆస్ట్రేలియా వన్డే వరల్డ్‌కప్ గెలిచింది. ఆ జట్టులో మార్టిన్ ఉన్నాడు. ఇండియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మార్టిన్ 88 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. రికీ పాంటింగ్‌తో కలిసి 234 రన్స్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వన్డేల్లో డామియన్ మార్టిన్ 40 సగటుతో 5346 రన్స్ చేశాడు. దీంట్లో అయిదు సెంచరీలు ఉన్నాయి.

## విజయ్ హాజారే ట్రోఫీ.. మళ్లీ ఓడిన ఆంధ్ర, హైదరాబాద్

విజయ్ హాజారే ట్రోఫీలో భాగంగా సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 74 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. ఆంధ్రకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది మూడో ఓటమి. తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఆంధ్ర 47.2 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌటైంది. ఒక్క బ్యాటర్ కూడా కనీసం అర్ధ శతకం చేయలేదు. ఓపెనర్ సిఆర్ జ్ఞానేశ్వర్ (33) టాప్ స్కోరర్. కేఎస్ నరసింహ రాజు (30), నితీశ్ కుమార్ రెడ్డి (30), హేమంత్ రెడ్డి (29), జాగర్లపూడి రామ్ (20*) పరుగులు చేశారు. శ్రీకర్ భరత్ (4), రికీ భుయ్ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వార్ (5/27) సత్తాచాటాడు. చిరాగ్ జైన్, హితేన్ కాన్బి, పార్త్ భుట్, సమర్ గజ్జర్ ఒక్కో వికెట్ తీశారు.
విశ్వరాజ్ జడేజా (3), హెత్విక్ కోటక్ (7), ప్రేరక్ మన్కడ (13), సమర్ గజ్జర్ (0) వరుసగా పెవిలియ

న్‌కు చేరదంతో సౌరాష్ట్ర తొలుత తక్కువ స్కోరుకే ఆలౌటయ్యేలా కనిపించింది. 62 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఓపెనర్ హార్విక్ దేశాయ్ (61).. ఆరు, ఏడు స్థానాల్లో వచ్చిన చిరాగ్ జైన్ (69), రుచిత్ అహిర్ (76; 54 బంతుల్లో) ఆదుకున్నారు.ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు 3, కేఎస్ నరసింహ రాజు 2, నితీశ్ రెడ్డి, జాగర్లపూడి రామ్ చెరో వికెట్ పడగొట్టారు.

### హైదరాబాద్‌కు వరుసగా నాలుగో ఓటమి

విజయ్ హాజారే ట్రోఫీలో భాగంగా హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో బరోడా 37 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బరోడా 4 వికెట్ల నష్టానికి 417 పరుగులు చేసింది. టాప్3 బ్యాటర్లు నిత్య పాండ్య (122), అమిత్ పాసి (127), కృనాల్ పాండ్య (109; 63 బంతుల్లో) శతకాల మోత మోగించారు. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.5 ఓవర్లలో 380 పరుగులకు ఆలౌటైంది. అభిరత్ రెడ్డి (130), ప్రగ్యాన్ రెడ్డి (113) శతకాలు చేశారు. ఓపెనర్లు అమన్ రావు పేరాల (39), తన్మయ్ అగర్వాల్ (32) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు.




చరిత్రపై 2025లో అధ్యయనాలు... పరిశోధనలు పెరిగాయి. కొన్ని కీలక అంశాలను కనుగొన్నారు కూడా. ఇవి మన పురాతన సాంస్కృతిక, జీవన విధానాలపై కొత్త అవగాహన ఇస్తున్నాయి.



## పెరిగిన అధ్యయనాలు..

ఇంగ్లాండ్‌లో 400,000 సంవత్సరాల క్రితమే నిప్పును వినియోగించారని నిరూపించే సాక్ష్యాన్ని కనుగొన్నారు, ఇది ప్రాథమిక మనవుల నైపుణ్యాలను చాటుతుంది. స్పెయిన్‌లో 20,000 సంవత్సరాల పూర్వపు తిమింగల ఎముకల పనిముట్లు, బెలీజ్‌లో మాయా రాజవంశానికి చెందిన ఒక సమాధి, ఈజిప్టులో 18వ రాజవంశపు ఫారోహ్ చివరి సమాధిని గుర్తించారు. అక్కడి పరిశోధించి తెలుసుకున్న కొత్త విషయాలు, పురాతన మానవ డిఎన్ఎ, పాత మైగ్రేషన్ సిద్ధాంతాలను సవాలు చేస్తోంది. అలాగే, ప్రారంభ మానవులు 8,500 సంవత్సరాల క్రితం మాల్టాకు నావ ద్వారా ప్రయాణించారని, పోంపేయ్‌లో వీసువియస్ అగ్నిపర్వత విస్ఫోటనం తర్వాత మానవ మస్తిష్కం కంచు వంటి స్థితిలో నిలిచినట్టు కనుగొన్నారు. జన్యు (జెనెటిక్) పరిశోధనలు 'సల్యూట్రియన్ హైపోథీసిస్'ను విరోధిస్తూ మొదటి అమెరికన్లు ఆసియా వంశస్థులే అని నిర్ధారించాయి.

అలాగే, ప్రాచీన ఈజిప్/వ్నఎ విశ్లేషణలు మల్టీ స్ట్రాటిజిక్ పూర్వీకుల సంబంధాలను సూచిస్తూ పాత వర్ణ ఆధారిత అభిప్రాయాలను సవాలు చేశాయి.



- ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి జరిగిన ముఖ్యమైన ఆవిష్కరణల్లో ఒకటి టర్కీలోని అనేక ప్రాచీన నగరాల ఖనిజ పరిశోధనలలో వెలుగులో పెల్లి ప్రాచుర్యం పొందిన దేహాన్ని చూపిస్తుంది. ఈ శాఖలో నీఓలిథిక్ స్థలాల్లోని విగ్రహాలు, రోమన్, బైజాంటైన్, మధ్యయుగస్థాయి గుర్తుల వరకు విస్తరించిన అవశేషాలు కనబడ్డాయి. ఇవి అక్కడి పురాతన జీవన విధానాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల మీద కొత్త సమాచారం ఇస్తున్నాయి.
- ఇజిప్టులో సక్కారా ప్రాంతంలో చాలా ప్రాచీనమైన శతాబ్దాలకు చెందిన సమాధిని కనుగొన్నారు. ఇది ఐజిప్టియన్ ఐతిహాసిక నిర్మాణాలు, రాజకుటుంబ సంబంధిత జీవన శైలి గురించి కొత్త సమాచారాన్ని అందిస్తున్నది.
- అల్బానియాలో కూడా క్రీస్తుశకం 3 లేదా 4వ శతాబ్దం నాటి ఒక భవన రోమన్ సమాధి ప్రత్యక్షమైంది, దీని ఉన్న విలక్షణ ద్విభాషా శిలాలిపి (గ్రీక్.. లాటిన్) మనకు ఆ కాలపు సంస్కృతుల పరస్పర సంబంధం గురించి విలువైన ఆరాధన సూచనలును అందిస్తుంది.
- స్కాట్లాండులో 3,300 సంవత్సరాల పూర్వం జరిగిన ఒక సంకల్ప ఘటనలో మరణించిన వ్యక్తుల కాలుష్య అవశేషాలను గుర్తించారు. ఇవి ఆ ప్రాకృతిక ఘటన లేదా వ్యక్తిగత సంఘటనపై పరిశోధనలకు దారితీస్తున్నాయి.
- లండన్‌లోనూ టీంకాలపు సమాధి అవశేషాలు వృద్ధి పొందడం చూసి, 1348లో ప్రసిద్ధ బ్లాక్ డిత్ సమయానికి సంబంధించిన మృతదేహాలు, ఇతర పునరుద్ధి సంగ్రహం పురాతన బ్రిటన్‌లోని సామాజిక, ఆరోగ్య పరిస్థితులపై కొత్త సూచనలు ఇస్తున్నాయి.
- కొంత మందికి బైబిలియన్ కథలతో సంబంధం ఉన్నట్లుగా భావించే అరారాట్ పర్వతం పక్కన ఉన్న ప్రాంతంలో నోయా యొక్క నౌక కథతో జత కలిగిన చెరమెంటరీ వస్తువులు కనబడటమూ, పరిశోధకులకు ఆ ప్రాంతంలో మానవ వసతి ఉండేదన్న అభిప్రాయానికి తావిస్తున్నది.
- పురావస్తు శాస్త్రం కూడా ఈ ఏడాది నూతన సాంకేతికతలను అపనమించి అభివృద్ధి చెందింది. డీప్‌లర్నింగ్, ఉపగ్రహ ఛాయాచిత్రాల విశ్లేషణ వంటి ఆధునిక ఉపకరణాలు వినియోగించి పూర్వ కాలపు లేదా మృగాల స్థలాలను కనుగొనడంలో సాయం చేశారు, ఇవి అధ్యయనాలు, పరిశోధనలు చేసేవారికి ఒక పెద్ద శాస్త్రపునర్విమర్శను అందిస్తున్నాయి.

ప్రపంచంలోని ఇతర ప్రాముఖ్యత కలిగిన చారిత్రక శిథిలాలు అనేకం బయటపడ్డాయి. బోల్వియాలో టోరోటోరో నేషనల్ పార్క్‌లో 16,600 డైనోసార్ కాళ్ల ముద్రలు, 1,378 ఈత ట్రాక్లు కనిపించాయి. స్కాట్లాండ్‌లో 6,000 సంవత్సరాల క్రితమైన నియోలిథిక్ హాల్ బయటపడింది. ఇది స్టోన్‌హెంజ్ కన్నా పూర్వకాలానికి చెందినది. పుస్తకాలు, చారిత్రక విశ్లేషణలలో కూడా కొత్త అధ్యయనాలు జరిగాయి. హార్లెమ్ పునరుజ్జీవన సమయం నాటి 'ఎ లెలియా వాకర్' గురించి 'ఎ లెలియా బండిల్స్' పుస్తకం, మహిళా డిటెక్టివ్స్, ప్రజా రవాణా చారిత్రక ప్రాముఖ్యతపై అధ్యయనాలు, సాంఘిక, సాంస్కృతిక భావాలను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతున్నాయి. ఈ ఏడాది జరిపిన కొన్ని చారిత్రక పరిశోధనల్లో కొన్ని సైన్స్ రహస్యాలకు పరిష్కారం లభించింది. ఆస్ట్రియాలో 18వ శతాబ్దపు ఓ చర్చ్ మాన్ ఎయిర్ డ్రైడ్ చాప్లెన్‌గా ఉన్న వ్యక్తి శవం ఇప్పటికీ పాడు కాకుండా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అంతేకాదు, ఆ మమ్మీపై జరుపుతున్న అధ్యయనాల్లో, నాటి జీవన పరిస్థితులు... సంప్రదాయ 'మమ్మీఫికేషన్' గురించిన కొన్ని ప్రశ్నలకు సమాధానం రాబడుతున్నాయి. మొత్తం మీద ఈ ఏడాది జరిగిన చారైత్రక, జన్యు పరిశోధనలు ప్రాచీన మానవ జీవితాన్ని, అన్వేషణలను, మసాంస్కృతిక అభివృద్ధిని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఒక గొప్ప దశగా నిలిచాయి. ఇవి భవిష్యత్తులో మనకి మన పురాతన వారసత్వం, అన్వేషణ పద్ధతులు, మరియు సాంస్కృతిక అవగాహనపై మరింత లోతైన అవగాహన ఇవ్వగలవని సూచిస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా పురావస్తు పరిశోధనల, చారిత్రక పునఃవిమర్శలతో కూడిన అత్యంత ప్రభావితమైన సంవత్సరంగా నిలిచింది. ప్రాచీన నాగరికతలపై శర్షించింది అని తెలియజేసే నూతన కనుగొన్న అంశాలు.. వివరాలు వెలుగులోకి వచ్చాయి, ఇవి మన మనుష్యుల ప్రాచీన జీవన శైలి, ఆచారాలు, సమాజ నిర్మాణం పై అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నాయి. ఈ ఏడాది వెలిగిన కనుగొన్న అనేక విషయాలు కేవలం గతం గురించి, అదే విధంగా ఇప్పటి మనకు తెలిసిన మార్పులు, ధోరణుల గురించి మాత్రమే తెలియచేయడం లేదు. మన భవిష్యత్తు తరాల కోసం పూర్వీకుల జీవన శైలులు, సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై మరింత సమగ్రమైన అవగాహనను ఇవ్వగలదు. ఈ అన్వేషణలు ఇంకా కొనసాగుతుండగా, మన పురాతన వారసత్వం మరింత లోతుగా వెలుగులోకి వస్తుందని ఆశించవచ్చు.

## గ్రామగ్రామాన సిపిఐ సభ్యత్వ నమోదు

మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. బుధవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదగిరిరావు హాజరై మాట్లాడారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభకు పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. 2026 సంవత్సరానికి సంబంధించి సిపిఐ నూతన సభ్యత్వ నమోదును గ్రామగ్రామాన నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులుగా గెలిచిన ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో శాలువాలతో ఉజ్జిని యాదగిరిరావు ఘన సన్మానం చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పాండురంగారావు, సహాయ కార్యదర్శి మండల కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరాచారి, జోగు శ్రీరాములు, కొడిదాల వెంకటయ్య, వేముల బుచ్చయ్య, పల్లపు లక్ష్మయ్య, షేక్ శంశోద్దీన్, బాదం మల్లేష్, కంబాలపల్లి లక్ష్మయ్య, ముస్కు వెంకటయ్య, వెంకటయ్య, మల్గం నరసింహ, ఇద్ది రాములు, వింజమూరి నరసింహ, నల్లగాసు నరసింహ, ముదిగొండ లక్ష్మయ్య, యాచారం శ్రీశైలం , కానూరు వీరయ్య, కుర్మేటి రాములు, జల్లెల వెంకటయ్య, గోడేటి నరసింహ, గ్యార పరశురాములు, కోడిదూటి సైదులు, మాధగోని యాదయ్య, పోలే లాలయ్య, గుణమోని రాములు పాల్గొన్నారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

ఎస్‌టియుటిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్



**ప్రజాపక్షం /నస్పూర్:** విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియుటిఎస్) 2026 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని, పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఒడిగె కృష్ణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ చీపెల్లి బాపు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పద్మ, మహాలక్ష్మి, మన్మోహన్, శ్రీరామ్, ఫైనాన్స్ సెక్రటరీ సుమన్, మంచిర్యాల మండల అధ్యక్షులు మల్లేష్, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోడ సుదర్శన్ జీవితం ఆదర్శణీయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/వలిగొండ :** నిరంతరం ప్రజా ఉద్యమాలే ఊపిరిగా విద్యార్థి దశ నుంచి పోరాటం నిర్వహించిన బోడ సుదర్శన్ మరణం పార్టీకి మరియు ప్రజా ఉద్యమాలకు తీరని లోటని, ఆయన జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువన గిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో బోడ సుదర్శన్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందు గా సుదర్శన్ చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లింకటి సత్యం, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మరియు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, సుదర్శన్ కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ సుదర్శన్ పార్టీకి అంకితభావంతో సేవలందించారన్నారు.పార్టీ నిర్మాణం, ప్రజాసమస్యలపై పోరాటాలు, కార్మిక రైతు ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జీవితం పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థి సంఘం నాయకుడి గా, మూడు సార్లు వలిగొండ మండల పార్టీ కార్యదర్శి గా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, చేనేత సంఘానికి అనేక సేవలు అందించాలని కూనంనేని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. బోడ సుదర్శన్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారి కుటుంబానికి రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ అండగా ఉంటుందని కూనంనేని తెలిపారు. ఆయన మృతికి సంతాపం మరియు వారి కుటుంబానికి ప్రగడ సానుభూతిని తెలియజేశారు. సంస్మరణ సభ కార్యక్రమంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు, బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కళ్లెం కృష్ణ, ఎండి ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్ చిగుళ్ల లింగం, చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి జిల్లా కమిటీ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, పోలేపక యాదయ్య, పులిపలుపుల మల్లేశం, బాలగోని సత్యనారాయణ, బొడిగె సుదర్శన్, దుప్పెల్లి సర్పంచ్ ఎండి జావీద్, కట్ల యాదగిరి, సుద్దాల సాయి కుమార్, బోషానబోయిన బొందయ్య, డిసిసి ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, అడ్వకేట్ ఉయ్యాల హన్మాత్ గౌడ్, బోడ సుదర్శన్ భార్య సునీత కూతుర్లు నీలిమ, నిఖిత కుటుంబ సభ్యులు తండ్రి యాదగిరి, అన్న అంజయ్య, తమ్ముడు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## బస్‌డిపో, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని సిపిఐ నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** హెచ్ఎంటి ఖాళీస్థలంలో బస్‌డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. కాగా బుధవారం జరిగిన దీక్షకు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, మాజీ కౌన్సిలర్ చంద్రమ్మ, మహిళా సమైక్య మండల నాయకురాలు సత్యవతి, భాగ్యలక్ష్మి , పద్మ, సోమేశ్వరి, దీపిక, సుజాత, పార్వతమ్మ, అమృతమ్మ, దీప, ఉమా, సంధ్య, సుజాత, సౌమశ్రీలు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ రెండు రోజులుగా నిర్వహిస్తున్న నిరాహార దీక్షలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. దీనికి నిదర్శనమే పలువురు మహిళలు దీక్షలో కూర్చోవడం మంచి పరిణామం అని అన్నారు. ప్రజలందరూ ఏకమై బస్‌డిపో, ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించేంత వరకు పోరాటం చేస్తే ఖచ్చితంగా జగద్గిరిగుట్టలో బస్ డిపో, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేసుకోవచ్చని అయన అన్నారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉన్నందున ప్రతిఒక్కరూ సిపిఐ నిర్వహించే పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు వి.హరినాథ్‌రావు, రాములు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నరసయ్య, సిపిఐ నాయకులు యాదయ్య, ఇమామ్, నారాయణ, బాబు, యువజన నాయకులు కీర్తి, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలను అణచివేసే కుట్ర

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** యాబై సంవత్సరాలుగా దేశంలో జరిగిన ప్రజా ఉద్యమాలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా రాష్ట్రాల డిజిపిలకు ఆదేశించడం ప్రజా ఉద్యమాల అణచివేతకు సమగ్ర కార్యాచరణ రూపొందించడంలో భాగమేనని స్పష్టమవుతుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక వీర భవన్‌లో చింతకుంట్ల వెంకన్న అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రజా ఉద్యమాలపై అణచివేత చర్యలు తక్షణమే ఆపేయాలని డిమాండ్ చేశారు. దేశభక్తి ముసుగులో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతుందని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బిజెపి ప్రభుత్వం చర్యలను ప్రతీ ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగిపోయారని, ప్రధాని మోదీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తులపైనే ఉండటంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. జనవరి 18న సిపిఐ శతవార్షికోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఖమ్మంలో జరిగే భారీబహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జాతీయ ప్రజాతంత్ర విప్లవం లక్ష్యంగా, సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అనేక త్యాగాలు చేసిందని, ఎంతో మంది అమరవీరులను అందించిన చరిత్ర సిపిఐదన్నారు. దున్నే వాడికి భూమి దక్కాలని, భూమిలేని నిరుపేదలకు భూమి పంచాలని పోరాడి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాన్ని చేపట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. దేశంలో వామపక్ష పార్టీల ఐక్యతా పోరాటాలను ఉధృతం చేస్తూ లౌకిక ప్రజాస్వామిక శక్తులను ఏకం చేస్తూ ప్రజాస్వామ్య పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్, నల్లు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, తండా సందీప్, చొప్పరి శేఖర్, బందు మహేందర్, సారిక శ్రీనివాస్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఎండి.ఫాతిమా, మేక వీరన్న, బానోతు లింగ్యానాయక్, కొమ్ము నారాయణ, జలగం ప్రవీణ్ ,ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, చిదిరాల జ్ఞానేశ్వర్, తోట రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పసరి పాటించాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని వైదేహి నగర్ కాలనీలో 83 లక్షల వ్యయంలో చేపట్టిన నూతన సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేసి కాలనీ ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను సూచించారు. అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ వాసుల సహకారం ఉండాలని అకాంక్షించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఇ మల్లికార్జున్ గౌడ్, కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, పార్టీ నాయకులు సంజీవ నాయక్, సూపర్వైజర్లు శ్రీకాంత్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా యూరియా పంపిణీ

### అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో యూరియా పంపిణీ సజావుగా నిర్వహించడానికి తీసుకోవాలసిన చర్యలపై అడిషనల్ కలెక్టర్ కె.చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు డివిజనల్ అధికారులుతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లాకు నోడల్ ఆఫీసర్‌గా నియమించబడిన ఆశాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా కోపరేటివ్ అధికారి, డిఎం మార్క్‌ఫెడ్‌లు పాల్గొన్నారు. యూరియా సరఫరా తగినంతగా, నిరంతరంగా ఉన్నందున రైతులు ఆందోళన చెందకూడదని అడిషనల్ కలెక్టర్ సూచించారు. భూమి విస్తీర్ణం, పండించిన పంట ఆధారంగా యూరియా పంపిణీ చేస్తారని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర సభ్యుడు బుద్దుల జంగయ్య

**ప్రజాపక్షం/కొందుర్గు:** దేశ స్వాతంత్ర్యం నుండి మొదలుకొని నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఎన్నో పోరాటాలు చేసిందని, పేదలకు అనునిత్యం అండగా నిలిచిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సిపిఐ జెండాను మండల కార్యదర్శి భాగాల్ల నరసింహా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ జనవరి 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జి.యాదయ్య, ఎం.బాలకృష్ణయ్య, జంగయ్య, రఫీ, రామచంద్రి, మల్లయ్య, బి.యాదయ్య పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కారం చేస్తా

### వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** శ్రీ వెంకట రమణ కాలనీ సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని శ్రీ వెంకట రమణ కాలనీలో రోడ్డుపై నీరు నిలిచిపోవడం కారణంగా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుకుంటున్న సమస్యను కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, వాటర్ వర్క్స్ ఎఇ కుమారి భావ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో డిప్యూటీ కమిషనరేట్

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజలకు పటిష్టమైన శాంతి భద్రతలు కల్పించేందుకే డిప్యూటీ కమిషనరేట్‌ను స్థానికంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు మండలాల పోలీస్ స్టేషన్లతో డిప్యూటి కమిషనరేట్‌నే ఏర్పాటు చేయడమే కాకుండా పటిష్టమైన రక్షణ వలయంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. పూర్వం మాధిరిగానే షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండే విధంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకోవడంపై మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, సర్పంచులు అఖిల్, భాస్కర్ గౌడ్, సీనియర్ నేత శ్రీధర్‌రెడ్డిలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## పేదింటి మహిళలకు ఆర్థిక భరోసా



**ప్రజాపక్షం/కేశంపేట/కొందుర్గు:** పేదింటి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కేశంపేట, కొందుర్గు మండలాలకు చెందిన 83చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధరఖాస్తులు చేసుకున్న ప్రతి లబ్దిదారుడిని ప్రభుత్వ పథకాలను అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, మాజీ జడ్పిటిసి సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వీరేశం, కృష్ణారెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, బస్వం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయం




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు చిన్నతనం నుండే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముంతాజ్ పంక్షన్ హాల్‌లో కాకతీయ టాలెంట్ స్కూల్ అనివల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన పలు సంస్కృతికి కార్యక్రమాలను చూసి అభినంధించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి, ప్రభాకర్, రంగనాథ్, గంగనమోని సత్తయ్య, శ్రీనివాస్ గౌడ్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురోగతిలో టౌన్‌ప్లానింగ్

- భవన నిర్మాణ అనుమతుల మంజూరుతో..
- ఈ ఏడాది రూ.1272.36 కోట్ల ఆదాయం
- రోడ్డు విస్తరణ, జంక్షన్ అభివృద్ధి పనులు
- నగరాభివృద్ధిలో టౌన్‌ప్లానింగ్ కీలక పాత్ర
- జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా టౌన్ ప్లానింగ్ విభాగం 2025 సంవత్సరంలో గణనీయమైన విజయాలను సాధించిందని మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం టౌన్‌ప్లానింగ్ ద్వారా జరిగిన పురోగతిని వివవరించారు. 2025 మార్చి నెలలో 'బిల్డ్' అనే కొత్త బిల్డింగ్ అనుమతుల అప్లికేషన్‌ను జిహెచ్‌ఎంసి ప్రవేశపెట్టామన్నారు. పూర్తిగా ఆన్‌లైన్, ఏఐ ఆధారితంగా రూపొందించిన ఈ వ్యవస్థ ద్వారా అనుమతుల ప్రక్రియ మరింత వేగవంతమైందని తెలిపారు. 2025లో మొత్తం 11,166 బిల్డింగ్ అనుమతులు మంజూరయ్యాయన్నారు. ఈఏడాది రూ.1272.36 కోట్ల ఆదాయం లభించిందని వెల్లడించారు. 103 హైరైజ్ భవనాలకు అనుమతులు ఇవ్వగా, 2024లో ఇవి 69 ఇచ్చినట్లు చెప్పారు. ఆదాయం కూడా 2024 లోని రూ.1114.24 కోట్లతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రహదారి విస్తరణ, జంక్షన్ అభివృద్ధి, బిల్డింగ్ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడంలో కీలక ముందడుగులు వేశామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జంక్షన్ అభివృద్ధి, ఫ్లైఓవర్లు, ఆర్‌ఓబి, ఆర్‌యూబి నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ విభాగం భూమి సేకరణను వేగవంతం చేసినట్లు చెప్పారు. హెచ్‌సిటీ, ఎస్‌ఆర్‌డిపి పథకాల కింద ఈ పనులు కొనసాగుతున్నాయన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం చేపట్టిన ఈ చర్యలు హైదరాబాద్ నగరాన్ని మరింత సుసంపన్నంగా, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించి, నగరంగా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు చేపట్టిందన్నారు.

### కొత్త ఉస్మానియా ఆస్పత్రికి రోడ్డు విస్తరణ..

గోషామహల్‌లో కొత్త ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నిర్మాణానికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్లు, లింక్ రోడ్ల అభివృద్ధిని ప్రాధాన్యంగా చేపట్టారు. ఇందుకు అవసరమైన రోడ్డు అభివృద్ధి ప్రతిపాదనలు (ఆర్‌డిపి)లు ఇప్పటికే ఆమోదం పొందగా, భూసేకరణ ప్రతిపాదనలు దాఖలయ్యాయి. 2024 సంవత్సరానికి గాను ప్రధాన రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రభుత్వం రూ.200 కోట్లను మంజూరు చేసింది. దబీర్‌పురా పోలీస్ స్టేషన్ నాగబౌలి మధ్య 89 ఆస్తుల్లో 48 సేకరించారు. శాస్త్రిపురం జంక్షన్ ఫలక్‌నుమా బస్ డిపో మార్గంలో 349 ఆస్తులకు గానూ 55 ఆస్తులను సేకరించారు. షేక్ ఫైజ్ కమాన్ దబీర్‌పురా ఫ్లైఓవర్, బడా బజార్ భవాని నగర్ రోడ్ల విస్తరణ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. జంక్షన్ల అభివృద్ధి నగరవ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు 90జంక్షన్లను గుర్తించారు.

### 90 జంక్షన్ల అభివృద్ధి

నగరవ్యాప్తంగా 90జంక్షన్ల అభివృద్ధిని గుర్తించగా, వాటిలో 74జంక్షన్లకు ఇప్పటికే ప్లాన్లు ఆమోదం పొందాయి. మిగిలిన 16 జంక్షన్లు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం భూసేకరణ వ్యయం సుమారు రూ.233 కోట్లుగా అంచనా వేశారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో 29 జంక్షన్లు (రూ. 68 కోట్లు), సైబరాబాద్ కమిషనరేట్‌లో 25 జంక్షన్లు (రూ.79కోట్లు), రాచకొండ కమిషనరేట్‌లో 36 జంక్షన్లు (రూ.86 కోట్లు) అని కమిషనర్ కర్ణన్ వివరించారు.

## ప్రతి ఇల్లు లైబ్రరీగా మారాలి

### సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పిల్లలు చిన్నప్పటి నుంచే పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలని, ప్రతి ఇల్లు లైబ్రరీగా మారాలని మాజీ సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి. లక్ష్మీ నారాయణ సూచించారు. గీతాంజలి ఒలింపియాడ్ హైస్కూల్ వివి నగర్ బ్రాంచి 22వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా లక్ష్మీ నారాయణ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ పుట్టి శ్రీనివాసరావు, స్కూల్ డైరెక్టర్, స్కూల్ ప్రిన్సిపల్ ఉమా వెంకట్ పసుపులేటి పాల్గొన్నారు.

## నూతన విద్యా విధానంలో టి-సాట్ భాగస్వామ్యం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరిన సిఇఒ వేణుగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న 'నూతన విద్యా విధానం'లో టిసాట్ నెట్‌వర్క్‌ను భాగస్వామిని చేసే విధంగా చూడాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఈఓ) బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి కోరారు. 'నూతన విద్యావిధానంలో టిసాట్ భాగస్వామ్యం' పేరుతో టిసాట్ రూపొందించిన విధివిధానాల ప్రణాళిక డాక్యుమెంట్‌ను మంత్రి శ్రీధర్‌బాబుకు సిఇఒ బుధవారం అందచేశారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు యూనివర్సిటీ స్థాయిలోనూ టిసాట్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి మంత్రికి తెలిపారు. విద్యా ఛానళ్ల ప్రసారాల్లో 39 వేల వీడియోలు కలిగి 140 మిలియన్ వ్యూస్‌తో దేశంలోనే టిసాట్ మొదటి స్థానంలో నిలిచి, తెలంగాణలోని సుమారు 80 శాతం చదువరులకు వివిధ రకాల కార్యక్రమాలతో చేరువైందని వివరించారు. ఆధునిక సమాజంలో పూర్తిగా డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపైనే విద్యా వ్యవస్థ ఆదారపడే అవకాశాలున్నందున భవిష్యత్‌ను ఆలోచించి టిసాట్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని వేణుగోపాల్‌రెడ్డి మంత్రికి తెలియజేశారు. ఇటీవలి కాలంలో 'యాన్వల్ స్టూడెంట్ కాంపిటేషన్స్ 2025' పేరుతో టిసాట్ నిర్వహించిన పోటీలు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, అధికార యంత్రాంగాన్ని భాగస్వాములను చేయడమే అందుకు ఉదాహరణ అని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఐటి శాఖ పరిధిలో ఉన్న టిసాట్ నూతన విద్యావిధాన రూపకల్పనంలో భాగస్వామిని చేసేలా చూడాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టి-సాట్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎండి.సాదిక్ ఉన్నారు.

## నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే ఫలితాలు

### కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిబద్ధతతో పనిచేస్తేనే ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలల్లో తమకు కేటాయించిన విధులను ప్రతిఒక్కరూ బాధ్యతగా నిర్వహించి విజయవంతం చేశారన్నారు. ఎన్నికలలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. రాబోయే ఎన్నికలలో కూడా ఇదే విధంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డిఆర్‌ఓ సంగీత, జెడ్‌పి సిఇఓ కృష్ణారెడ్డి, డిపిఓ విసురేశ్ మోహన్, ఎంపిడిఒల సంఘం జిల్లా నాయకులు బాల శంకర్ పాల్గొన్నారు.

## 'సిగాచీ' పరిహారం, దర్యాప్తుల పురోగతి నివేదించండి

### రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:** సిగాచీ సంఘటనపై కేసు దర్యాప్తు పురోగతి, బాధిత కుటుంబాలకు పరిహార చెల్లింపులపై సమగ్ర వివరాలు అందజేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో సిగాచీ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంఘటనపై సిట్తో దర్యాప్తునకు ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారించింది. ఈ ఘటనలో 54 మంది మృతి చెందగా ఎనిమిది మంది ఆచూకీ తెలియలేదని, 28 మంది గాయపడ్డారని హైదరాబాద్ సిటీకి చెందిన కె. బాబూరావు వేసిన పిల్‌లో పేర్కొన్నారు. దీనిని బుధవారం చీఫ్ జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. సిగాచి కంపెనీలో పేలుళ్ల ఘటనలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు రూ.42 లక్షలు చొప్పున పరిహారం చెల్లించినట్లు సిగాచి తరపున సీనియర్ లాయర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు ముగింపు దశకు వచ్చిందని, ఇప్పటి వరకు ఘటనకు బాధ్యుల గుర్తింపు జరగలేదని రాష్ట్రం తరపున అదనపు ఎజి రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. 2వ నిందితుడైన సిగాచి సీఈఓను అమిత్ రాజ్ సిన్హా అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తు ముగింపు దశకు చేరిందన్నారు. చార్జిషీట్ దాఖలు చేస్తామన్నారు. ఆచూకీ తెలియని ఎనిమిది మంది కార్మికులకు చెందిన మరణ ధ్రువీకరణ పత్రాలు వారి కుటుంబసభ్యులకు ఇలటచ్చి పరిహారం కూడా చెల్లించామన్నారు. బాధిత కుటుంబాలకు ఇంతవరకు రూ. 22 కోట్ల పరిహారం చెల్లించామన్నారు.

నిరంజన్‌రెడ్డి వాదిస్తూ, ఎయిర్ ఇండియా ప్రమాదంలో 241 మంది మరణించినప్పటికీ పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేదని, సిగాచి సిఇఓను అరెస్టు చేశారన్నారు. పరిహారంగా రూ.42 లు చొప్పున చెల్లించినట్లు చెప్పారు. ఇతర బెనిఫిట్స్‌తో కలిపి మొత్తం రూ. కోటి పరిహారం చెల్లింపు ఉంటుందన్నారు. పిటిషనర్ అడ్వొకేట్ వసుధా నాగరాజ్ కల్పించుకుని, ప్రమాదం సమయంలో రూ. కోటి పరిహారం చెల్లిస్తామన్న సిగాచి రూ.42 లక్షలనే చెల్లించిందన్నారు. వాదనలపై హైకోర్టు.. సిగాచి ఘటనపై దర్యాప్తు. పరిహారానికి చెందిన ఇతర వివరాలు అందజేయాలని రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. విచారణను జనవరి 29కి వాయిదా వేసింది.

## సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు

### ప్లాట్‌ఫామ్ 1 వైపు పార్కింగ్ తాత్కాలిక నిలిపివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న నేపథ్యంలో, ప్లాట్‌ఫామ్ నంబర్ 1 వైపున ఉన్న పార్కింగ్ సౌకర్యాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతతో పాటు స్టేషన్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. స్టేషన్‌ను ఆధునీకరించేందుకు చేపట్టిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పనులు దశలవారీగా, పద్ధతి ప్రకారం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ప్లాట్‌ఫామ్ నంబర్ 1 వద్ద వాహనాల పార్కింగ్‌ను తక్షణమే నిలిపివేయడంతో పాటు, అక్కడ పికప్– డ్రాప్‌కు కేవలం తక్కువ సమయం మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు విస్తృతమైన పార్కింగ్ సౌకర్యాన్ని అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రైళ్లలో ఎక్కడం– దిగడం, పికప్, డ్రాప్ మరియు పార్కింగ్ అవసరాల కోసం ప్రయాణికులు ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు ఉన్న పార్కింగ్‌ను వినియోగించుకోవాలని వారు కోరారు. ప్రయాణికులకు సరైన మార్గనిర్దేశం చేయడానికి స్టేషన్‌లోని కీలక ప్రాంతాల్లో స్పష్టమైన దిశా నిర్దేశక సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా నిరంతరం సమాచారం అందిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రత, భవిష్యత్‌లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన దృష్ట్యా ఈ చర్యలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల కాలంలో అసౌకర్యాన్ని తగ్గించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ఈ సమయంలో రైలు ప్రయాణికులు సహకరించాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

# ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్యశాఖ కొరడా

- జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో జల్లెడపడుతున్న వైద్య బృందాలు
- నిబంధనలు పాటించని వాటిపై చర్యలకు సిఫారసు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో వైద్య అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. పలు బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా అన్నిఆసుపత్రులను క్షుణంగా తనిఖీ చేస్తున్నారు. ఆసుపత్రిలో వసతులు, సిబ్బంది నియామకం, చికిత్సవిధానాలను పరిశీలిస్తున్నారు. ఎవరికి వారేబృందాలు తమ నివేదికను డిఎంఎంహెచ్‌ఒకు అందజేస్తున్నారు. పలు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సిఫారస్ చేస్తున్నారు. అనేక ఆసుపత్రుల్లో కనీస వసతులతో పాటు సరిపడా సిబ్బంది లేరని నివేదికల్లో పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ సర్వీసులతో పాటు స్పెషలిస్టు వైద్యులు లేకున్నా చికిత్స అందిస్తున్నారని, చాలా ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీకి కావాల్సిన పరికరాలు లేవని తనిఖీల్లో తేలడంతో ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

**50 టీమ్‌లు, వారానికి రెండుసార్లు...** ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణపై సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకుగాను నిబంధనలకు అనుగుణంగా చెక్ లిస్ట్ రూపొందించి 50 బృందాలను వారంలో రెండు రోజులు, తనిఖీలు నిర్వహించేందుకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రంగంలోకి దింపారు. ఆసుపత్రులను తనిఖీ చేస్తూ తమ నివేదికలను ఏ రోజుకు ఆ రోజు డిఎంహెచ్‌ఒకు పంపిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా తీసుకున్న వివరాలకు అనుగుణంగా కొన్ని ఆసుపత్రులకు నోటీసులు ఇవ్వడంతో పాటు చర్యలు తీసుకోవాలని నివేదికలో వైద్యులు పేర్కొంటున్నారు.

**ఆస్పత్రుల్లో వసతుల లేమి...** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో తనిఖీలు చేపట్టిన వైద్య బృందాలకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చాలా వసతులు కల్పించలేదని గుర్తించారు. ప్రభుత్వం ఇచ్చిన చెక్‌లిస్టు ప్రకారం తనిఖీలు చేస్తుండగా చాలా ఆసుపత్రుల్లో కనీస వసతులు లేకపోవడంతో పాటు సిబ్బంది కొరతను గుర్తించారు.శిక్షణ పొందిన సిబ్బందిలేక కొద్ది రోజుల పాటు ఆసుపత్రి వర్గాలు శిక్షణ ఇచ్చి పనులు చేసుకుంటున్నట్లు వైద్య అధికారులు గుర్తించారు.

**కానరాని ఫైర్ సేఫ్టీ...** జిల్లాలో కొన్ని పెద్ద ఆసుపత్రులు మినహాయిస్తే ఏ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం జరిగినా ఫైర్ ఇంజన్ తిరిగే పరిస్థితులు లేవు. పెద్ద ప్రమాదాలు జరిగితే కాపాడేందుకు కావాల్సిన పరికరాలు లేవు. అన్ని ఆసుపత్రుల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాల్సి ఉన్న ఎక్కువ మంది నామ మాత్రంగా కొన్ని పరికరాలను మాత్రమే ఉంచారు. కొన్ని ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయం గడిచినా మళ్లీ రెన్యువల్ చేయించలేదు. ఎక్కువ ఆసుపత్రుల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రకటించినా కావాల్సి వైద్యులు మాత్రం లేరు. కొంతమంది స్పెషలిస్టు వైద్యులు నగరంలోని పలు ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. నర్సింగ్ హోంలు పెట్టినపుడు కొన్ని రకాల సేవలే చేస్తామని అనుమతులు తీసుకున్నా కొన్ని ఆసుపత్రుల్లో అనుమతులు లేకుండానే సిజేరియన్లు చేస్తున్నారు. ప్రసవాలను కొనసాగిస్తున్నారు. వీటికి సంబంధించిన ఆపరేషన్ థియేటర్, డెలివరీ రూంలు కూడా తగినవిధంగా ఏర్పాట్లు చేయలేదు. కొన్ని ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు ఉన్నా డెలివరీ రూంలు లేనట్లు తనిఖీల్లో గుర్తించారు. చాలా ఆసుపత్రుల్లో వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బందికి సంబంధించిన జిరాక్స్ సర్టిఫికెట్లు ఉంచిన వారిలో సగం మంది పనిచేయడంలేదని గుర్తించారు. పట్టణప్రాంతంతో పాటు రూరల్ మండలాల్లో ఉన్న నర్సింగ్ హోంలలో ల్యాబ్‌లు కూడా తగిన విధంగా లేనట్లు గుర్తించారు. ఈ వివరాలన్నీ నమోద చేసుకున్న వైద్య బృందాలు డిఎంహెచ్‌ఒకు నివేదికలు ఇస్తున్నారు.

### 1054 ఆస్పత్రులను తనిఖీకి ఆదేశించాం

#### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితా దేవి



ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె లలితా దేవి తెలిపారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రిలో నిర్వహణపై సమగ్ర సమాచారం కోసం 50 టీమ్ ల ను రూపొందించినట్లు చెప్పారు. మొదటి ధఫలో జిల్లాలోని 1054 ప్రైవేటు 50,100 పడకల ఆసుపత్రులను తనిఖీ చేసి రిపోర్టును అందజేయాలని 50 టీమ్లను రూపొందించి వారానికి రెండు రోజులు చూపున తనిఖీ చేసి సమగ్ర సమాచారంతో రిపోర్టులను అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రూపొందించిన చెక్ లిస్ట్ ప్రకారం పూర్తి సమాచారం సేకరించేందుకు 50 టీములు నవంబర్ నుండి ఇప్పటివరకు పనిచేస్తున్నాయని,అందులో భాగంగా ఇప్పటివరకు తప్పులు గుర్తించిన 16 ప్రైవేట్ ఆసుపత్రులు సరి చేసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు లలితా దేవి స్పష్టం చేశారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## నిధులు మంజూరుపై సిఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిలోని మురికి కాలువకు సిసి వేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని అలియాబాద్ మాజీ ఎంపిటిసి సగ్గు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌ను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి మురికి కాలువకు శాశ్వత పరిష్కారం కొరకు సిసి వేయడానికి రూ. కోటి 30 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మెట్రోలైన్ ప్రతిపాదన, ఫ్లై ఓవర్ నిర్మాణంపై ఈటలకు రవీందర్ వినతి



**ప్రజాపక్షం/దుండిగల్:** కూకట్‌పల్లి, మూసా పేట్, ఐడిఐ జీడిమెట్ల మీదుగా అల్వాల్‌కు మెట్రోలైన్ ప్రతిపాదన, బాలానగర్ నుండి గండిమైసమ్మ వరకు, ఫ్లై ఓవర్ నిర్మాణం విషయమై పార్లమెంటు సభ్యుడు, ఈటల రాజేంద్రను పర్యావరణ ప్రేమికుడు, సామాజికవేత్త కోల రవీందర్ ముదిరాజ్ కలిసి వినతి పత్రం అందజేశారు. భారతదేశంలోని మినీ ఇండియాగా పిలువబడే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజ్గిరి ప్రాంతాల్లో లక్షలాది కార్మికులతో ఉన్న ఈ పారిశ్రామికవాడ వందలాది బస్తీలు, సుమారు 6 లక్షల పైగా ఓటర్లు కార్పొరేటర్‌తో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గం, కూకట్‌పల్లి, మూసాపేట్ నుండి ఐ, డి, ఎ, జీడిమెట్ల నుండి,అల్వాల్ వరకు, మెట్రో రైల్ పొడిగించే విధంగా గండిమైసమ్మ నుండి బాలనగర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం కొరకై సంబంధిత అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రితో, ప్రధానమంత్రితో చర్చించాలని, హెచ్ఎంటి, కార్మాగారాన్ని పునరుద్ధరించుటకై 40 సంవత్సరాల క్రితం మూతపడ్డ ఎపి టెక్స్‌టైల్ కార్మాగారం పునర్నిర్మించుటకై సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి ఈ ప్రాంతానికి న్యాయం చేయగలరని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.మదన్ గౌడ్, పెంటయ్య ముదిరాజ్, రామ కృష్ణ, స్థానిక నాయకులు,బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాద క్షతగాత్రులను
# గంటలోపు ఆస్పత్రికి తీసుకువెళితే నగదు పురస్కారం

### ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** రోడ్డు ప్రమాదాలు జరిగిన మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందించటం ద్వారా ప్రాణాపాయం నుండి కాపాడుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గోల్డెన్ అవర్‌లో రోడ్డు ప్రమాద బాధితులకు అవసరమైన వైద్యం లభించేందుకు తమ బాధ్యతగా వారిని ఆస్పత్రికి తీసుకొని వెళ్లిన వారికి ప్రభుత్వం రూ.25 వేల నగదు బహుమతి ఇవ్వనుందని, దీంతోపాటు వారికి రాహ్ వీర్ ప్రశంసా పత్రాన్ని అందించనున్నారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా సమస్యాత్మకంగా ఉన్న రోడ్ల వివరాలను తెలుసుకొని అటువంటి రోడ్డు మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశించారు. జిల్లాలో తరచు రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ నివారణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉండే విద్యుత్ స్థంభాలను వెంటనే మరో చోటకి మార్చటం, రోడ్లను వెడల్పు చేయటం, రోడ్లకు ఇరువైపులా ఎలాంటి ఆక్రమణలు కాకుండా చూడటం, రోడ్డు ప్రమాదాల నివారణ లో భాగమన్నారు. రోడ్ సేఫ్టీ డిసిపి మనోహర్ మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఎవరైనా వెంటనే సమీప ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లాలని, దీనివల్ల తాము పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్న భయం ఉండరాదన్నారు.

ఏ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకొని వెళ్లినా ఆస్పత్రి యాజమాన్యాలు పూర్తి స్థాయిలో ఉచిత వైద్యం అందిస్తారని, క్షతగాత్రులను తీసుకొని వెళ్లిన వారిని వైద్య ఖర్చుల గురించి ఏ మాత్రం అడుగరన్నారు. భయం వద్దన్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొని వెళ్లిన పోలీసులు ప్రోత్సహిస్తారే తప్ప ఎలాంటి ఇబ్బందులకు గురిచేయరన్నారు. రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో సమగ్రంగా అవగాహన కల్పించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్‌టిఎ కమిటి సభ్యులు జైపాల్‌రెడ్డి మాటాలడుతూ హకీంపేట, తూంకుంటలో బ్లాక్‌స్పాట్స్ గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ శ్రీనివాస్ మూర్తి, పోలీస్, ట్రాఫిక నేషనల్ హైవే, వైద్య, విద్య, టిజిఆర్టీసీతో పాటు వివిధ సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ నగర్‌ను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయండి

### మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** జవహర్ నగర్ డిసెంబర్ 31 బృహత్ మహానగర పరిధిలోని జవహర్ నగర్ పురపాలక సంఘ పరిధిలో ఉన్న అంబేద్కర్ నగర్ ను ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటు చేయాలని, జవహర్ నగర్ నాయకులు బుధవారం ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవకుడు జింక నాగులు ముదిరాజ్ మాట్లాడుతూ, చెన్నాపురం నుండి అంబేద్కర్ నగర్ వరకు సుమారు 50 కాలనీలు నెలకొని ఉన్నాయని వీరి జనాభా దాదాపు లక్ష పైచిలుకే ఉంటుందని ఇంతటి జనాభా కలిగిన ప్రాంతానికి ప్రత్యేకమైన డివిజన్ ఎంతో అవసరమన్నారు. ఓట్ల ప్రాతిపదికనే కాకుండా జనాభా ప్రాతిపదికన కూడా పరిగణనలోకి తీసుకొని చెన్నాపురంను లేదా అంబేద్కర్ నగర్‌ను ప్రత్యేకమైన డివిజన్‌గా ఏర్పాటు చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లుగా జవహర్ నగర్ వెనుకబాటుతనానికి గురైందని అభివృద్ధికి ఆమడ దూరంలో జవహర్ నగర్ ప్రజలు నివసిస్తున్నారని, వెనుకబాటు తనానికి తోడు డంపింగ్ యార్డ్ నుంచి వచ్చే కంపుతో ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురవుతున్నారని, ఇటు డంపింగ్ వాసన అటు పవర్ ప్లాంట్‌లో నుంచి వచ్చే శబ్ద కాలుష్యం, పొగతో చెన్నాపురం నుండి అంబేద్కర్ నగర్ వరకు విస్తరించి ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అంబేద్కర్ నగర్‌ను ప్రత్యేక డివిజన్ గా ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడెల్లి సురేష్ ముదిరాజ్, సిద్ధులు యాదవ్, శివకుమార్ గౌడ్, తదితరులు, అంబేద్కర్ నగర్, కొండవీటి రాయన్న కాలనీ, దొండ తోట, అయ్యప్ప కాలనీ, కెఎన్ఆర్ కాలనీ, ప్రగతి నగర్, కృష్ణానగర్ కాలనీ, చెన్నాపురం, బిజెఆర్ నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పేద ప్రజల పట్ల సేవాభావం ఉన్న వ్యక్తులనే ఎంచుకోవాలి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** పార్టీ పట్ల అంకితభావం, పేద ప్రజల పట్ల సేవాభావం ఉన్న వ్యక్తులనే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కార్పొరేటర్లుగా గెలిపించుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని బేగంపేట డివిజన్ ప్రకాష్‌నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. తన దృష్టికి వచ్చిన వాటర్ డ్రైనేజీ వంటి సమస్యలపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్‌లు చిన్నవి కావడం వల్ల పనులు త్వరగా పూర్తవుతాయని, అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమం, కార్యక్రమాలు పట్ల ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని తద్వారా ప్రజల్లో సానుకూలత పెరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, రమేష్, బాలు, టోచర్, జాన్, నర్సింగ్‌రావు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



## నిహారా రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం:** 132 జీడిమెట్ల డివిజన్ ప్రసూన నగర్ చాణక్య స్కూల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిహారా రెస్టారెంట్‌ను బుధవారం బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ కె.ఎం గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకమైన వాతావరణంలో భోజనప్రియులకు రుచికరమైన రుచులను అందజేస్తూ నిహారా రెస్టారెంట్ అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఈడే లక్ష్మీ నారాయణ, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, ఎల్లాగౌడ్, నదీమ్‌రాయ్, విజయ్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## మారోజు వీరన్న జయంతిని జరపండి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** విశ్వబ్రాహ్మణ హక్కుల సాధనసమితి (చీఫ్) మారోజు సోమాచారి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమ స్థాపికుడు, దళిత బహుజన ఉద్యమ సిద్ధాంతకర్త, మారోజు వీరన్న 64వ జయంతిని ప్రజలు ప్రజాసామిక వాదులు తెలంగాణ ఉద్యమకారులు, విశ్వబ్రాహ్మణ సంఘాల శ్రేణులు ప్రతి ఒక్కరూ మండల గ్రామ జిల్లా కేంద్రాల్లో ఆయన చిత్రపటాన్ని పెట్టి ఘనంగా జయంతి ఉత్సవాలను జనవరి 1 నుండి 31 వరకు పెద్ద ఎత్తున నిర్వహించాలని, ఆయన చేసిన త్యాగ పలితాంగా మరియు సాంస్కృతిక ఉద్యమ కార్యక్రమాల వల్లే , తెలంగాణ సిద్ధించిందని తెలంగాణ పౌరులుగా ఆ మహనీయునికి జయంతిని జరపడం మన అందరి బాధ్యత అని అన్నారు. అంతేకాకుండా ఆంధ్ర పాలకుల పరిపాలనలో జై తెలంగాణ అనడానికి భయపడే రోజుల్లో మారోజు వీరన్న తెలంగాణ మహాసభ ద్వారా లక్షలాది మందిని కదిలించి సాంస్కృతిక ఉద్యమానికి తెర లేపాడం జరిగిందని, అసిత్వ పోరాటాల ద్వారా హక్కులను సాధించి ఆత్మగౌరవ ఎజెండాతో మేమెంతో మాకు అంత వాటా అని నినాదించారు. అని ఆయన ఒక ప్రకటనలో తెలపడం జరిగింది.

## బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని అతివేగంతో వచ్చిన బైక్ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొడ్డు గోవింద్ (56) ఎప్పటిలాగే బాలానగర్‌లోని డీ మార్ట్ వెనుక ఉన్న లేజర్ కంపెనీలో పనికోసం ఆటోలో బయలుదేరాడు. డి మార్ట్ ముందు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని బైక్ రైడర్ గోవిందని ఢీ కొట్టి వేగంగా వెళ్లిపోయాడు. బొడ్డు గోవింద్ కుమారుడు బొడ్డు వెంకటేష్ ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఐఎఎస్‌కు ఎంపికైన ఉపేందర్ రెడ్డి

### కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి చెందిన నాన్‌స్టేట్ సివిల్ సర్వీస్ అధికారి ఆర్.ఉపేందర్ రెడ్డిని భారత పరిపాలనా సేవ (ఐఎఎస్)కు ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభు త్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు డిసెంబర్ 31న సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్‌ల మంత్రిత్వ శాఖ (డిఓపిటి) అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. భారత పరిపాలనా సేవ (రిక్రూట్‌మెంట్) రూల్స్, 1954, సంబంధిత నిబంధనల ప్రకారం, 2024 సంవత్సరానికి సంబంధించిన సెలెక్ట్ లిస్ట్ (నాన్ ఎస్‌సిఎస్)లో ఆయన పేరు ఎంపికైంది. 2024 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు ఏర్పడిన ఖాళీలకుగాను ఈ నియామకం చేపట్టినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆర్. ఉపేందర్ రెడ్డిని ప్రస్తుతం ప్రొబేషన్‌పై ఐఎఎస్‌కు నియమిస్తూ, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తెలంగాణ క్యాడర్‌కు కేటాయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నియామకం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన అనంతరం చేసినట్లు డిఓపిటి తెలిపింది. ఈ నోటిఫికేషన్‌పై కేంద్ర ప్రభుత్వ అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ చౌరాసియా సంతకం చేశారు. త్వరలోనే అధికారిక





## కెసిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** శాసనసభ, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా అవకాశం కల్పించిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ఎర్రవెల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అలాగే శాసన మండలిలో పార్టీ విప్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రెడ్డి కూడా కెసిఆర్‌ను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ వారికి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

## బంట్వారం తహసీల్దార్‌ను కలసిన మంగ్రాస్‌పల్లి సర్పంచ్

**ప్రజాపక్షం/బంట్వారం :** మంగ్రాస్‌పల్లి గ్రామ సర్పంచ్ స్వప్న రమేష్ బుధవారం స్థానిక తహసిల్దార్ విజయ్‌కుమార్, నయాబ్ తహసిల్దార్ మహేష్ కూమార్ మరియు ఆర్ఐ రాంగోపాల్ లను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రియాజ్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.



## దేవరయాంజాల్‌లో యన్ఆర్ దాబా ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దేవరయాంజాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యన్ఆర్ దాబాను కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ బుధవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యులు జైపాల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నేత గోనె మహేందర్ రెడ్డి, కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్ మేకల మహేందర్‌యాదవ్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, శంకర్‌గౌడ్, యాష్కి శంకర్‌గౌడ్, సీతారామస్వామి ఆలయ వల్లందాసు మురళిగౌడ్, తూంకుట జగదీష్, కిషోర్ యాదవ్, నాగేష్ యాదవ్, కిసాన్ సెల అధ్యక్షుడు ధర్మారెడ్డి, కత్తి రమేష్, సాయికుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## వెన్నుపోటు పొడిచే నాయకులతో తస్మాత్ జాగ్రత్త

### హరివర్ధన్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌ల మధ్య మాటల యుద్ధం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మన పార్టీలోనే ఉంటు మనకే వెన్నుపోటు పొడిచే నాయకులతో కార్యకర్తలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటిలో మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపల్‌లో జరిగిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి నాకు సమాచారం లేదని మండిపడ్డారు. ఆ మండలానికి తాను జడ్పిటిసిగా పనిచేశానని ఆ ప్రాంత ప్రజలతో నాకు సత్సంబంధాలు ఉన్నాయని చెప్పారు. పార్టీ న్యాయకత్వం మీద ప్రేమలేనివారు కొంతమంది అన్నింటికి ముందుంటారని ఎద్దేవా చేశారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీ పదవులు వస్తుంటాయి పోతుంటాయని పదవి ఉంటే కొమ్ములు రావని లేక పోతే కొమ్ములు పోవని చెప్పారు. నేను చేయి చూపిస్తే ఓట్లు పడతాయని గ్రామంలోని నాయకుల అభిప్రాయం మేరకే ఎన్నుకున్న వారినే ప్రజలు గెలిపించుకుంటారని చెప్పారు. పార్టీ టికెట్ల కోసం ఎవరి వద్దకు చెక్కర్లు కొట్టాల్సిన అవసరం లేదని అన్నారు. నేను కార్యకర్తలకు అండగా ఉండి మీ విజయం కోసం కృషి చేస్తానని చెప్పారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బిఆర్ఎస్ నాయకుల నుంచి డబ్బులు తీసుకుని సొంత పార్టీకే వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు.

ఇక్కడ ఎవరు తోపు కాదని ఎవరికివారే తోపు అని ఎవరిని నమ్ముకుని మోసపోవద్దని హితవు పలికారు. బరిలో ఉన్న అభ్యర్థులు తమ వార్డుల్లో తిరిగి రిజర్వేషన్ల ప్రకారం కమిటీలు వేసుకుని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటన లు మరిచిపోయి పార్టీ బలోపేతానికి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు, గ్రామంలోని యువజన సంఘాలు, గ్రామపెద్దలు, కుల పెద్దలను కలుపుకుని కమిటిలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాలు తగ్గుముఖం

### ఎస్ఐ సందీప్‌కుమార్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రజల సహకారం కారణంగా నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025లో నేరాలు తగ్గుముఖం పట్టాయని స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన గత ఏడాది కేసు వివరాల ప్రగతిని వివరించారు. చోరీ కేసులు 28.5 శాతం, మర్డర్ కేసులు 80 శాతం, ఛీటింగ్ కేసులు 17 శాతం, రేప్ కేసులు 55.5 శాతం, ఛీటింగ్ కేసులు 17 శాతం , సైబర్ క్రైమ్‌లు 29 తగ్గాయన్నారు. అదే విధంగా చోరీ కేసుల్లో 76 శాతం డిటెక్టన్ అయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలు 12.6 శాతం, మిస్సింగ్ కేసులు 3.5శాతం, ఆత్మహత్యా కేసులు 11.3 కేసులు తగ్గాయన్నారు. పెట్టీ కేసులు 54.8శాతం పెరిగాయన్నారు. ఈ ఏడాది హత్యా కేసులో నిందితుడిని దోషిగా గుర్తించి జీవిత ఖైదు శిక్ష పడిందన్నారు. సైబర్ కేసులకు సంబంధించి 220 మంది బాధితులకు రూ.50 లక్షలను ఇప్పించామన్నారు. ప్రజల సహకారం తో దసరా, దీపావళి, బోనాలు, హనుమాన్ జయంతి, క్రిస్మస్, బక్రీద్, రంజాన్ లాంటి పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామన్నారు.



## మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే బిఎంఆర్ భేటీ

### తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు మోక్షం

**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి భేటీఅయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తుమ్మల నాగేశ్వర్ రావుతో మంత్రి చాంబర్‌లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాండూరు మార్కెట్ యార్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. ఇందుకుగాను మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వెంటనే మార్కెట్ యార్డుకు గూర్చి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి సానుకూలంగా స్పదించడం పట్ల తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి హర్షం వ్యక్తం పర్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ మంత్రికి, ఎమ్మెల్యే మనోహర్‌రెడిలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## సిపిఐకి రజక వృత్తిదారుల సమాఖ్య విరాళం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత గడ్డపై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న శత వసంతాల ముగింపు, జాతీయ భారీ బహిరంగ సభ విజయవంతాన్ని కాంక్షిస్తూ బుధవారం రజక వృ త్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి రూ.10వేల విరాళం అందజేశారు. బుధవారం హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుకు రూ.10వేల చెక్కు ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర నాయకులు రాయబండి పాండు రంగా చారి, వృత్తి సంఘాల నాయకులు గోరుగంటి కృష్ణ, ఉడతల మల్లేష్, ఒ.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నీటికోసం కొత్త మోటార్, విద్యుత్ దీపాల బిగింపు



**ప్రజాపక్షం/వికారాబాద్:** గ్రామంలో నీటి సమస్యను తీర్చడానికి కొత్త మోటార్,విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసిన బురాన్‌పల్లి సర్పం చ్ రాందాస్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల అండదండలతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని అన్నారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని బురాన్‌పల్లి లో బోర్ మోటార్ బిగించడంతో పాటు గ్రామంలోని పలు చోట్ల విద్యుత్ దీపాలను అమర్చారు. గ్రామ సర్పంచ్‌గా అశీర్వదించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్య ఇస్తామన్నారు. ముందుగా ప్రజలకు సమృద్ధిగా మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలు నిరంతర శానిటేషన్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలందరూ సహకరించాలనికోరారు. గ్రామ ప్రజలకు నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్లుఎస్ ఎఇ అభిషేక్ తివారీ,పంచాయతీ కార్యదర్శి స్వాతి, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.




# 'సిన్నారి కోన' పాట విడుదల



టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ ఇప్పుడు నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ప్రధానంగా గ్రామీణ నేపథ్యంలో సాగే చిత్రమిది. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్‌పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సిన్నారి కోన' అనే పాటను రిలీజ్ చేశారు. పెళ్ళైన తరువాత జరిగే అప్పగింతల బ్యాక్ డ్రాప్‌లో ఈ పాట ఉంటుంది. సంగీత దర్శకుడు జయ కృష్ణ ఈ సాంగ్ బ్యూటీఫుల్ మెలోడీగా స్వరపరిచారు. జయ కృష్ణ, అనన్య భట్, ఎం.జి.నరసింహ వోకల్స్ పాటకు ఫీల్ ని తీసుకొచ్చాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం అందరినీ ఆకట్టుకుంది. 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 23న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ కానుంది.

# 'ఘంటసాల' సినిమాకు ప్రసంశలు



ప్రముఖ గాయకుడు ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని 'ఘంటసాల ది గ్రేట్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ బ్యానర్ మీద శ్రీమతి సి.హెచ్. ఫణి నిర్మించారు. ఈ చిత్రంలో ఘంటసాల వారి పాత్రను సింగర్ కృష్ణ చైతన్య పోషించారు. కీలక పాత్రలో సుమన్ నటించారు. ఈ మూవీని జనవరి 2న ఘనంగా రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'ఘంటసాల ది గ్రేట్ స్పెషల్ మ్యూజికల్ నైట్' ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ.. 'మహోన్నతమైన వ్యక్తి ఘంటసాల. ఆయన జీవిత చరిత్ర ఆధారంగా తీసిన ఈ 'ఘంటసాల ది గ్రేట్' మూవీ ఘన విజయం సాధించాలి. ఎన్ని అడ్డంకులు ఏర్పడినా సరే ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రఘు కుంచె, కౌసల్య, విజయలక్ష్మి, దర్శకుడు సి.హెచ్. రామారావు, శోభా రాణి, నిర్మాత టీఎస్ రావు, వకుళాభరణం కృష్ణమోహన్, దర్శకుడు సముద్ర, రైటర్ వెన్నిగల రాంబాబు, సంగీత దర్శకుడు రవి శంకర్, కర్రి బాలాజీ, దర్శకుడు మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

# 'మ్యాజిక్' హిట్ కావాలి

## దర్శకుడు మెహర్ రమేష్



టు త్రీ వెంచర్స్ బ్యానర్ మీద రాజు సత్యం నిర్మించిన మరాఠీ చిత్రం 'మ్యాజిక్'. జితేంద్ర జోషి హీరోగా రానున్న ఈ మూవీకి రవింద్ర విజయ కర్మార్కర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీని నేడు రిలీజ్ చేయబోతోన్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, దర్శకుడు మెహర్ రమేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. మెహర్ రమేష్ మాట్లాడుతూ.. 'రాజు సత్యం నాకు చాలా మంచి స్నేహితుడు. స్వర్గీయ పునీత్ రాజ్ కుమార్‌తో నేను చేసిన 'వీర కన్నడిగ' చిత్రంలో రాజు నటించాడు. అప్పటి నుంచి మా స్నేహం కంటిన్యూ అవుతూనే ఉంది. ఆయన ఇప్పుడు 'మ్యాజిక్' మూవీని నిర్మించారు. ట్రైలర్ చూశాను. నాకెంతో గ్రిప్పింగ్‌గా అనిపించింది. పూరి చిత్రాల్లో రాజ్ నటించాడు. ఇప్పుడు ప్యాషనేట్ ప్రొడ్యూసర్‌గా మారిపోయారు. బాలీవుడ్ అంతా కదిలి వచ్చి ఈ చిత్రం కోసం సపోర్ట్ చేశారు. హైదరాబాద్‌లోని మరాఠీ ప్రేక్షకులకు కూడా స్క్రీన్స్ ఉంటాయి. ఇక్కడి వారంతా 'మ్యాజిక్' మూవీని చూసి సక్సెస్ చేయండి' అని అన్నారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. 'మ్యాజిక్' నిర్మాత రాజు సత్యంకి ఆల్ ది బెస్ట్. ఇండియన్ సినిమాల్లో మరాఠీ ఇండస్ట్రీకి ప్రత్యేక స్థానం ఉంటుంది. అక్కడి నుంచి అద్భుతమైన ఆర్టిస్టులు బయటకు వచ్చారు. అలాంటి ఇండస్ట్రీ నుంచి నేరుగా 'మ్యాజిక్' సినిమా రాబోతోంది. రిలీజ్‌కు ముందే ప్రపంచ వ్యాప్తంగా 9 అంతర్జాతీయ అవార్డుల్ని దక్కించుకుందని అన్నారు. అరవింద్, నిర్మాత రాజు సత్యం, జితేంద్ర జోషి పాల్గొన్నారు.

# సిద్ధుగాడి లవ్‌స్టోరీ పోస్టర్ ఆవిష్కరణ



మహాన్, శృతి, మోహన సిద్ధి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ'. ఈ సినిమాను బాలబ్రహ్మాచారి సమర్పణలో శివ బ్రహ్మేంద్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రమ్మ.సి. నిర్మిస్తున్నారు. రమేష్.సి. దర్శకత్వం వహిస్తున్నారు. వేణు గోపాల చారి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. 'సిద్ధు గాడి లవ్ స్టోరీ' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్ ఫిలించాంబర్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ.. డైరెక్టర్ కావాలనే తన కొడుకు రమేష్ కలను 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' సినిమాతో సావిత్రమ్మ నిజం చేశారు. రమేష్‌ను యూఎస్‌లో కలిశాను. సినిమా మీద ప్యాషన్ ఉన్న వ్యక్తి ఆయన. అక్కడ తన ప్రొఫెషనల్ కెరీర్ కంటిన్యూ చేస్తూ ఇండియా వచ్చి ఈ సినిమా కంప్లీట్ చేశారు. సిద్ధు సిద్ధార్థ్ రాయ్ లవ్ స్టోరీని ఖుషి సినిమాలో చూసి హిట్ చేశాం. 'సిద్ధుగాడి లవ్‌స్టోరీ' పాటలు చాలా బాగున్నాయి. ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో మహాన్, హీరోయిన్ మోహన సిద్ధి, హీరోయిన్ శృతి, మ్యూజిక్ డైరెక్టర్ అధిరవ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న-పెద్ద కాదు.. కంటెంట్ ఉండాలి

## 'ఈషా' సక్సెస్ మీట్‌లో సురేష్ బాబు



చిన్నసినిమా, పెద్ద సినిమా అనేది ఉండదు. కంటెంట్ బాగుంటే సినిమా ఆడుతుంది. కంటెంట్ ఉన్న చిత్రాల్నే ఆడియెన్స్ చూస్తారు. ఆడియెన్స్ పెట్టే డబ్బులు, వెచ్చించే సమయానికి తగ్గ కంటెంట్‌ను మనం ఇస్తున్నామా? లేదా? అన్నది చూసుకోవాలి. ఎవరో మీ కథను రిజెక్ట్ చేశారని నిరుత్సాహ పడొద్దు.. సరైన టైంకి అన్నీ జరుగుతాయి. పాజిటివ్‌గా ఉండండి. అంతా మంచే జరుగుతుంది. దాముకి హిట్ రావడం ఆనందంగా ఉంది' అని తెలుగు ఫిలిం ఛాంబర్ నూతన అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు అన్నారు. విడుదలైన రోజు నుంచి సక్సెస్ ఫుల్‌గా నడుస్తున్న ఈషా సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సినిమా సమర్పకుడు దామోదర్ ప్రసాద్ ఫిలిం ఛాంబర్ కార్యదర్శిగా భాధ్యతలు చక్కగా నిర్వర్తించారని సురేష్ బాబు అన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన దామోదర్ ప్రసాద్ సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. కెఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'బన్నీ వాస్, వంశీలకు దిష్టి తీయాలి. పిలిచిన వెంటనే వచ్చిన నా స్నేహితులు సురేష్, అశోక్‌లకు థాంక్స్. అల్లు అరవింద్ ఇచ్చే ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఈ ఏడాదిలో చిన్న చిత్రాలుగా వచ్చి హిట్టు కొట్టిన వారిని పిలవాలని అనుకున్నాను. అసలు సినిమాల్లో చిన్నా, పెద్ద అన్నది లేదు. ఏది ఆడితే అది పెద్ద సినిమా. ఆడకపోతే చిన్న చిత్రం. 'ఈషా' జర్నీ చాలా పెద్దది. ఈ ప్రయాణంలో శ్రీనివాస్ చాలా కష్టపడ్డాడు. గత 15 ఏళ్లుగా అతడి జర్నీని నేను చూస్తున్నాను. శ్రీను తనని తాను నిరూపించుకున్నాడు. ఇక నుంచి శ్రీను వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి రాకూడదు. సహనంతో ఉంటే ప్రతీ ఒక్కరికీ విజయం దక్కుతుందని అన్నారు. నటుడు, నిర్మాత, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. 'నేను సినిమాలు చూడటం చాలా వరకు తగ్గించేశాను. కానీ ఇక్కడ మాట్లాడిన వారి మాటలన్నీ వింటే నా తొలి రోజులు గుర్తుకు వచ్చాయి. వెంకటేష్‌తో నేను తీసిన 'రక్త తిలకం' సంక్రాంతి పోటీలో రిలీజ్ చేసి రిస్క్ తీసుకున్నాం. యంగ్ ఏజ్‌లో ఉన్నప్పుడు భయపడాల్సిన పని లేదు. బన్నీ వాస్ పేరు పడితే సినిమాకి ఓ గ్లామర్ వస్తుంది. మా కాలంలో ఇప్పటిలా సోషల్ మీడియా, నెగెటివిటీ అనేది లేదు. పాజిటివ్‌గా ముందుకు వెళ్తే కాస్త స్లోగా అయినా సరే సక్సెస్ కచ్చితంగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ మన్నె, బన్నీ వాస్, వంశీ నందిపాటి, నిర్మాత హేమ వెంకటేశ్వర రావు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్ఆర్ ధృవన్, నటుడు అఖిల్ రాజ్, నటి సిరి, నటి ఉషా శ్రీ, 'కోర్ట్' డైరెక్టర్ రామ్ జగదీష్, రచయిత లక్ష్మీ భూపాల, కళ్యాణీ మాలిక్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, తెలుగు టైటాన్ సీఈవో త్రినాథ్ రెడ్డి, నటుడు హర్షిత్, డైరెక్టర్ యదు వంశీ వంటి పాల్గొన్నారు.

# రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక



మూడు వరుస ఘన విజయాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. అసలుసిసలైన పండగ చిత్రంగా జనవరి 14న థియేటర్లలో అడుగుపెట్టనున్న 'అనగనగా ఒక రాజు' సినిమా ప్రమోషన్ కోసం 'రాజు గారి పెళ్లి రిసెప్షన్ వేడుక'ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. హీరో, హీరోయిన్ నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి 'అనగనగా ఒక రాజు' చిత్రంలోని 'భీమవరం బాల్మా', 'రాజు గారి పెళ్లిరో' పాటలకు వేదికపై నృత్యం చేసి అందరిలో ఉత్సాహం నింపారు. అనంతరం అతిథులందరికీ స్వాగతం పలికి, నిజంగానే పెళ్లి రిసెప్షన్ వేడుకను తలపించారు. ఇక నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి నూతన వధూవరుల్లా వేదికపై కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ.. వరుసగా మూడు విజయాలు అందుకున్న తర్వాత అదే ఉత్సాహంలో మీ ముందుకు మరో అదిరిపోయే సినిమాని తీసుకొద్దాం అనుకున్నాను. కానీ, ఒక యాక్సిడెంట్ జరగడం వల్ల నేను షూటింగ్ కి దూరమయ్యాను. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. అయితే అదే సమయంలో మా బృందంతో కలిసి ఈ 'అనగనగా ఒక రాజు' కథ రాసుకోవడం జరిగింది. మీ అందరి ప్రేమ, మద్దతు వల్లే నేను త్వరగా కోలుకోగలిగాను. మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఇది నా మూడో సంక్రాంతి సినిమా. 'అనగనగా ఒక రాజు'లో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాపై మీరు చూపించే ప్రేమ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాను. జనవరి 14న థియేటర్లలో కలుద్దాం' అన్నారు.

# జనవరి 2న 'వామ్మో వాయ్యో..'



మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో ఈ సంక్రాంతికి అద్భుతమైన వినోదాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నుంచి 'వామ్మో వాయ్యో' సాంగ్ జనవరి 2న వరంగల్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నారు. రవితేజ, ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కలర్ ఫుల్ అవుట్ ఫిట్స్‌లో మాస్ అండ్ స్టైలిష్‌గా డాన్స్ చేస్తూ కనిపించిన ఈ పోస్టర్ పర్ఫెక్ట్ ఫెస్టివల్ వైబ్‌ని సెట్ చేసింది. సాంగ్ ప్రోమో అదిరిపోయింది. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీగా ప్రేక్షకుల్ని అలరించబోతుంది. జనవరి 13న ఈ చిత్రం గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

# 'పరీక్ష సక్సెస్'

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ సెంటర్ ఈ ప్రయోగానికి వేదిక అయ్యింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వెల్లడించిన ప్రకారం ఈ పరీక్ష మంగళవారం జరిగింది. ఎస్ఎస్ఎల్‌వి అనేది ఇస్రోఅభివృద్ధి చేసిన మూడుదశల పూర్తి ఘన ప్రయోగ వాహనమని, ఇది పారిశ్రామిక ఉత్పత్తికి అనుగుణంగా ఉంటుందని, ప్రయోగాల మధ్య శీఘ్ర టర్న్‌రౌండ్ టైమ్‌తో డిమాండ్‌పై ప్రయోగాన్ని తీర్చగలదని ఇస్రో విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. మూడు దశల ఆల్ సాలిడ్ లాంచ్ వెహికిల్ ఎస్ఎస్ఎల్‌వి పనితీరును విశ్లేషించడంతో పాటు డేటాను సేకరించినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ తెలిపింది. చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలోకి వేగంగా ప్రయోగించడం కోసం ఈ ఎస్ఎస్ఎల్‌వి మూడవ దశను రూపొందించారు. అధిక స్థాయి ఉత్పత్తికి కూడా ఇది అనుకూలంగా ఉంటుందని, పేలోడ్‌కు సెకన్‌కు 4కి.మీ.ల వేగాన్ని అందించడంలో ఈ ఎస్ఎస్ఎల్‌వి ఎస్ఎస్3 కీలకపాత్ర పోషిస్తుంది అని అధికారులు తెలిపారు. పేలోడ్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని చెప్పారు. కార్బన్ ఎపాక్సీ మోటార్ కేసుతో కూడిన ఎస్ఎస్ఎల్‌వి మూడవ దశ యొక్క మెరుగైన వెర్షన్‌ను ఈ స్టాటిక్ పరీక్ష ధృవీకరించిందన్నారు. ఇది దశ యొక్క ద్రవ్యరాశిని గణనీయంగా తగ్గించిందని, తద్వారా ఎస్ఎస్ఎల్‌వి పేలోడ్ సామర్థ్యాన్ని 90 కిలోలు మెరుగుపర్చిందని ఇస్రో తెలిపింది. విక్రమ్‌సారాభాయ్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం కాంపోజిట్స్ ఎంటిటీలో అధికబలం కలిగిన కార్బన్ ఫిలమెంట్ దెబ్బతిన్న మోటార్ కేసును గమనించామని, సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి)లోని సాలిడ్ మో టార్ ఉత్పత్తి సౌకర్యాలలో సాలిడ్ మోటార్‌ను వేశామని అది జోడించింది. కొలిచిన అన్ని పారామీటర్లను 108 సెకన్ల పరీక్ష వ్యవధిలో అంచనాకు దగ్గరగా గమనించామని, ఈ విజయవంతమైన స్టాటిక్ ఫైరింగ్ పరీక్షలతో ఎస్ఎస్3 మోటార్ మెరుగైన వెర్షన్ విమానంలో ఇండక్షన్‌కు అర్హత పొందిందని ఇస్రో విడుదల చేసిన ప్రకటన తెలిపింది. ఇస్రో ప్రకారం ఈ సంవత్సరం అంతరిక్ష కార్యక్రమంకో సం ఘన మోటార్లను గ్రహించే సామర్థ్యం పెంచడానికి దేశంలో బహుళ సౌకర్యాలు ప్రారంభించబడ్డాయి. 2025 జులైలో సామర్థ్యాన్ని పెంచడానికి శ్రీహరికోటలో సాలిడ్ మోటార్ ఉత్పత్తి కార్యక్రమాలను ప్రారంభించారు. సాలిడ్ మోటార్ ప్రొడక్షన్ లైన్ కోసం 10టన్నుల స్వదేశీ నిలువు మిక్సర్ ఈ ఏడాది సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో ప్రారంభించబడిందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సాలిడ్ ప్రొపెల్లెంట్ మిక్స్‌డ్ పరికరం అని అధికారులు తెలిపారు.

# నిరంతర పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పో లిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఎ.పి, కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్‌కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు. మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. యాప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

# రైతు కళ్లల్లో కారం కొట్టి రూ.25 లక్షల దోపిడీ

**భోపాల్:** మధ్యప్రదేశ్‌లోని అశోక్ నగర్ జిల్లా తమోయి యాచక్ గ్రామంలో దొంగలు దారి కాచి ఓ రైతు కళ్లల్లో కారం కొట్టి అతడి నుంచి రూ.25లక్షలు దోచుకున్నారు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. లఖ్వీందర్ (47) అ నే రైతు అశోక్‌నగర్‌లోని బంధువుకు ఇవ్వడానికి రూ. 25 లక్షలు తీసుకొని ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరాడు. మార్గంమధ్యలో ముగ్గురు దొంగలు రైతును అడ్డగించారు. తమ వెంట తెచ్చుకున్న కారం లిఖ్వీందర్ కళ్లలో కొట్టి అతడి వద్ద ఉన్న రూ.25 లక్షల నగదు బ్యాగును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించారు. తమోయియా చక్‌మోహ్రి గ్రామాల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. కొద్దిసేపటికి తేరుకున్న రైతు... పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్ వివేక్ శర్మ తెలిపారు.









# మోదీ విధ్వంస పాలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. 'సంవత్సరం చివరి రోజున బిజెపి పాలనలో 11వ సంవత్సరమైన 2025లో దేశాన్ని ఎలా పరిపాలించారో అందరికీ గుర్తు చేయడం చాలా అవసరం' అని ఖర్గే (గతంలో ట్విట్టర్)లో హిందీలో పేర్కొన్నారు. వివిధ రంగాలలో ప్రభుత్వ వైఫల్యాలుగా ఆయన అభివర్ణించిన అనేక అంశాలను ఆయన జాబితా చేశారు. ఎన్నికల ప్రక్రియలు, జాతీయ భద్రత, విదేశాంగ విధానం, సంక్షోభ నిర్వహణలో వైఫల్యాలను, అలాగే అణగారిన వర్గాలపై పెరుగుతున్న అకత్యా లు, తీవ్రమవుతున్న పర్యావరణ, వాయు కాలుష్య సమస్యలను కూడా ఆయన ఎత్తి చూపారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేయడం ద్వారా, లక్షలాది మంది పేదల నుంచి 'పని హక్కు'ను లాక్కున్నారు. ఎలాంటి సన్నాహం లేకుండా, బిఎల్ఒలకు శిక్షణ ఇవ్వకుండా, ఎస్ఐఆర్ ద్వారా లక్షలాది మంది నుంచి 'ఓటు హక్కు'ను లాక్కున్నారు. బిజెపి ఓట్ల దొంగతనంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది. ఆర్థిక అసమానతల అగాధం మరింతగా పెరిగింది. భారత దేశ సంపద 40 శాతం అగ్రశ్రేణి 1 శాతం మంది చేతిలో ఉంది. రూపాయి పాతాళానికి పడిపోతోంది. ఆర్‌బిఐ 32 బిలియన్ డాలర్ల (2.8 లక్షల కోట్ల రూపాయలు) విలువైన అమెరికన్ డాలర్లను విక్రయించినప్పటికీ, దానివల్ల ఎలాంటి మార్పు రాలేదు. యువతలో నిరుద్యోగం గరిష్ట స్థాయిలో ఉంది. ప్రశ్నపత్రాల లీక్ మాఫియా ఆట నిరాటంకంగా కొనసాగుతోంది. మోదీ స్నేహితుడు 'నమస్తే ట్రంప్' మన దేశంపై ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను విధించారు. పుల్వామా ఉగ్ర దాడి తర్వాత మన శక్తివంతమైన సైన్యం తగిన ప్రతీకారం తీర్చుకుంది. కానీ బిజెపి మంత్రులు మన కల్నల్ గురించి సిగ్గుచేటయిన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ కనీసం 60సార్లు 'మధ్యవర్తిత్వం' గురించి చెప్పారు. ఇప్పుడు చైనా కూడా 'మధ్యవర్తిత్వం' గురించి మాట్లాడుతోంది. కానీ మోదీ మౌనంగా ఉన్నారు' అని విమర్శించారు. 'పెరుగుతున్న సామాజిక, ఆర్థిక సంక్షోభానికి కారణమవుతూనే, పరిపాలనా లోపాలు, మానవ విషాదాలకు ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించుకుందని ఖర్గే ఆరోపించారు. మణిపూర్‌లో మోదీషా వైఫ ల్యం చెందారు. దానిని కప్పిపుచ్చడానికే రాష్ట్రపతి పాలన విధించారు. ద్రవ్యోల్బణం నుంచి ఎలాంటి ఉపశమనం లేదు. జిఎస్‌టి నుంచి తగ్గింపు కేవలం లెక్కల గారడీ అని తేలింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలపై అకత్యాలు పెరిగిపోయాయి. చివరికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా వదల్లేదు. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశమంతా విషపూరిత వాయు కాలుష్యంతో సతమతమవుతోంది. ఎలాంటి కార్యాచరణ ప్రణాళిక లేదు. కేవలం డొల్ల మాటలే. అరావళి పర్వతాలను మైనింగ్ మాఫియాకు అప్పగించే కుట్ర. నికోబార్, హస్దియో, ముంబై మడ అడవులపై దాడు లు. కుంభమేళా తొక్కిసలాట అయినా, ఢిల్లీ స్టేషన్ గందరగోళం అయినా, దగ్గు మందు వల్ల అమాయక ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయినా ఎవరూ బాధ్యత వహించడం లేదు' అని పేర్కొన్నారు. తన విమర్శలను ముగిస్తూ 'మొ త్తం మీద, 2025లో కూడా బిజెపి దోపిడీ, అవినీతి, దుర్మార్గపు పాలన దేశ ప్రజలపై తీవ్రంగా కొనసాగింది' అని ఖర్గే తెలిపారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com